www.trinetnews.com

# త్రైనెట్ తెలంగాణ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

సంపుటి 01 సంచిక 62 ఎడిటర్ :వెంకటేశ్వర్లు రాపోలు మంగళవారం అక్టోబర్ 06, 2026 పేజీలు:12 వెల.10/-

**ఇందిరమ్మ టవర్స్ లబ్ధిదారులకు ఆఖరి అవకాశం.. అక్టోబర్ 9 లోగా ఈ పనిచేయకపోతే ఫ్లాట్ పోయినట్టే!**




2లో



# 18 నెలల్లో భూ సర్వే పూర్తి

**ప్రతి భూమికి LPM నంబర్**

**'భూదార్' పేరుతో కొత్త పాస్ పుస్తకాలు**

- మూడు విడతల్లో భూ సర్వే
- భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం
- ఆదిలాబాద్‌లో భూ సమస్యలపై ప్రత్యేక కమిటీ
- 73 వేల గుడిసెలు గుర్తింపు
- అర్హులకు రెండో విడతలో ఇళ్లు
- దసరా నాటికి మరో 2 లక్షల ఇళ్లు

**ఆదిలాబాద్:**
రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో భూ సర్వేను చేపడుతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో సమీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. ఎగ్జిక్యూటివ్బాడండి
రెవెన్యూ, సర్వే, హౌసింగ్, రిజిస్ట్రేషన్ శాఖల పనితీరుపై సమీక్షలు నిర్వహిస్తున్నామని మంత్రి వెల్లడించారు. సుమారు 120 ఏళ్ల క్రితం రాష్ట్రంలో భూ సర్వే జరిగిందని, ప్రస్తుతం మళ్లీ మూడు విడతల్లో భూ సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మొదటి విడత సర్వే కొనసాగుతోందన్నారు.
భూ సర్వే కీలకమైన అంశమని, ఆర్థిక భారం ఉన్నప్పటికీ ప్రభుత్వం సర్వేను చేపడుతోందని మంత్రి పేర్కొన్నారు. ఏడాదిన్నరలోపు భూ సర్వేను పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. సర్వే అనంతరం ప్రతి భూమికి ఎల్‌పీఎం నంబర్ కేటాయించి, 'భూదార్' పేరుతో పాస్ పుస్తకాలు అందించే ప్రక్రియ చేపడతామని చెప్పారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గిరిజనులు, గిరిజనేతరులకు సంబంధించిన భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర స్థాయిలో ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామని చెప్పారు. భూ వివాదాలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులను మందలించినట్లు తెలిపారు. ఎగ్జిక్యూటివ్బాడండి

**రెండో విడతలో ఇళ్లు**
రాష్ట్రంలో గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాలపై నిర్వహించిన పరిశీలనలో సుమారు 73 వేల ఇళ్లు/గుడిసెలు ఉన్నట్లు గుర్తించామని మంత్రి తెలిపారు. వీటిలో అర్హులైన వారికి రెండో విడతలో ఇళ్లను మంజూరు చేస్తామని చెప్పారు.తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఇప్పటివరకు 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని, రాష్ట్రంలో ఇప్పటివరకు మొత్తం 8 లక్షల ఇళ్లను అందించినట్లు మంత్రి వెల్లడించారు.రాబోయే దసరా నాటికి మరో 2 లక్షల ఇళ్లను పూర్తి చేసే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. రాబోయే రోజుల్లో మరో రెండు విడతల్లో ఇళ్లను మంజూరు చేసే ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.



## బాధ్యులైన పోలీసులపై
# తక్షణ చర్యలు

- మహిళలపై పోలీసుల దురుసు ప్రవర్తనపై ఆగ్రహం
- కెమెరాలు లాక్కొని.. ఈడ్చుకెళ్లారన్న ఆరోపణలు
- ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ కూడా నమోదు కాలేదని వ్యాఖ్య
- సాకేత్ పోలీస్‌స్టేషన్ సీసీటీవీ బయటపెట్టాలి
- బాధిత మహిళలకు న్యాయం చేయాలని డిమాండ్

ప్రశ్నించే మహిళలను చూసి కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఎందుకు భయపడుతున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. మహిళలను అణచివేసే ధోరణి దిల్లీలో స్పష్టంగా కనిపిస్తోందని ఆయన ఆరోపించారు. దిల్లీ పోలీసులు ఇటీవల మహిళలపై దాడులు, దురుసు ప్రవర్తనకు పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో.. బాధితులకు న్యాయం చేయాలని రాహుల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇటీవల జర్నలిస్టులు షహీన్ ఖాన్, నఫీసా ఖాన్‌లతో జరిపిన సంభాషణకు సంబంధించిన వీడియోను ఆయన 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. పోలీసులు దురుసుగా ప్రవర్తించారని జర్నలిస్టులు తనతో చెప్పి ఆవేదన వ్యక్తం చేశారని రాహుల్ తెలిపారు. కెమెరాలు లాక్కోవడంతో పాటు వారిని ఈడ్చుకెళ్లడం ఏంటని ప్రశ్నించారు. వారి ఫిర్యాదుపై కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదని పేర్కొన్నారు. "మహిళలు ఫిర్యాదు చేసేందుకు వెళ్తే.. పోలీస్‌స్టేషన్‌లోనే ఇలాంటి ఘటనలు జరగడం దారుణం. రక్షించాల్సిన వారే వారికి ప్రమాదంగా మారుతున్నారు. సాకేత్ పోలీస్‌స్టేషన్‌లోని సీసీటీవీ దృశ్యాలను బహిర్గతం చేయాలి. బాధ్యులైన పోలీసు అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలి" అని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద.. కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ఇటీవల పెద్దఎత్తున ఆందోళనలు జరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మహిళా నిరసనకారులు, జర్నలిస్టులపై పోలీసులు అనుచితంగా ప్రవర్తించారని తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.




## ఫోన్ ట్యాపింగ్ కేసు.. కాంగ్రెస్ నేత కోదండ రెడ్డిని విచారించిన సిట్

**హైదరాబాద్:**
ఫోన్ ట్యాపింగ్ కేసులో కాంగ్రెస్ సీనియర్ నేత కోదండరెడ్డిని సిట్ అధికారులు విచారించారు. ఆయన కార్యాలయానికే వెళ్లి, దాదాపు 40 నిమిషాలకుపైగా వివిధ అంశాలపై ప్రశ్నించి, స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఆయన పేరు వెలుగులోకి రావడంతో ఇటీవల సిట్ అధికారులు ఆయనకు నోటీసులు జారీ చేశారు. 2023 ఎన్నికల సమయంలో ఆయన ఫోన్ కొన్ని నెలలు ట్యాప్ అయినట్లు గుర్తించారు.



2లో

## ఏసీబీకి చిక్కిన టౌన్ ప్లానింగ్ అధికారిణి

**హైదరాబాద్:**
ఏసీబీ వలలో మరో అవినీతి అధికారిణి చిక్కింది. రూ. 4 లక్షలు లంచం తీసుకుంటూ మోహదీపట్నం టౌన్ ప్లానింగ్ అధికారిణి టి.సునీత పట్టుబడింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. మోహదీపట్నం జీహెచ్ఎంసీ ఆఫీసులో జరిగిన సోదాలలో సునీత ఏసీబీకి పట్టుబడింది.

## అనర్హత వేటు తప్పదని ముందే తెలుసు

- » మరో పార్టీ తరపున పోటీ చేయడమే కారణం
- » అఫిడవిట్ వల్ల డిస్‌క్వాలిఫికేషన్ కాదు
- » పార్టీ నిర్ణయం మేరకే పోరాటం చేశా
- » విజయారెడ్డి పిటిషన్‌పై ఇప్పటికే అఫిడవిట్
- » ఖైరతాబాద్ ఉపఎన్నికపై ఉత్కంఠ
- » తీర్పు వచ్చే వరకు ఉపఎన్నిక వద్దంటున్న విజయారెడ్డి



2లో

## సింగరేణి కార్మికులకు
# రూ.1,10,250 బోనస్

- దసరా, దీపావళి కానుకగా భారీ బోనస్
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటన
- కార్మికుల శ్రమ వెలకట్టలేనిది
- సింగరేణి తెలంగాణకు కొంగు బంగారం
- బొగ్గు ఉత్పత్తి మరింత పెంచాలి
- రాష్ట్ర ప్రభుత్వం రూ.60 వేల కోట్లు విడుదల చేయాలి

2లో

**హైదరాబాద్:**
దసరా, దీపావళి పండగల కానుకగా సింగరేణి కార్మికులకు ఒక్కొక్కరికి రూ.1,10,250 చొప్పున బోనస్ ఇవ్వాలని నిర్ణయించినట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. దేశానికి వెలుగులు పంచేందుకు పగలు, రాత్రి కష్టపడి పనిచేస్తున్న సింగరేణి కార్మికుల శ్రమ వెలకట్టలేనిదని 'ఎక్స్' వేదికగా కొనియాడారు. సింగరేణి అనేది బొగ్గు ఉత్పత్తి సంస్థ మాత్రమే కాదని.. తెలంగాణ రాష్ట్రానికి కొంగు బంగారమన్నారు.



## గెలిస్తే ఈవీఎంలు మంచివి..
# ఓడితే కాదా?

- కాంగ్రెస్‌పై రామచందర్‌రావు ఫైర్
- ఎన్నికలు అక్రమమైతే రేవంత్ రాజీనామా చేయాలి
- కాంగ్రెస్ ఆరోపణలకు ఆధారాలేంటి?
- కేసీఆర్ కుటుంబం.. ఇప్పుడు రేవంత్ బ్రదర్స్ బాగుపడుతున్నారు
- ప్రజలకు డబ్బుల్లేవు.. ఢిల్లీకి మూటలా?
- తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తెద్దాం

2లో

**హైదరాబాద్:**
నెహ్రూ కుటుంబంలోని వ్యక్తి ప్రధాని కావడంలేదని కాంగ్రెస్ నేతలు ఓర్వలేకపోతున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు.



## విద్యుత్ వినియోగదారులపై
# మరో భారం

- » రూ.7,635 కోట్ల ట్రూ-అప్ వసూళ్లకు గ్రీన్‌సిగ్నల్
- » నవంబర్ నుంచే కరెంట్ బిల్లుల్లో కొత్త ఛార్జీ
- » మొదటి నెల యూనిట్‌కు 30 పైసలు
- » ఆ తర్వాత యూనిట్‌కు 50 పైసలు
- » ఇతర వినియోగదారుల నుంచి రూ.5,420 కోట్ల వసూలు
- » రైతులపై ప్రత్యక్ష భారం లేదు
- » రైతుల రూ.2,215 కోట్ల బకాయిని ప్రభుత్వం చెల్లించాలి
- » 26--29 నెలల్లో ట్రూ-అప్ రికవరీ

2లో..



**హైదరాబాద్:**
తెలంగాణ విద్యుత్ వినియోగదారులపై మరో ఆర్థిక భారం పడనుంది. 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన విద్యుత్ కొనుగోలు, ఆదాయ ట్రూ-అప్ మొత్తాల్లో రూ.7,635.22 కోట్లను టీజీఎస్‌పీడీసీఎల్, టీజీఎన్‌పీడీసీఎల్ ద్వారా వసూలు చేసేందుకు తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ) మార్గాన్ని ఖరారు చేసింది.

## తెలంగాణ హైకోర్టు తాత్కాలిక సీజేగా సామ్ కోషి

- సీజే అపరేష్ కుమార్ సింగ్ సుప్రీంకోర్టుకు
- మూడు దశాబ్దాల సుదీర్ఘ న్యాయ అనుభవం
- 1991లో న్యాయవాదిగా ప్రస్థానం
- ప్రభుత్వ న్యాయవాదిగా, డీఏజీగా సేవలు
- 2013లో హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియామకం
- 2023లో తెలంగాణ హైకోర్టుకు బదిలీ
- గతంలోనూ తాత్కాలిక సీజేగా బాధ్యతలు

2లో



## ఎస్ఐఆర్‌పై సీఈవో
# కీలక ఆదేశాలు

**తప్పుడు ప్రకటనలు చేస్తే చర్యలు తప్పవు**

- ఫారం-7 బల్క్ దరఖాస్తులపై ప్రత్యేక నజర్
- తప్పుడు సమాచారంపై కేసులు తప్పవు
- ఆర్‌పీ యాక్ట్ సెక్షన్ 31 ప్రకారం చర్యలు
- చర్యలకు ముందు విచారణ తప్పనిసరి
- ఎస్ఐఆర్ అభ్యంతరాల గడువు అక్టోబర్ 7 వరకు
- తుది ఓటర్ల జాబితా నవంబర్ 9న



2లో..

**హైదరాబాద్:**
తెలంగాణ రాష్ట్రంలో ఎస్ఐర్(ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ) అంశానికి సంబంధించి చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్(సీఈవో) సుదర్శన్ రెడ్డి హెచ్చరికలు జారీ చేశారు.

# తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సామ్ కోషి నియామకం!

మొదటిపేజీ తరువాయి

ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో.. ఆయన స్థానంలో జస్టిస్ సామ్ కోషి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నారు.

జస్టిస్ పి. సామ్ కోషికి సుదీర్ఘ న్యాయ అనుభవం ఉంది. 1967 ఏప్రిల్ 30న జన్మించిన ఆయన.. 1987లో కామర్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ, 1990లో న్యాయశాస్త్రంలో డిగ్రీ పూర్తి చేశారు. 1991 మార్చి 9న న్యాయవాదిగా నమోదు చేసుకుని న్యాయవృత్తిలోకి ప్రవేశించారు. సివిల్, రాజ్యాంగ, సర్వీస్, కార్మిక చట్టాలకు సంబంధించిన కేసుల్లో వాదనలు వినిపించారు. తొలుత మధ్యప్రదేశ్ హైకోర్టు జబల్‌పూర్‌లో 1991 నుంచి 2000 అక్టోబర్ వరకు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. అనంతరం 2000 నవంబర్ నుంచి ఛత్తీస్‌గఢ్ హైకోర్టు బిలాస్‌పూర్‌లో ప్రాక్టీస్ చేస్తూ దాదాపు 13 ఏళ్ల పాటు న్యాయవాదిగా కొనసాగారు.

న్యాయవాదిగా ఉన్న సమయంలో ప్రభుత్వానికి కూడా న్యాయసేవలు అందించారు. 2002 నుంచి 2004 వరకు ఛత్తీస్‌గఢ్ హైకోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా పనిచేశారు. 2005-06లో డిప్యూటీ అడ్వకేట్ జనరల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. హిదాయతుల్లా నేషనల్ లా యూనివర్సిటీ, రాయ్‌పూర్ అకాడమిక్ కౌన్సిల్‌లో సభ్యుడిగా కూడా పనిచేశారు. న్యాయవాదిగా ఉన్న సమయంలో సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే, కోల్ ఇండియా లిమిటెడ్, సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్, నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, హిందుస్థాన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియం తదితర ప్రముఖ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు న్యాయపరమైన వ్యవహారాల్లో ప్రాతినిధ్యం వహించారు.

సుదీర్ఘ న్యాయవాద వృత్తి అనంతరం 2013 సెప్టెంబర్ 16న ఛత్తీస్‌గఢ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా జస్టిస్ సామ్ కోషి నియమితులయ్యారు. అనంతరం 2016 మార్చి 8న శాశ్వత న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. న్యాయమూర్తుల బదిలీలో భాగంగా తెలంగాణ హైకోర్టుకు బదిలీ అయిన ఆయన.. 2023 జూలై 27న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. అప్పటి నుంచి తెలంగాణ హైకోర్టులో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ సీనియర్ న్యాయమూర్తిగా కొనసాగుతున్నారు.

జస్టిస్ సామ్ కోషికి తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి బాధ్యతలు నిర్వహించడం ఇది మొదటిసారి కాదు. గతంలో 2025 జూలై 18 నుంచి 19 వరకు అప్పటి ప్రధాన న్యాయమూర్తి అందుబాటులో లేని సమయంలో తాత్కాలికంగా చీఫ్ జస్టిస్ విధులను నిర్వహించారు. ఇప్పుడు జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన నేపథ్యంలో మరోసారి తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ పి. సామ్ కోషి బాధ్యతలు చేపట్టనున్నారు.

దాదాపు మూడు దశాబ్దాల న్యాయవృత్తి అనుభవం, ప్రభుత్వ న్యాయవాదిగా, డిప్యూటీ అడ్వకేట్ జనరల్‌గా పనిచేసిన అనుభవం, ఛత్తీస్‌గఢ్ హైకోర్టు అదనపు, శాశ్వత న్యాయమూర్తిగా నిర్వహించిన బాధ్యతలు, తెలంగాణ హైకోర్టులో సీనియర్ న్యాయమూర్తిగా కొనసాగుతున్న అనుభవం.. ఇవన్నీ జస్టిస్ సామ్ కోషి న్యాయ ప్రస్థానంలో కీలక మైలురాళ్లుగా నిలిచాయి. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా ఆయన బాధ్యతలు చేపట్టడంతో తెలంగాణ హైకోర్టు పరిపాలనా వ్యవహారాల్లో ఆయన

# విద్యుత్ వినియోగదారులపై మరో భారం

మొదటిపేజీ తరువాయి

ఇందులో వ్యవసాయ రంగానికి సంబంధించిన రూ.2,214.99 కోట్లను రైతుల నుంచి వసూలు చేయకుండా ప్రభుత్వం నుంచి రాబట్టాలని ఆదేశించింది. మిగిలిన రూ.5,420.23 కోట్లను ఇతర అర్హత కలిగిన విద్యుత్ కనెక్షన్ల నుంచి వసూలు చేయాలని నిర్ణయించింది.

టీజీఈఆర్సీ చైర్మన్ డాక్టర్ జస్టిస్ దేవరాజు నాగార్జున, సభ్యులు రఘు కంచర్ల, చెరుకూరి శ్రీనివాసరావులతో కూడిన కమిషన్ సోమవారం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. 2026 మార్చి 30న ఇచ్చిన ఉత్తర్వుల్లో వసూలు విధానాన్ని తరువాత నిర్ణయిస్తామని పేర్కొన్న కమిషన్.. తాజా ఉత్తర్వులతో ఆ విధానాన్ని ఖరారు చేసింది.

### రూ.7,635 కోట్ల ట్రూ-అప్

2022-23 సంవత్సరానికి విద్యుత్ కొనుగోలు ట్రూ-అప్ కింద రూ.5,186.29 కోట్లు నిర్ణయించారు. ఇందులో టీజీఎస్‌పీడీసీఎల్ వాటా రూ.3,329.97 కోట్లు, టీజీఎన్‌పీడీసీఎల్ వాటా రూ.1,856.32 కోట్లు. 2023-24 సంవత్సరానికి ఆదాయ ట్రూ-అప్ రూ.2,448.93 కోట్లు కాగా.. టీజీఎస్‌పీడీసీఎల్‌కు రూ.2,335.45 కోట్లు, టీజీఎన్‌పీడీసీఎల్‌కు రూ.113.48 కోట్లు ఉన్నాయి. మొత్తంగా రెండు డిస్కంలకు కలిపి రూ.7,635.22 కోట్లుగా తేలింది.

### రైతులపై భారం లేదు

వ్యవసాయ రంగానికి సంబంధించి రెండు ఆర్థిక సంవత్సరాల్లో కలిపి రూ.2,214.99 కోట్ల ట్రూ-అప్ ఉన్నట్లు కమిషన్ గుర్తించింది. ఇందులో టీజీఎస్‌పీడీసీఎల్ పరిధిలో రూ.1,442.49 కోట్లు, టీజీఎన్‌పీడీసీఎల్ పరిధిలో రూ.772.50 కోట్లు ఉన్నాయి. ఉచిత విద్యుత్ విధానాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ మొత్తాన్ని రైతుల నుంచి వసూలు చేయకూడదని స్పష్టం చేసింది. బదులుగా ఈ మొత్తాన్ని ప్రభుత్వం నుంచి రాబట్టేందుకు డిస్కంలు చర్యలు చేపట్టాలని ఆదేశించింది.

### నవంబర్ నుంచే వసూళ్లు

ఇతర కేటగిరీల వినియోగదారుల నుంచి వసూలు చేయాల్సిన రూ.5,420.23 కోట్లలో టీజీఎస్‌పీడీసీఎల్ వాటా రూ.4,222.93 కోట్లు, టీజీఎన్‌పీడీసీఎల్ వాటా రూ.1,197.30 కోట్లు. ఈ వసూళ్లు 2026 నవంబర్‌లో జారీ చేసే కరెంట్ బిల్లుల నుంచే ప్రారంభం కానున్నాయి.

మొదటి నెలలో యూనిట్‌కు 30 పైసలు, ఆ తర్వాత నెలల నుంచి యూనిట్‌కు 50 పైసలు చొప్పున ట్రూ-అప్ రికవరీ చేయాలని కమిషన్ నిర్ణయించింది. వినియోగదారుడి 2022-23, 2023-24 సంవత్సరాల వినియోగాన్ని ఆధారంగా చేసుకుని నెలవారీ బిల్లింగ్ పరిమాణాన్ని నిర్ణయిస్తారు.

### 29 నెలలు.. 26 నెలలు

టీజీఎస్‌పీడీసీఎల్ పరిధిలో 29 బిల్లింగ్ నెలలు, టీజీఎన్‌పీడీసీఎల్ పరిధిలో 26 బిల్లింగ్ నెలల్లో ఈ మొత్తాన్ని రాబట్టేలా కమిషన్ వ్యవధిని నిర్దేశించింది. అయితే ఏ వినియోగదారుడి నుంచి అయినా అతని 2022-23, 2023-24 సంవత్సరాల వినియోగానికి సంబంధించిన ట్రూ-అప్ మొత్తాన్ని మించి వసూలు చేయరాదని స్పష్టం చేసింది.

### బిల్లులో ప్రత్యేకంగా చూపాలి

ట్రూ-అప్ ఛార్జీని సాధారణ విద్యుత్ బిల్లులో కలిపేయకుండా ప్రత్యేక అంశంగా చూపించాలని టీజీఈఆర్సీ ఆదేశించింది. ఏ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మొత్తం, ఎంత నెలవారీ వినియోగంపై లెక్కించారో, ఏ రేటును వర్తింపజేశారో బిల్లులో స్పష్టంగా పేర్కొనాలి. ఒక బిల్లింగ్ నెలలో రెండు ఆర్థిక సంవత్సరాల రికవరీ ఉంటే.. రెండింటినీ విడివిడిగా చూపాలి.

మొదటి ట్రూ-అప్ ఛార్జీ బిల్లు జారీకి ముందు టీజీడిస్కంలు తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో ఒక్కో విస్తృత ప్రచారం ఉన్న దినపత్రికలో నోటీసు ఇవ్వాలని కూడా కమిషన్ ఆదేశించింది. వసూలు విధానం, రేటు, వ్యవధిని అందులో వివరించాలి.

### సుప్రీంకోర్టు మార్గదర్శకాల నేపథ్యంలో..

ట్రూ-అప్ వసూళ్ల నిర్ణయం తీసుకునేటప్పుడు సుప్రీంకోర్టు, ఏపిటీఈఎల్ ఇచ్చిన మార్గదర్శకాలను కమిషన్ పరిగణనలోకి తీసుకుంది. టారిఫ్ సాధ్యమైనంత వరకు వ్యయానికి అనుగుణంగా ఉండాలని, రెగ్యులేటరీ ఆస్తుల భారం పరిమితంగా ఉండాలని, ఇప్పటికే ఉన్న రెగ్యులేటరీ ఆస్తులను గరిష్ఠంగా నాలుగేళ్లలో పరిష్కరించాల్సిన అవసరం ఉందని ఆదేశాలను ఉత్తర్వుల్లో ప్రస్తావించింది.

మొత్తానికి.. నవంబర్ నుంచి కరెంట్ బిల్లుల్లో కొత్త ట్రూ-అప్ ఛార్జీ కనిపించనుంది. వ్యవసాయ వినియోగదారులకు మాత్రం ప్రత్యక్ష భారం లేకుండా రూ.2,214.99 కోట్లను ప్రభుత్వం నుంచి రాబట్టే విధానాన్ని కమిషన్ ఖరారు చేసింది. మిగిలిన రూ.5,420.23 కోట్ల భారం ఇతర అర్హత కలిగిన వినియోగదారులపై పడనుంది.

# ఇందిరమ్మ టవర్స్ లబ్ధిదారులకు ఆఖరి అవకాశం.. అక్టోబర్ 9 లోగా ఈ పనిచేయకపోతే ఫ్లాట్ పోయినట్టే!

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ అఫోర్డబుల్ హౌసింగ్ స్కీమ్ కింద ఫ్లాట్లు పొందిన లబ్ధిదారులకు తెలంగాణ గృహనిర్మాణ శాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రొవిజనల్ అల్లాట్‌మెంట్ పొందినవారు తొలి విడత విరాళంగా చెల్లించాల్సిన రూ.1 లక్ష మొత్తానికి చివరి గడువును అక్టోబర్ 9 సాయంత్రం వరకు పొడిగిస్తూ ఆఖరి హెచ్చరిక జారీ చేసింది.




**చెల్లింపుల స్థితి -- నియోజకవర్గాల స్పందన:**
ప్రభుత్వం ఉచిత లాటరీ పద్ధతి ద్వారా 5,501 మంది అర్హులైన పేదలకు తాత్కాలిక కేటాయింపు పత్రాలను అందించింది. అయితే, ఇప్పటివరకు 3,271 మంది (సుమారు 59.46 శాతం) మాత్రమే రూ. 1 లక్ష మొత్తాన్ని జమా చేశారు. ఇంకా 40 శాతానికి పైగా లబ్ధిదారులు చెల్లింపులు పూర్తి చేయాల్సి ఉంది.

అత్యధిక చెల్లింపులు: కూకట్‌పల్లి నియోజకవర్గంలో గరిష్ఠంగా 81.05శాతం మంది లబ్ధిదారులు చెల్లింపులు పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచారు. శేరిలింగంపల్లి (74.94శాతం), కుత్బుల్లాపూర్ (73.87శాతం), నాంపల్లి (73.83శాతం), కార్వాన్ (68.85శాతం) ప్రాంతాల్లోనూ మంచి స్పందన లభించింది.

అత్యల్ప చెల్లింపులు: ఇబ్రహీంపట్నం, మల్కాజిగిరి, సనత్‌నగర్ ప్రాంతాల్లో ప్రక్రియ నెమ్మదిగా సాగుతుండగా, ఖైరతాబాద్ నియోజకవర్గంలో అత్యల్పంగా కేవలం 17.16శాతం మంది మాత్రమే డబ్బులు చెల్లించారు.

**గడువు దాటితే ఫ్లాట్ రద్దు -- అధికారుల ఖచ్చితమైన ఆదేశాలు:**
తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి. గౌతమ్ స్పష్టం చేసిన వివరాల ప్రకారం, అక్టోబర్ 9 తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ గడువు పొడిగించబడదు. నిర్ణీత తేదీలోగా రూ.1 లక్ష చెల్లించని వారి ప్రొవిజనల్ అల్లాట్‌మెంట్ తక్షణమే రద్దవుతుంది. ప్రస్తుతం ఈ ఫ్లాట్ల కోసం దాదాపు 35,000 మంది దరఖాస్తుదారులు వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నారు. రద్దయిన ఫ్లాట్లను తదుపరి లాటరీ ద్వారా వీరికి కేటాయిస్తారు. ఒక్కో ఫ్లాట్ నిర్మాణ వ్యయం దాదాపు రూ.11 లక్షలు కాగా, ప్రభుత్వం రూ.5 లక్షల భారీ సబ్సిడీని అందిస్తోంది.

**చెల్లింపుల విధానం, సహాయక సమాచారం:**
లబ్ధిదారులు తమ అల్లాట్‌మెంట్ లెటర్‌లో ఇచ్చిన వర్చువల్ అకౌంట్ నంబర్ మరియు IFSC కోడ్ ఉపయోగించి నెట్ బ్యాంకింగ్, UPI లేదా ఇతర డిజిటల్ విధానాల ద్వారా చెల్లింపులు చేయవచ్చు.

**అధికారిక వెబ్‌సైట్** : tghb.telangana.gov.in

**కాల్ సెంటర్ నంబర్: 040-24603572**

అధికారిక సందేశాలు: రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు TGHBO-S పేరుతో వచ్చే SMS / WhatsApp సందేశాలను

# సింగరేణిని కాంగ్రెస్ నిర్వీర్యం చేస్తోంది: కవిత

కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణిలో కారుణ్య నియామకాలను క్రమంగా తగ్గిస్తూ సంస్థను నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ (టీఆర్ఎస్) కల్వకుంట్ల కవిత ఆరోపించారు. డిపెండెంట్ ఉద్యోగాలు ప్రభుత్వం ఇచ్చే భిక్ష కాదని కార్మికుల హక్కు అని అన్నారు. సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీఆర్ఎస్ ఆధ్వర్యంలో లక్డీకాపూల్ లోని సింగరేణి భవన్ ముట్టడికి యత్నించారు. ఈ సందర్భంగా కవిత హెచ్ఎంఎస్, టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి సింగరేణి భవన్ ముందు బైఠాయించారు. నినాదాలతో హోరెత్తించారు. సింగరేణి సీఎండీ వచ్చి తమకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చే వరకు కదిలే ప్రసక్తే లేదని ఆమె స్పష్టం చేశారు.



దీంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కవిత మాట్లాడుతూ.. సింగరేణిలో మెడికల్ బోర్డు ద్వారా అనర్హులుగా (అన్‌ఫిట్) మారిన కార్మికుల స్థానంలో వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. డిపెండెంట్

# ఇలా అవుతుందని నాకెప్పుడో తెలుసు : దానం నాగేందర్

మొదటిపేజీ తరువాయి

ఖైరతాబాద్ రాజకీయాల్లో పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ఎమ్మెల్యే పదవిపై అనర్హత వేటు, విజయారెడ్డి ఎన్నికల పిటిషన్, ఉపఎన్నికల చర్చల నేపథ్యంలో దానం నాగేందర్ తాజాగా స్పందించారు.

అఫిడవిట్ అంశం కారణంగా నేను డిస్క్వాలిఫై కాలేదు. మరో పార్టీ తరఫున పోటీ చేయడం వల్లే అనర్హత వేటు పడింది. ఇలాంటి పరిణామాలు వస్తాయని నాకు ముందే తెలుసు. పార్టీ నిర్ణయం మేరకే పోరాటం చేశా. విజయారెడ్డి వేసిన పిటిషన్‌పై గతంలోనే కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసినట్లు గుర్తు చేశారు.

గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి బీఆర్ఎస్ తరఫున గెలుపొందిన దానం నాగేందర్, ఆ తర్వాత మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో వేరే పార్టీ తరఫున పోటీ చేయడం తదితర పరిణామాలతో ఆయనపై అనర్హత వేటు పడింది. ఈ క్రమంలోనే ఖైరతాబాద్ స్థానం ఖాళీ అయినట్లు అసెంబ్లీ సెక్రటేరియట్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

మరోవైపు, ఎన్నికల సమయంలో దానం నాగేందర్ అఫిడవిట్‌లో సరైన సమాచారం ఇవ్వలేదంటూ విజయారెడ్డి గతంలోనే హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. దానం ఎన్నిక రద్దయితే తనను ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా ప్రకటించాలని ఆమె కోరుతున్నారు. ఈ పిటిషన్‌పై తీర్పు వచ్చే వరకు ఉపఎన్నిక నిర్వహించ వద్దని కోర్టును ఆశ్రయించారు. దీనిపై రాజకీయంగా ఎంతో ఉత్కంఠ నెలకొన్న వేళ.. దానం నాగేందర్ చేసిన తాజా వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి.

# ఎస్ఐఆర్‌పై సీఈవో కీలక ఆదేశాలు

మొదటిపేజీ తరువాయి

ఫారం-6, 6ఏ, 7, 8లో తప్పుడు ప్రకటనలు చేస్తే చర్యలు తప్పవంటూ హెచ్చరించారు. ప్రధానంగా ఫారం-7లో బల్క్ దరఖాస్తుల అంశానికి సంబంధింది ఎన్నికల కమిషన్ దృష్టి పెట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

ఆ దరఖాస్తులు నిజమైనవి కావంటూ ఆరోపణలు ఉన్నాయని, తప్పుడు సమాచారం ఇచ్చిన వారిపై చర్యలు తప్పవన్నారు. తప్పుడు ప్రకటనలపై ఆర్పీ యాక్ట్, 1950లోని సెక్షన్ 31 ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ డీఈఓతో పాటు అన్ని జిల్లాల కలెక్టర్లు, డీఈఓలకు ఆదేశాలు జారీ చేశారు. చర్యలకు ముందు రూల్-20 ప్రకారం విచారణ తప్పనిసరిగా ఉండాలని సీఈఓ సూచించారు.

### బల్క్ దరఖాస్తులు అంటే ఏమిటి..?

సాధారణంగా ఒక వ్యక్తి తనకు తెలిసిన ఒకరిద్దరి ఓట్లపై (మరణించినా లేదా ఇల్లు మారినా) స్వయంగా ఫిర్యాదు చేస్తారు. కానీ రాజకీయ లబ్ధి కోసమో లేదా ఇతర వ్యూహాలతోనో కొన్ని సంస్థలు లేదా వ్యక్తులు ఒక నిర్దిష్ట ప్రాంతంలో (ఉదాహరణకు ఒక నియోజకవర్గం లేదా బూత్ పరిధిలో) పెద్ద మొత్తంలో ఓట్లను తొలగించాలని ఇలాంటి బల్క్ దరఖాస్తులు ఇస్తుంటారు. ఇప్పుడు దీనిపై తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ దృష్టి సారించింది.

కాగా, తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) గడువును పొడిగించిన సంగతి తెలిసిందే. అభ్యంతరాలను స్వీకరించే గడువు గత షెడ్యూల్ ప్రకారం గత నెల సెప్టెంబరు 16 వరకు ఉంది. అయితే, దీన్ని ఇప్పుడు అక్టోబరు 7 వరకు పొడిగించారు. తుది జాబితాను గత షెడ్యూల్ ప్రకారం.. అక్టోబరు 19న ప్రకటించాల్సి ఉండగా, రివైజ్డ్ షెడ్యూల్ ప్రకారం ఇప్పుడు నవంబరు 9న ప్రకటిస్తారు.

# గెలిస్తే ఈవీఎంలు మంచివి.. ఓడితే కాదా?

మొదటిపేజీ తరువాయి

అందుకే భాజపా అక్రమంగా గెలుస్తోందని నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు చెప్పినట్లుగా ఎన్నికలు అక్రమంగా జరిగితే.. సీఎం రేవంత్ రెడ్డి కూడా చట్టవిరుద్ధంగా గెలుపొందారని, ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేరళ, హిమాచల్ ప్రదేశ్ సీఎంలనూ రాజీనామా చేయించాలని సవాల్ విసిరారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

"గతంలో కేసీఆర్ కుటుంబం, ఇప్పుడు రేవంత్ బ్రదర్స్ బాగుపడుతున్నారు తప్పితే తెలంగాణ ప్రజలు మాత్రం బాగుపడడం లేదు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవు కానీ, దిల్లీకి మూటలు పంపడానికి ఉన్నాయా? మీరు గెలిస్తే ఈవీఎంలు మంచివి.. ఓడిపోతే మంచివి కాదా? తెలంగాణలో భాజపాను అధికారంలోకి తెచ్చుకుందాం" అని రామచందర్‌రావు పిలుపునిచ్చారు.

# సింగరేణి కార్మికులకు రూ.1,10,250 బోనస్

మొదటిపేజీ తరువాయి

లక్షలాది కుటుంబాలకు జీవనాధారమని కొనియాడారు.
"రాష్ట్ర, దేశ అభివృద్ధిలో సింగరేణి కీలక భాగస్వామి. కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, భవిష్యత్తు కోసం సింగరేణి యాజమాన్యం పనిచేయాలి. ప్రస్తుత అవసరాలు, భవిష్యత్తు దృష్ట్యా బొగ్గు ఉత్పత్తిని మరింతగా పెంచేందుకు ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలి. దేశ ప్రగతిలో, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో సింగరేణి మరింత కీలకపాత్ర పోషించాలి. తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ సంస్థకు ఇవ్వాల్సిన రూ.60 వేల కోట్లను వెంటనే విడుదల చేయాలి. కార్మికులకు, ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులకు దసరా, దీపావళి పండగల సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు" అని కిషన్‌రెడ్డి తెలిపారు.

# ఒమన్ నుంచి యూఏఈలోకి చొరబాటు.. శిక్ష ముగిసినా జైలులోనే జగిత్యాల వాసి

ఉపాధి కోసం ఒమన్ వెళ్లిన జగిత్యాల వాసి ఏగుర్ల మల్లేశం.. పాస్‌పోర్ట్, వీసా లేకుండా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లోకి ప్రవేశించి జైలుపాలయ్యాడు. దాదాపు ఎనిమిదేళ్లపాటు దుబాయిలో అక్రమంగా నివసించిన కేసులో అక్కడి కోర్టు అతడికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు 1.50 లక్షల యూఏఈ దిర్హమ్ (సుమారు రూ.39 లక్షలు)ల జరిమానా విధించింది. ఆరు నెలల శిక్ష ఇటీవల పూర్తయినప్పటికీ.. జరిమానా చెల్లించలేక మల్లేశం జైలులోనే ఉండిపోవడంతో తమను ఆదుకోవాలని అతడి కుటుంబ సభ్యులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నారు. జగిత్యాల జిల్లా భీమారం మండలం మోత్కురావుపేటకు చెందిన మల్లేశం 2018లో ఉపాధి కోసం ఒమన్‌లోని మస్కట్‌కు వెళ్లాడు. కొందరి తప్పుడు సలహాలతో ఒమన్ అంతర్జాతీయ సరిహద్దును దాటి యూఏఈలోకి అక్రమంగా ప్రవేశించినట్లు సమాచారం. గతంలో దుబాయిలో పనిచేసిన మల్లేశంపై యూఏఈలో ప్రవేశ నిషేధం (నో ఎంట్రీ) ఉండటంతో ఒమన్ మీదుగా ప్రవేశించి.. ఎనిమిదేళ్లుగా అక్కడే నివసిస్తుండగా మార్చి 8న అధికారులు చేపట్టిన తనిఖీల్లో పట్టుబడి జైలుపాలయ్యాడు. మల్లేశాన్ని స్వదేశానికి రప్పించేలా చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచి, కుటుంబ సభ్యులు ఇటీవల ప్రవాసీ ప్రజావాణిలో వినతిపత్రం ఇచ్చారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి.. దుబాయిలోని భారత కాన్సులేట్ ద్వారా వివరాలు సేకరించినట్లు తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వైజరీ కమిటీ వైస్ ఛైర్మన్ భీంరెడ్డి తెలిపారు. "జులైలో దుబాయ్‌లోని అవీర్ జైలును భారత కాన్సులేట్ అధికారులు సందర్శించి మల్లేశాన్ని కలిశారు. నకిలీ పత్రాల కేసులో అతడికి ఆరు నెలల జైలుశిక్ష, జరిమానా, అనంతరం డిపోర్టేషన్ విధించినట్లు జైలు అధికారులు చెప్పినట్లు భారత కాన్సులేట్ సిబ్బంది తెలంగాణ ప్రభుత్వ జీఏడీ ఎన్నారై విభాగానికి ఈ-మెయిల్ ద్వారా తెలియజేశారు" అని భీంరెడ్డి వివరించారు. ఈ వివరాలను విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికారులకు, కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు లేఖ ద్వారా తెలిపినట్లు ఆయన

# యూసీఐఎల్ వజ్రోత్సవాలు ఘనంగా

**యురేనియం తవ్వకం, శుద్ధిలో ఆరు దశాబ్దాల ప్రస్థానం**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 5 (ట్రైనెట్ న్యూస్):**
అణుశక్తి విభాగం (డీఏఈ) పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థ యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యూసీఐఎల్) వజ్రోత్సవాలను జాదుగూడలో ఘనంగా నిర్వహించింది. భారత్‌లో యురేనియం తవ్వకం, శుద్ధి సామర్థ్యాల అభివృద్ధితోపాటు దేశ అణువిద్యుత్ కార్యక్రమానికి సంస్థ అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.ఈ వేడుకలకు అణుశక్తి కమిషన్ ఆర్థిక విభాగ సభ్యురాలు సీమా జైన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీనియర్ అధికారులు, శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు, ఉద్యోగులు, మీడియా ప్రతినిధులు, వివిధ రంగాల భాగస్వాములు కార్యక్రమంలో పాల్గొన్నారు.సీమా జైన్ జాదుగూడలోని సీ అండ్ ఆర్అండ్‌డీ విభాగంలో ఏర్పాటు చేసిన టెక్నాలజీ డెమాన్‌స్ట్రేషన్ పైలట్ ప్లాంట్‌ను పరిశీలించారు. జాదుగూడ భూగర్భ గనిలో 815 మీటర్ల లోతులో సాహా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూక్లియర్ ఫిజిక్స్ ఆధ్వర్యంలో ప్రతిపాదించిన డార్క్ మ్యాటర్ ల్యాబొరేటరీ నూతన ప్రదేశాన్ని కూడా సందర్శించారు.ఈ సందర్భంగా సీమా జైన్ మాట్లాడుతూ, ఆరు దశాబ్దాల శాస్త్రీయ సామర్థ్యం, సంస్థాగత అనుభవం, దేశానికి అంకితభావంతో అందించిన సేవలకు యూసీఐఎల్ వజ్రోత్సవాలు ప్రతీకగా నిలిచాయని పేర్కొన్నారు. భారత యురేనియం తవ్వకం, శుద్ధి రంగాలకు పునాదులు వేసిన డాక్టర్ హోమీ జహంగీర్ భాభాతోపాటు నాటి మార్గదర్శకులకు నివాళులర్పించాల్సిన సందర్భమిదన్నారు.సవాళ్లతో కూడిన పరిస్థితుల్లో తరతరాలుగా యూసీఐఎల్ ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తూ దేశ అణుశక్తి కార్యక్రమానికి బలమైన పునాది వేశారని ప్రశంసించారు. భవిష్యత్తులో అణుశక్తి వినియోగాన్ని మరింత విస్తరించాలనే భారత్ లక్ష్యానికి అనుగుణంగా సాంకేతికత, భద్రతా వ్యవస్థలు, మానవ వనరుల సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు.అణుశక్తి విభాగ కార్యదర్శి, అణుశక్తి కమిషన్ ఛైర్మన్ డాక్టర్ అజిత్‌కుమార్ మొహంతి శుభాకాంక్షలు తెలియజేశారు. అణుశక్తి మిషన్‌లో భారత్ ముందడుగు వేస్తున్న నేపథ్యంలో నిరంతర ఆవిష్కరణలు, సామర్థ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.జర్నలిస్టులకు ప్రత్యేక అవగాహన సదస్సు
వజ్రోత్సవాల్లో భాగంగా నర్వాపహాడ్ సమాచార కేంద్రంలో తొలిసారిగా జర్నలిస్టుల కోసం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. మీడియా ప్రతినిధులు శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులతో సంభాషించి అణుశక్తి, రేడియేషన్ సాంకేతిక వ్యవస్థలపై సమగ్ర అవగాహన పొందారు.
యూసీఐఎల్‌కు చెందిన యురేనియం గనులు, మిల్లింగ్ కేంద్రాలను మీడియా ప్రతినిధులు సందర్శించారు. గనుల కార్యకలాపాలు, ఖనిజ రవాణా, శుద్ధి ప్రక్రియలు, పని ప్రదేశాల్లో అమలు చేస్తున్న సాంకేతిక, భద్రతా విధానాలను ప్రత్యక్షంగా పరిశీలించారు.
పాఠశాల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన డీఏఈ సాంకేతిక ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అణుశక్తికి సంబంధించిన పారిశ్రామిక, సామాజిక ప్రయోజనాలతోపాటు డీఏఈ అనుబంధ సంస్థలు అభివృద్ధి చేసిన సాంకేతికతలను ప్రదర్శించారు.
యూసీఐఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కాచం ఆనందరావు మాట్లాడుతూ, వజ్రోత్సవాలు యూసీఐఎల్ కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ గర్వకారణమన్నారు. యురేనియం తవ్వకం, శుద్ధిలో నైపుణ్యం, మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంతోపాటు సాంకేతికత, భద్రత, పర్యావరణ నిర్వహణలో సంస్థ సామర్థ్యాలను నిరంతరం బలోపేతం చేస్తోందని తెలిపారు.
1967లో ఏర్పాటైన యూసీఐఎల్ దేశీయ యురేనియం తవ్వకం, శుద్ధి సామర్థ్యాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది. భూగర్భ, ఓపెన్‌కాస్ట్ గనుల నుంచి ఖనిజ శుద్ధి, సాంకేతిక అభివృద్ధి, వృత్తిపరమైన భద్రత, రేడియేషన్ రక్షణ, పర్యావరణ నిర్వహణ వరకు ప్రత్యేక జాతీయ సామర్థ్యాన్ని నిర్మించింది. దేశ అణువిద్యుత్ కార్యక్రమానికి అవసరమైన కీలక వనరులను అందిస్తూ భవిష్యత్తు దిశగా తన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది.

# స్వదేశీ 'ఏఐ విజన్ చిప్' అభివృద్ధికి 130 కోట్ల ఆర్థిక సహకారం

**బిగ్‌ఎండియన్ సెమీకండక్టర్స్‌తో టీడీబీ--డీఎస్‌టీ ఒప్పందం**
**'ప్రాజెక్ట్ వీర్‌ఏఐ' ద్వారా నిఘా, రక్షణ, ఆటోమొబైల్, వైద్య రంగాలకు అత్యాధునిక చిప్‌లు**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 5 (ట్రైనెట్ న్యూస్):**
దేశీయ సెమీకండక్టర్ సామర్థ్యాలను బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. స్వదేశీ ఏఐ విజన్ సిస్టమ్-ఆన్-చిప్ (ాశీజ) అభివృద్ధి కోసం బెంగళూరుకు చెందిన బిగ్‌ఎండియన్ సెమీకండక్టర్స్‌కు ?130 కోట్ల ఆర్థిక సహాయం అందించేందుకు కేంద్ర శాస్త్ర--సాంకేతిక విభాగానికి చెందిన టెక్నాలజీ డెవలప్‌మెంట్ బోర్డు ఒప్పందం కుదుర్చుకుంది.
రీసెర్చ్, డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ (=ఱ×) ఫండ్ కింద ఈ సహాయాన్ని అందించనున్నారు. 'ప్రాజెక్ట్ వీర్‌ఏఐ' పేరుతో చేపట్టిన ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం ?260 కోట్లు. ప్రస్తుతం టెక్నాలజీ రెడీనెస్ లెవల్--5లో ఉన్న సాంకేతికతను వాణిజ్య వినియోగానికి సిద్ధమైన టీఆర్‌ఎల్--9 స్థాయికి తీసుకెళ్లడం దీని ప్రధాన లక్ష్యం. ఆప్షనల్ కన్వర్టిబుల్ డెట్ విధానంలో ఆర్థిక సహాయం అందించనున్నారు.
సీసీటీవీ నిఘా వ్యవస్థలకు సురక్షిత చిప్
కెమెరా ఆధారిత అనువర్తనాల కోసం సురక్షితమైన ఏఐ విజన్ చిప్‌ను స్వదేశీ సాంకేతిక వేదికపై అభివృద్ధి చేయనున్నారు. ముఖ్యంగా సీసీటీవీ, నిఘా వ్యవస్థల అవసరాలకు అనుగుణంగా దీనిని రూపొందిస్తున్నారు. విదేశీ సెమీకండక్టర్లు, సాంకేతిక సరఫరా వ్యవస్థలపై ఆధారపడటాన్ని తగ్గించడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం.
ఏఐ ప్రాసెసింగ్, స్మార్ట్ ఫీచర్లతోపాటు భద్రత, గోప్యత, కనెక్టివిటీ సామర్థ్యాలను ఈ చిప్‌లో పొందుపరచనున్నారు. ప్రారంభంలో భారత్‌తోపాటు గ్లోబల్ సౌత్ దేశాల నిఘా అవసరాల కోసం అభివృద్ధి చేసి, అనంతరం రక్షణ, ఆటోమొబైల్, పారిశ్రామిక, వైద్య రంగాలకు విస్తరించనున్నారు.
వాణిజ్య ఉత్పత్తిగా అభివృద్ధి
భారత్‌లో పెరుగుతున్న వీఎల్‌ఎస్‌ఐ డిజైన్, సెమీకండక్టర్ నిపుణుల ప్రతిభను వినియోగించుకొని విస్తృత స్థాయిలో ఉత్పత్తి చేయగల వేదికగా దీనిని తీర్చిదిద్దనున్నారు. సాధారణ ప్రయోజనాల చిప్‌లకు బదులుగా పరిశ్రమల ప్రత్యేక అవసరాలకు అనుగుణమైన చిప్‌ల అభివృద్ధిపై ప్రాజెక్టు దృష్టి సారిస్తుంది.
ఆర్‌డీఐ నిధులతో సాంకేతిక అభివృద్ధి, ధ్రువీకరణ, అనుసంధానం, పరీక్షలు, భారీ స్థాయి ఉత్పత్తికి అవసరమైన కార్యకలాపాలను బిగ్‌ఎండియన్ సెమీకండక్టర్స్ చేపట్టనుంది.
సెమీకండక్టర్లు దాదాపు ప్రతి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతకు పునాది వంటివని టీడీబీ కార్యదర్శి రాజేశ్ కుమార్ పాఠక్ పేర్కొన్నారు. దేశీయంగా ప్రత్యేక అవసరాలకు ఉపయోగపడే ఏఐ చిప్‌లను అభివృద్ధి చేయడం ద్వారా భారత సాంకేతిక వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని తెలిపారు.
టీడీబీ అందిస్తున్న సహకారం 'ప్రాజెక్ట్ వీర్‌ఏఐ' అభివృద్ధి, పరీక్షలను వేగవంతం చేసి, చిప్‌ను వాణిజ్య వినియోగానికి సిద్ధం చేసేందుకు దోహదపడుతుందని బిగ్‌ఎండియన్ సెమీకండక్టర్స్ ప్రతినిధులు వెల్లడించారు.

# యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల పనులను వేగవంతం చేయాలి

**ఫ్యూచర్ సిటీలో విదేశీ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌ల ఏర్పాటుకు ప్రత్యేక విధానం రూపొందించాలి.**
**-సీఎస్ సంజయ్ జాజు సమీక్ష**



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 5:**
ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం, విద్యా మౌలిక వసతుల అభివృద్ధి, ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ స్థాయి ఉన్నత విద్యా సంస్థల ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సీనియర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. డిసెంబర్ 2027 నాటికి 67 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు
రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను దశలవారీగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. డిసెంబర్ 2027 నాటికి 67 పాఠశాలలను పూర్తి చేయడంతో పాటు, జూన్ 2028 నాటికి ఈ సంఖ్యను 87కు పెంచేలా పనులను వేగవంతం చేయాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. ప్రతి పాఠశాలను సుమారు 26 ఎకరాల విస్తీర్ణంలో అన్ని ఆధునిక సదుపాయాలతో నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. అవసరమైన క్రీడా మైదానాలు, వసతి గృహాలు, సిబ్బంది క్వార్టర్లు, ఆధునిక వంటశాలలు, డిజిటల్ తరగతి గదులు తదితర మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నిర్దేశిత గడువుల్లో నాణ్యతా ప్రమాణాలతో పనులను పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. ఈ స్కూళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ పాఠశాలలు ఒకే క్యాంపస్ లో ఉండే విధంగా నిర్మాణాలు చేపట్టారు. దేశంలో ఆదర్శవంతంగా ఉండే విధంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ఏర్పాటు చేస్తున్నారు.
ఫ్యూచర్ సిటీలో విదేశీ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లు
తెలంగాణ రాష్ట్రంను అంతర్జాతీయ విద్యా కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా ఫ్యూచర్ సిటీలో ప్రముఖ విదేశీ విశ్వవిద్యాలయాల క్యాంపస్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. లండన్ యూనివర్సిటీ వంటి ప్రముఖ అంతర్జాతీయ విద్యా సంస్థలను తెలంగాణకు ఆకర్షించేలా సమగ్ర విధానాన్ని రూపొందించాలని అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు లండన్ విశ్వవిద్యాలయం, బర్మింగ్‌హామ్ విశ్వవిద్యాలయంతో పాటు మరో 4 అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు ఫ్యూచర్ సిటీలో తమ బ్రాంచీలు ఏర్పాటు చేసేందుకు సుముఖత వ్యక్తం చేసాయని అధికారులు పేర్కొన్నారు. విదేశీ విశ్వవిద్యాలయాలను ఆహ్వానించడం, క్యాంపస్‌ల ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతులు, పెట్టుబడులు, అనుమతులు, విద్యా కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలను ఈ విధానంలో పొందుపరచాలని అన్నారు. తెలంగాణలో ప్రపంచస్థాయి విద్యా అవకాశాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాల విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని సీఎస్ పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీలో ప్రతిపాదిత అంతర్జాతీయ విద్యా సంస్థల ఏర్పాటుకు సంబంధించి ప్రముఖ విదేశీ విశ్వవిద్యాలయాలతో సంప్రదింపులు జరిపి, గ్లోబల్ సమ్మిట్ సమయానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను సి.ఎస్ ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేశ్ రంజన్, సబ్యసాచి ఘోష్, ముఖ్య కార్యదర్శులు సందీప్ కుమార్ సుల్తానియా, యోగితా రాణా, రాహుల్ బొజ్జ, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.

# ప్రొద్దుటూరులో జల్ జీవన్ మిషన్ -- అమరజీవి జలధారల ప్రత్యేక పైలాన్

**రూ. 30,156 కోట్ల తాగు నీటి ప్రాజెక్టుల వివరాలతో అమృత్ నగర్ కూడలిలో ఏర్పాటు పైలాన్‌ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్**



**అమరావతి, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 05:**
రాష్ట్ర ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన తాగు నీటిని అందించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న జల్ జీవన్ మిషన్ -- అమరజీవి జలధార ప్రాజెక్టులకి సంబంధించిన ప్రత్యేక పైలాన్ ను ప్రొద్దుటూరు పట్టణంలోని, అమృత్ నగర్ కూడలిలో గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ కలసి ఆవిష్కరించారు. జల్ జీవన్ మిషన్ -- అమరజీవి జలధార ద్వారా చేపడుతున్న భారీ తాగునీటి ప్రాజెక్టుల వివరాలను ప్రజలు తెలుసుకునేందుకు వీలుగా ఈ పైలాన్ ను ఏర్పాటు చేశారు. రూ.30,156 కోట్ల వ్యయంతో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న తాగునీటి సరఫరా, సమగ్ర రక్షిత తాగునీటి పథకాలు, మల్టీ విలేజ్ స్కీమ్స్, గ్రామీణ నీటి మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన ప్రధాన ప్రాజెక్టుల వివరాలు ఈ పైలాన్‌లో పొందుపరిచారు. అందులో గండికోట జలాశయం నుంచి అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో నిర్మిస్తున్న ప్రాజెక్టులతోపాటు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 9,000 గ్రామాల్లో చేపట్టిన సింగిల్ విలేజ్ స్కీమ్స్, 28 జిల్లాల పరిధిలో చేపట్టిన ప్రాజెక్టుల వివరాలు ప్రజలకు సులభంగా అర్థమయ్యేరీతిలో ఫలకాలపై చెక్కారు. ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు చేర్చాలన్న లక్ష్యంతో జల్ జీవన్ మిషన్ -- అమరజీవి జలధార పనులను ఎంతో బాధ్యతాయుతంగా ముందుకు తీసుకువెళుతున్నట్టు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి, స్థానిక శాసన సభ్యులు నంద్యాల వరదరాజులు రెడ్డి, మైదుకూరు శాసన సభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా "ఓ తల్లి తీర్పు" కథా సంపుటి ఆవిష్కరణ .



హైదరాబాద్, ప్రగతి కల్చరల్ అసోసియేషన్, అక్షర కుసుమాలు ఆధ్వర్యంలో శ్రీమతి తాడిమేటి శ్రీ దేవి రచించిన ఓ తల్లి తీర్పు కథా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రముఖ సినీ గీత రచయిత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ స్వర్ణ నంది, ఉగాది పురస్కారాల గ్రహీత శ్రీ సాదనాల వేంకట స్వామి నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సభ ప్రగతి నగర్ సుందరయ్య భవన్ లో ఆదివారం వైభవంగా జరిగింది. ఈ సంపుటిని తాడిమేటి ఆరోమేటిక్స్ ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టర్ శ్రీ తాడిమేటి మధు చక్రపాణి రావు ఆవిష్కరించారు. ఈ కథా సంపుటి నుండి కవయిత్రి శ్రీమతి వనజా బలుసాని, డాక్టర్ టి. శ్రీ లక్ష్మి సమీక్షించారు. ప్రముఖ కథా రచయిత శ్రీ పాలకోడేటి సత్యనారాయణ, సాహితీ వేత్తలు శ్రీ చాగంటి ప్రసాద్, పెమ్మరాజు విజయ రామచంద్ర, సిహెచ్. మల్లయాచారి, చాగంటి రమాదేవి, సత్యవీణ మొండ్రేటి తదితరులు పాల్గొన్నారు. ముందుగా కవి సమ్మేళనం జరిగింది.

# వికాస వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ కవి, విశ్రాంత విద్యుత్ శాఖ అధికారి డాక్టర్ కాసర్ల రంగారావు గారి పుస్తక పరిచయ సభ వైభవంగా జరిగింది.

**ఖమ్మం , ట్రైనెట్ న్యూస్ సెప్టెంబరు 5:**





ఖమ్మం . వికాస వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ కవి, విశ్రాంత విద్యుత్ శాఖ అధికారి డాక్టర్ కాసర్ల రంగారావు గారి పుస్తక పరిచయ సభ వైభవంగా జరిగింది. ఖమ్మం జిల్లా పరిషత్ హాలు లో జరిగిన ఈ సభలో ప్రముఖ సినీ గీత రచయిత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ స్వర్ణ నంది బహుమతి గ్రహీత తెలుగు విశ్వవిద్యాలయ బంగారు పతక విజేత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కార గ్రహీత శ్రీ సాదనాల వేంకట స్వామి నాయుడు కాసర్ల వారి భాషాంజలి, నానోలు పుస్తకాలను లోతుగా సమీక్షించారు. తెలుగు వెలుగులు పుస్తకాన్ని ప్రముఖ బాల రచయిత. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అమ్మిన శ్రీనివాసరాజు, అక్షర శిల్పాలు పుస్తకాన్ని ప్రముఖ కవి ఎన్.తిర్మల్, ఊర్వశి తో సంభాషణలు పుస్తకాన్ని హైకోర్టు అడ్వకేట్ శ్రీ అవధానం రఘుకుమార్ సమీక్షించారు. ఈ సందర్భంగా శ్రీ ఎన్ తిర్మల్ రాసిన త్రిభాషా కవి హీరాలాల్ మోరియా పై సమగ్రంగా రాసిన గ్రంథాన్ని వికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీ సాదనాల వేంకట స్వామి నాయుడు ఆవిష్కరించారు. ఈ సభలో ప్రముఖ కవి, వికాస వేదిక కార్యదర్శి లెనిన్ శ్రీనివాస్, అధ్యక్షుడు శ్రీ బుక్కా సత్యనారాయణ, కవయిత్రి యడవల్లి శైలజ, శ్రీ తిరునగరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా కళాకారుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు గా ఎన్నికైన శ్రీ పాగి వెంకన్న, బొమ్మెర ముత్యం గార్లను ఘనంగా కళాకారులు సత్కరించారు. అనంతరం కవి సమ్మేళనం కమనీయంగా జరిగింది. శ్రీ మలిశెట్టి కృష్ణ మూర్తి అధ్యక్షతన ముప్పై మంది కవులు తమ కవితా గానం చేశారు.

# తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అద్వైత్ కుమార్ సింగ్



**న్యూఢిల్లీ, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 5,:**
తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను (ఎఫ్ఏసీ) అద్వైత్ కుమార్ సింగ్, ఐఏఎస్ (2013) సోమవారం స్వీకరించారు.
ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వంలో కోఆర్డినేషన్ (కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులు అండ్ కేంద్ర ప్రాయోజిత పథకాలు) ప్రత్యేక కార్యదర్శిగా పనిచేస్తున్న అద్వైత్ కుమార్ సింగ్‌కు, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ పదవికి తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ ఆర్టీ నెం.1441, సాధారణ పరిపాలన శాఖ ఈనెల 3 వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. రెసిడెంట్ కమిషనర్ బాధ్యతలతో పాటు కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులు, కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించిన సమన్వయ బాధ్యతలను కూడా ఆయన కొనసాగించనున్నారు.

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
మంగళవారం అక్టోబర్ 06, 2026
www.trinetnews.com

# చింతన్ శివిర్‌లో నితిన్ గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యేక భేటీ

**తెలంగాణ కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులకు కేంద్రం సహకరించాలి - మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి**
**ఎల్‌బీనగర్--హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ వెంటనే మంజూరు చేయాలని కోరిన మంత్రి**
**ఎన్హెచ్-65 6ం2 లేన్ల విస్తరణ, ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర--దక్షిణ భాగాలు, హైదరాబాద్--అమరావతి ఎక్స్‌ప్రెస్‌వేపై చర్చ**
**పార్వతమాల కింద 5 రోప్‌వేలు, సీఆర్‌ఐఎఫ్ కింద 33 పనులు, 3 ఆర్‌ఓబీ /ఆర్యూబీ మంజూరు కోరిన మంత్రి**
**హైదరాబాద్--శ్రీశైలం ఎన్ హెచ్-765పై ఎలివేటెడ్ కారిడార్‌కు ప్రత్యేక విజ్ఞప్తిలి**
**ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రోడ్ ఇన్ఫ్రా పై ప్రత్యేక దృష్టి సారించిందని వివరించిన మంత్రి**
**మంత్రి కోమటి రెడ్డి విజ్ఞప్తి చేసిన రాష్ట్ర ప్రాజెక్టుల అంశంపై సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ**






**గుజరాత్(ఎక్తానగర్), ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 05:** గుజరాత్ రాష్ట్రం నర్మదజిల్లాలోని ఎక్తానగర్ స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ప్రాంగణంలో జరుగుతున్న చింతన్ శివిర్--2026 రెండు రోజుల కార్యక్రమాన్ని సోమవారం రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి అట్టహాసంగా ప్రారంభించారు. మొదటి రోజు సమావేశంలో పలు రోడ్ కనెక్టివిటీ ప్రాజెక్టుల్లో కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం వంటి వివిధ అంశాలపై జరిగిన చర్చ అనంతరం..కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మంత్రి కోమటి రెడ్డి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులు, కేంద్రం నుంచి రావాల్సిన అనుమతులు, నిధుల మంజూరీలు, జాతీయ రహదారుల అభివృద్ధి అంశాలపై ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రోడ్ ఇన్ఫ్రా పై ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి వివరించారు. తెలంగాణలో జాతీయ రహదారుల అభివృద్ధి, సేతు బంధన్, సీఆర్‌ఐఎఫ్ పనులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ--ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య కనెక్టివిటీని మరింత బలోపేతం చేయడంతో పాటు హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించడం, రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం, ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేసేలా పలు కీలక ప్రాజెక్టులకు కేంద్రం నుంచి సహకారం అందించాలని నితిన్ గడ్కరీని కోరారు.

**ఎల్‌బీనగర్--హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్**

హైదరాబాద్ తూర్పు ప్రాంతంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి శాశ్వత పరిష్కారం చూపేందుకు ఎల్‌బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు సుమారు 6 కి.మీ. మేర డబుల్ డెక్కర్ విధానంలో ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించాలని మంత్రి కోరారు. ఇప్పటికే ఎన్‌హెచ్–65లో ఎల్‌బీనగర్--మల్కాపూర్ సెక్షన్‌ను సర్వీస్ రోడ్లతో సహా ఆరు(6ం2) లేన్లుగా అభివృద్ధి చేసేందుకు రూ.545 కోట్లతో కేంద్రం అనుమతులు ఇచ్చిందని తెలిపారు.ఎక్కువగా నిర్మాణాలు ఉన్న ప్రాంతాల్లో ఆర్‌ఈ వాల్‌కు బదులుగా వయాడక్ట్ విధానంలో నిర్మాణం చేపట్టాలని ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయని వివరించారు. మియాపూర్--ఎల్‌బీనగర్ మెట్రో రైలు కారిడార్‌ను రెండో దశలో హయత్‌నగర్ వరకు పొడిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో, మెట్రోతో సమన్వయం ఉండేలా డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు 2026--27 వార్షిక ప్రణాళికలో చోటు కల్పించి మంజూరు చేయాలని కోరారు.

**పార్వతమాల కింద 5 రోప్‌వే ప్రాజెక్టులు**

తెలంగాణలో పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలకు మెరుగైన కనెక్టివిటీ కల్పించేందుకు పార్వతమాల పథకం కింద రూ.1,230 కోట్ల అంచనా వ్యయంతో ఐదు రోప్‌వే ప్రాజెక్టులకు మంజూరు ఇవ్వాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, నల్గొండ హనుమాన్ హిల్, నాగార్జునసాగర్–-నాగార్జునకొండ, పెద్దపల్లి జిల్లా మంథని రామగిరి కోట, నిజామాబాద్ కిల్లా రామాలయం ప్రాంతాల్లో ఈ రోప్‌వేలను ప్రతిపాదించినట్లు తెలిపారు. ఇవి భక్తులు, పర్యాటకులు, స్థానిక ప్రయాణికులకు సౌకర్యం కల్పించడంతో పాటు పర్యావరణహిత రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయడానికి దోహదపడతాయని వివరించారు.

మూడు కీలక ఆర్‌ఓబీ/ ఆర్యూబీలకు మంజూరు

2026--27 ఆర్థిక సంవత్సరానికి సేతు బంధన్ పథకం కింద మూడు కీలక ఆర్‌ఓబీ/ ఆర్యూబీ ప్రాజెక్టులకు మంజూరు ఇవ్వాలని మంత్రి కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం బైపాస్ వద్ద నాలుగు లేన్ల ఆర్‌ఓబీ/ ఆర్యూబీ పెద్దపల్లి జిల్లాలో సుల్తానాబాద్ వద్ద రెండు లేన్ల
ఆర్‌ఓబీ నల్గొండ జిల్లాలో పగిడిపల్లి--నడికుడి రైల్వే సెక్షన్‌లో నాలుగు లేన్ల
ఆర్‌ఓబీ నిర్మాణ ప్రతిపాదనలను కేంద్రం పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్ హెచ్- 65 ఆరు లేన్ల విస్తరణకు వేగంగా ఆమోదాలు

తెలంగాణ--ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలిపే హైదరాబాద్--విజయవాడ--మచిలీపట్నం ఎన్ హెచ్–65ను ఆరు(6ం2) లేన్లుగా విస్తరించే ప్రాజెక్టును వేగవంతం చేయాలని మంత్రి కోమటి రెడ్డి,నితిన్ గడ్కరీని కోరారు. ప్రస్తుతం ఈ రహదారిపై ట్రాఫిక్ 1.20 లక్షలకు పైగా పీసీయూఎస్ కు చేరిందని, అనేక ప్రమాదకర ప్రాంతాలు, బ్లాక్‌స్పాట్లు ఉన్నాయని తెలిపారు. పెరుగుతున్న ట్రాఫిక్ అవసరాలకు అనుగుణంగా రహదారిని విస్తరించడంతో పాటు రోడ్డు భద్రతను మెరుగుపరచడం అత్యవసరమని చెప్పారు.

ఈ ప్రాజెక్టుకు అలైన్‌మెంట్ ఆమోదం, ప్యాట్స్, పీపీఏసీ ,ఆమోదాలు ఇప్పటికే లభించాయని, సీసీఈఏ ఆమోదం కోసం సిఫారసు చేసిన నేపథ్యంలో త్వరగా తుది ఆమోదం లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎన్ హెచ్–765పై ఎలివేటెడ్ కారిడార్

హైదరాబాద్--శ్రీశైలం ఎన్ హెచ్–765లో టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి మంజూరు ఇవ్వాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. అటవీ ప్రాంతంలో రహదారి విస్తరణకు ఎదురవుతున్న సమస్యలకు ఎలివేటెడ్ కారిడార్ పరిష్కారంగా నిలుస్తుందని, శ్రీశైలం వెళ్లే భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించడంతో పాటు నల్లమల అటవీ ప్రాంత పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ఇది దోహదపడుతుందని వివరించారు.

సీఆర్‌ఐఎఫ్ కింద 33 పనులకు రూ.1,227.75 కోట్ల మంజూరు కోరిన మంత్రి

2026--27 ఆర్థిక సంవత్సరానికి (సీఆర్‌ఐఎఫ్) పథకం కింద తెలంగాణ రాష్ట్రంలో 33 రహదారి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోరారు. మొత్తం 511.68 కి.మీ. పొడవుతో చేపట్టనున్న ఈ పనులకు రూ.1,227.75 కోట్ల అంచనా వ్యయం అవుతుందని తెలిపారు. గౌరవ ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన ఈ పనులు రాష్ట్రవ్యాప్తంగా సమతుల్య ప్రాంతీయ అభివృద్ధికి ఎంతో కీలకమని, వీటిని పరిశీలించి 2026--27 సీఆర్‌ఐఎఫ్ పథకం కింద మంజూరు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరారు.

ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగానికి ఆర్థిక, కేబినెట్ ఆమోదం కోరిన మంత్రి

హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డులోని ఉత్తర భాగానికి ఆర్థిక, కేంద్ర మంత్రివర్గ ఆమోదం త్వరగా ఇవ్వాలని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోరారు. సంగారెడ్డి--నర్సాపూర్--తూప్రాన్--గజ్వేల్--జగదేవ్‌పూర్--భువనగిరి--చౌటుప్పల్ మార్గంలో 161.518 కి.మీ. మేర నిర్మించనున్న ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగానికి భూసేకరణ వ్యయంలో 50 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు.

అదే సమయంలో హైదరాబాద్ చుట్టూ పూర్తి రింగ్‌ను ఏర్పాటు చేసేందుకు ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగాన్ని కూడా ఉత్తర భాగంతో సమానంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీ, పారిశ్రామిక పార్కులు, రేడియల్ రోడ్లు తదితర భవిష్యత్ మౌలిక వసతులకు దక్షిణ ఆర్‌ఆర్‌ఆర్ కీలకంగా మారుతుందని వివరించారు.

**హైదరాబాద్--అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య భవిష్యత్ కనెక్టివిటీని మరింత బలోపేతం చేసే హైదరాబాద్--అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు సంబంధించి డీపీఆర్ ప్రక్రియను వేగవంతం చేసి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలని మంత్రి కోరారు.

ఈ ఎక్స్‌ప్రెస్‌వేను తెలంగాణలోని డ్రైపోర్టుతో అనుసంధానం చేయడం ద్వారా సరుకు రవాణా సులభతరం అవుతుందని, ఆర్థిక కార్యకలాపాలు, పారిశ్రామిక అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. బందర్ పోర్టుకు స్పర్ కనెక్టివిటీ కల్పించే అవకాశం కూడా ఉందని వివరించారు. తెలంగాణ అభివృద్ధికి కీలకమైన ఈ ప్రాజెక్టులన్నింటినీ సానుకూలంగా పరిశీలించి, కేంద్ర స్థాయిలో అవసరమైన అనుమతులు, నిధుల మంజూరీలు, కేబినెట్ ఆమోదాలను త్వరితగతిన పూర్తి చేసి రాష్ట్రానికి సహకరించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. మంత్రి రాష్ట్ర ప్రాజెక్టుల కోసం చేసిన విజ్ఞప్తుల పట్ల నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారు.

మంత్రి వెంట ఆర్ అండ్ బి స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్,చీఫ్ ఇంజనీర్లు బి.వి రావు, ధర్మారెడ్డి, వసంత్ నాయక్ పలువురు అధికారులు ఉన్నారు.

# సీకా, హైదరాబాద్లో "జైలు పరిపాలనలో నాయకత్వం" శిక్షణ కార్యక్రమం ప్రారంభం

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 05, 2026:** బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ న్యూఢిల్లీ సహకారంతో స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్ (సీకా), హైదరాబాద్ ఆధ్వర్యంలో "జైలు పరిపాలనలో నాయకత్వం" అనే అంశంపై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం అక్టోబర్ 05 – 09 వరకు నిర్వహించబడుతోంది.

ఈ శిక్షణ కార్యక్రమాన్ని తెలంగాణ జైళ్ల శాఖ కరెక్షనల్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ డా. సౌమ్య మిశ్రా, ఐపీఎస్ ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్, హర్యానా, జార్ఖండ్, లడఖ్, పంజాబ్, తమిళనాడు, తెలంగాణ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 23 మంది జైలు అధికారులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. వీరిలో డిప్యూటీ సూపరింటెండెంట్లు, జైలర్లు డిప్యూటీ జైలర్లు ఉన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన అధికారులు పాల్గొనడం ద్వారా అనుభవాలను పంచుకోవడానికి, ఆలోచనలను మార్పిడి చేసుకోవడానికి, జైలు పరిపాలనలో అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను తెలుసుకోవడానికి ఈ కార్యక్రమం ఒక మంచి వేదికగా నిలుస్తోంది.



ఈ సందర్భంగా డా. సౌమ్య మిశ్రా (ఐపీఎస్) మాట్లాడుతూ, జైలు పరిపాలనలో భద్రత, క్రమశిక్షణను కాపాడటంతో పాటు ఖైదీల గౌరవం, మానవ హక్కులు మరియు సంక్షేమాన్ని పరిరక్షించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. సమర్థవంతమైన జైలు నాయకుడు దృఢంగా, న్యాయంగా, క్రమశిక్షణతో పాటు మానవీయ దృక్పథంతో వ్యవహరిస్తూ, సిబ్బందికి సమర్థవంతమైన మార్గనిర్దేశం చేయడంతో పాటు ఖైదీల సంస్కరణ మరియు పునరావాసానికి కృషి చేయాలని ఆమె అన్నారు. జైలు నిర్వహణను మెరుగుపరచడం, జవాబుదారీతనాన్ని పెంపొందించడం కోసం క్రమం తప్పకుండా తనిఖీలు, జైలు పర్యవేక్షణ, మానవ హక్కుల పరిరక్షణ, ఫిర్యాదుల పరిష్కారం మరియు పర్యవేక్షణ వ్యవస్థలు ఎంతో కీలకమని డా. సౌమ్య మిశ్రా పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళా ఖైదీలు, ఇతర బలహీన వర్గాలకు సంబంధించిన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, ఖైదీల ఫిర్యాదులను సత్వరం మరియు సమర్థవంతంగా పరిష్కరించే వ్యవస్థ అవసరమని ఆమె తెలిపారు.

ఐదు రోజుల శిక్షణలో అధికారులు చురుకుగా పాల్గొని, తమ అనుభవాలను పంచుకోవడంతో పాటు వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న ఉత్తమ విధానాలను తెలుసుకోవాలని డీజీ ప్రోత్సహించారు. శిక్షణ ద్వారా పొందిన జ్ఞానాన్ని తమ తమ జైళ్లలో నాయకత్వం, తనిఖీలు, ఖైదీల సంక్షేమం, ఫిర్యాదుల పరిష్కారం, మానవ హక్కులు మరియు పునరావాసం వంటి అంశాల్లో ఆచరణాత్మకంగా అమలు చేయాలని ఆమె సూచించారు. శిక్షణ ముగింపులో అందుకునే ధ్రువపత్రాల కంటే, శిక్షణ అనంతరం అధికారులు తమ తమ జైళ్లలో తీసుకువచ్చే సానుకూల మార్పులు మరియు మెరుగుదలలే ఈ కార్యక్రమం విజయానికి అసలైన ప్రమాణాలని డా. సౌమ్య మిశ్రా పేర్కొన్నారు.

# హెచ్ఐవీపై అవగాహనతోనే నివారణ సాధ్యం

**- కిమ్స్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో రెడ్ రిబ్బన్ క్లబ్ అవగాహన కార్యక్రమం**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 5:** హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన పెంచడంతో పాటు వ్యాధి నివారణ, ముందస్తు పరీక్షలు, సామాజిక బాధ్యతపై విద్యార్థుల్లో చైతన్యం కల్పించేందుకు కిమ్స్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, రెడ్ రిబ్బన్ క్లబ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కిమ్స్ ఆసుపత్రి సికింద్రాబాద్ 15వ అంతస్తులోని ఆడిటోరియంలో జాతీయ



సేవా పథకం (ఎన్ఎస్ఎస్) విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (టీజీఎస్ఏసీఎస్) సహకారంతో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీజీఎస్ఏసీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డా. కె. విద్యాసాగర్ మాట్లాడుతూ హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. తెలంగాణతో పాటు దేశంలో హెచ్ఐవీ పరిస్థితి, గణాంకాలు, వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముందస్తుగా వ్యాధిని గుర్తించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వ్యక్తుల పట్ల వివక్ష, అపోహలను తొలగించాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రజల్లో అవగాహన కల్పించడంలో నర్సింగ్ విద్యార్థులు పీర్ ఎడ్యుకేటర్లుగా కీలక పాత్ర పోషించాలని సూచించారు. న కిమ్స్ హాస్పిటల్స్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (అకడమిక్స్) డా. ఎస్. మణిమాలారావు మాట్లాడుతూ హెచ్ఐవీతో జీవిస్తున్న వారికి సేవలందించేటప్పుడు నర్సింగ్ విద్యార్థులు మానవతా దృక్పథం, వృత్తి నైపుణ్యం, నైతిక విలువలను పాటించాలని సూచించారు. ఆరోగ్య అవగాహన, వ్యాధి నివారణ, కౌన్సెలింగ్, రోగుల హక్కుల పరిరక్షణలో నర్సుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. ఈ సందర్భంగా నర్సింగ్ విద్యార్థులు వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. పోస్టర్ ప్రదర్శనలు, స్కిట్, క్విజ్ పోటీల ద్వారా హెచ్ఐవీ నివారణ, అవగాహన, సామాజిక బాధ్యతకు సంబంధించిన ముఖ్య సందేశాలను ప్రజలకు చేరేలా వివరించారు. కార్యక్రమంలో కిమ్స్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, టీజీఎస్ఏసీఎస్ ప్రతినిధులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

# కాకా వెంకటస్వామి సేవలు, ఆలోచనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం

**-మంత్రి పొన్నం ప్రభాకర్**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 5:** పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా కాకా వెంకటస్వామి జీవితాంతం కృషి చేశారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సోమవారం రవీంద్ర భారతిలో మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి (కాకా) 97 వ జయంతి వేడుకల్లో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, వివేక్ వెంకట్ స్వామి, ఎమ్మెల్యే వినోద్ కుమార్ , ప్రభుత్వ సలహాదారు కె కేశవరావు, మాజీ మంత్రి జానారెడ్డి , మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ వంశీ కృష్ణ , ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్య, అంజన్ కుమార్ యాదవ్, సాంస్కృతిక శాఖ సెక్రెటరీ వాణి ప్రసాద్ , ఇతర ముఖ్య నేతలు పాల్గొని వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ,

కాకా వెంకటస్వామి గా తెలంగాణ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన ప్రజానాయకులు అని మంత్రి పొన్నం కొనియాడారు.

అణగారిన వర్గాల హక్కుల కోసం పార్లమెంట్ వేదికగా కాకా వెంకటస్వామి




బలంగా గళం వినిపించారని మంత్రి పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలతో ఆత్మీయ సంబంధాలు కొనసాగించిన మహోన్నత వ్యక్తిత్వం కాకాది అని మంత్రి పొన్నం అన్నారు. విద్య ద్వారా పేద, బడుగు వర్గాల పిల్లల జీవితాల్లో మార్పు తీసుకురావాలన్నది కాకా వెంకటస్వామి ప్రధాన ఆశయం అని.. అని ఆయన సేవలు, ఆలోచనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం అని మంత్రి పేర్కొన్నారు. సామాజిక న్యాయం, అభివృద్ధి మార్గంలో ముందుకు సాగాలని, ఆయన ఆశయాలను కొనసాగించడమే కాకా వెంకటస్వామి కి మనం అందించే నిజమైన నివాళి అని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. తన కొడుకు వ్యక్తిత్వాన్ని, తన కుటుంబ విలువలను ఎంతో గొప్పగా తీర్చిదిద్దిన వ్యక్తి వెంకట స్వామి అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నేడు

ఆయన మన మధ్య లేకపోయినా,కాకా ఆలోచనలు, ఆశయాలు, చేసిన సేవలు మన మధ్యే ఉన్నాయని మంత్రి పొన్నం చెప్పారు. ముఖ్యంగా ఆయన కుటుంబ సభ్యుల్లో, ఆయనతో కలిసి పనిచేసిన వారిలో, ఆయనను అభిమానించిన ప్రతి ఒక్కరిలో ఆయన జ్ఞాపకాలు సజీవంగా ఉన్నాయని మంత్రి గుర్తు చేశారు. కాకా చూపించిన మార్గంలో మనం ముందుకు సాగుతూ, ఆయన ఆశయాలను నెరవేర్చడానికి కృషి చేయాలని కోరారు.

నేడు రాజకీయాల్లో ఎవరెక్కడ ఉన్నా, ఏ స్థాయిలో ఉన్నా, కాకా సేవలను, ఆయన మంచితనాన్ని, ఆయన ఆలోచనలను గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అభిప్రాయపడ్డారు.

కరీంనగర్ జిల్లాల్లో కాకా వెంకట్ స్వామి , చొక్కరావు సత్యనారాయణ రావు హేమాహేమీ లు రాజకీయ ఉద్దండులు ఉన్నారని మంత్రి పొన్నం తెలిపారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు వారి కుమారుడు వివేక్ తెలంగాణ ఉద్యమ సమయంలో స్వరాష్ట్రం కోసం ఉద్యమించాల్సిన వాటిపై మాకు సలహాలు సూచనలు చేసేవారని గుర్తు చేశారు.

# భారత్--జపాన్ సంయుక్త క్రెడిటింగ్ మెకానిజం కార్యాచరణ మాన్యువల్ విడుదల

**న్యూఢిల్లీ, అక్టోబర్ 5, ట్రైనెట్ న్యూస్:**

భారత్--జపాన్ సంయుక్త క్రెడిటింగ్ మెకానిజం (జేసీఎం) కార్యాచరణ మాన్యువల్‌ను సెప్టెంబర్ 30న న్యూఢిల్లీలో జపాన్ రాయబారి కెయిచి ఒనో, అప్పటి కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ కార్యదర్శి తన్మయ్ కుమార్ సంయుక్తంగా విడుదల చేశారు.ఆధునిక తక్కువ కార్బన్ సాంకేతికతల వినియోగాన్ని ప్రోత్సహించడం, వాతావరణ ఆర్థిక వనరులను సమీకరించడం, సాంకేతిక సహకారాన్ని విస్తరించడం ఈ మెకానిజం లక్ష్యాలు. భారత్‌లో ఉద్గారాల తగ్గింపు, తొలగింపు చర్యలకు మద్దతు ఇవ్వడంతో పాటు, సుస్థిర అభివృద్ధికి తోడ్పడటం మరియు అంతర్జాతీయ కార్బన్ మార్కెట్లలో పారదర్శకత, విశ్వసనీయతను పెంపొందించడం కూడా దీని ఉద్దేశం.పారిస్ ఒప్పందంలోని ఆర్టికల్ 6.2 కింద భారత్--జపాన్ ద్వైపాక్షిక సహకారాన్ని అమల్లోకి తీసుకురావడంలో ఈ మాన్యువల్ విడుదల కీలక ముందడుగు. 2025 ఆగస్టు 7న సహకార అవగాహన ఒప్పందం (ఎంఓసీ)పై సంతకాలు, 2026 జూన్ 8న అమలు నియమావళి (ఆర్ఓఐ) ఆమోదం పొందిన నేపథ్యంలో ఈ మాన్యువల్ రూపొందింది.సంస్థాగత సన్నాహాల దశ నుంచి క్షేత్రస్థాయి అమలు దిశగా ఇరు దేశాల సహకారం సాగుతోందని ఈ పరిణామం సూచిస్తోంది. ప్రాజెక్టు ఆలోచన పత్రం సమర్పణ నుంచి జేసీఎం క్రెడిట్ల జారీ, అధికారిక అనుమతుల వరకు ప్రాజెక్టు పూర్తి చక్రానికి సంబంధించిన స్పష్టమైన, పారదర్శకమైన విధానాలను మాన్యువల్‌లో వివరించారు.

# ఉత్తరాఖండ్‌లో భారత్--యూఏఈ సంయుక్త సైనిక విన్యాసాలు ప్రారంభం

**మౌంటెన్ గార్డియన్--2026లో ఇరు దేశాల సైనికులు**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 5, ట్రైనెట్ న్యూస్:** భారత్--యూఏఈ సంయుక్త సైనిక విన్యాసాలు 'మౌంటెన్ గార్డియన్--2026' సోమవారం ఉత్తరాఖండ్‌లోని చౌబాటియా విదేశీ శిక్షణ కేంద్రంలో ప్రారంభమయ్యాయి. అక్టోబర్ 5 నుంచి 18 వరకు జరిగే ఈ విన్యాసాల ప్రధాన లక్ష్యం పర్వత ప్రాంతాల్లో యుద్ధతంత్రంపై దృష్టి సారిస్తూ ఇరు దేశాల సైన్యాల మధ్య సమన్వయం, పరస్పర అవగాహన, సహకారాన్ని పెంపొందించడం.




ఈ విన్యాసాల్లో ఇరు దేశాల నుంచి సమాన సంఖ్యలో మొత్తం 92 మంది సైనికులు పాల్గొంటున్నారు. భారత సైన్యానికి చెందిన భైరవ్ బెటాలియన్ సిబ్బంది, యూఏఈ సైన్యానికి చెందిన మౌంటెన్ ఇన్ఫాంట్రీ బెటాలియన్ సిబ్బంది ఇందులో భాగస్వాములయ్యారు. ఇరు సైన్యాల మహిళా అధికారులు, సైనికులు కూడా వివిధ ప్రత్యేక విభాగాల్లో పాల్గొంటున్నారు.

విన్యాసాల్లో భాగంగా సంయుక్త ప్రణాళికలు, వ్యూహాత్మక కసరత్తులు, కాల్పుల సాధన, నిఘా వ్యవస్థల ఏర్పాటు, డ్రోన్ కార్యకలాపాలు, శారీరక దృఢత్వ శిక్షణ, రాక్ క్లైంబింగ్, అడ్డంకుల అధిగమనం, సమగ్ర క్షేత్రస్థాయి విన్యాసాలు నిర్వహించనున్నారు. పర్వత ప్రాంతాల్లోని క్లిష్ట పరిస్థితులకు అనుగుణంగా సాంకేతికత ఆధారిత కార్యకలాపాలు, యుద్ధతంత్రాలు, విధానాలు, అనుభవాలను కూడా పరస్పరం పంచుకోనున్నారు.

ఈ విన్యాసాలు ఇరు దేశాల సైన్యాలకు వృత్తిపరమైన అనుభవాలను పంచుకోవడానికి, వ్యూహాత్మక నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి, కార్యాచరణ విధానాల్లో ఉత్తమ పద్ధతులను తెలుసుకోవడానికి దోహదపడతాయి. భారత్--యూఏఈ సైనిక సహకారాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, రెండు దేశాల మధ్య స్నేహం, విశ్వాస బంధాలను పటిష్ఠం చేయనున్నాయి.

# ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**-- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్**
**గత మూడేళ్లలో విద్యుత్ శాఖ పరిధిలో 445 మందికి పైగా కారుణ్య నియామకాలు**
**ఏపీఈపీడీసీఎల్‌లో 43 మంది అర్హులకు నియామక పత్రాలు అందజేత**
**త్వరలో లైన్‌మెన్ పోస్టుల భర్తీకి చర్యలు**
**విద్యుత్ ప్రమాదాల నివారణకు భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి**
**1912 కాల్ సెంటర్‌ను పరిశీలించి వినియోగదారులతో స్వయంగా మాట్లాడిన మంత్రి**



**విశాఖపట్నం, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 05:** విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన విద్యుత్ ఉద్యోగుల కుటుంబాలకు అండగా నిలిచి, వారి కుటుంబ సభ్యులకు త్వరితగతిన కారుణ్య నియామకాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. విశాఖపట్నంలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని సంస్థలో అర్హులైన 43 మంది అభ్యర్థులకు కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. కారుణ్య నియామకాల కోసం అర్హులైన కుటుంబాలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండకూడదనే ఉద్దేశంతో గత రెండున్నర, మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న నియామకాలను వేగంగా పూర్తి చేస్తున్నామని మంత్రి తెలిపారు. మూడు విద్యుత్ పంపిణీ సంస్థలతో పాటు ప్రసార, ఉత్పత్తి సంస్థల్లో కలిపి ఇప్పటివరకు 445 మందికి పైగా కారుణ్య నియామకాలు కల్పించామని చెప్పారు. ఉద్యోగిని కోల్పోయిన కుటుంబంలో కనీసం ఒకరికి ఉపాధి కల్పించడం ద్వారా ఆ కుటుంబానికి భరోసా కల్పించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు.

విద్యుత్ శాఖలో మానవ వనరుల కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. గ్రామ సచివాలయాల్లో ఇంధన సహాయకులుగా పనిచేస్తున్న సిబ్బందిని విద్యుత్ శాఖలోకి తీసుకోవడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6,500 నుంచి 7,000 మంది వరకు సిబ్బందిని సమకూర్చుకున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యుత్ శాఖపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రతి పది రోజులకు ఒకసారి విద్యుత్ పరిస్థితి, సిబ్బంది, సేవల పంపిణీ తదితర అంశాలపై సమీక్షిస్తున్నారని తెలిపారు.

విద్యుత్ శాఖలో సహాయ ఇంజనీర్ పోస్టులను పెంచాలని కోరగా ముఖ్యమంత్రి 629 పోస్టులను ఒకేసారి మంజూరు చేశారని మంత్రి తెలిపారు. ఈ పోస్టులకు పరీక్ష పూర్తయిందని, ఫలితాలను పారదర్శకంగా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచి, ధ్రువపత్రాల పరిశీలన అనంతరం త్వరితగతిన నియామకాలు చేపడతామని చెప్పారు. దాదాపు లక్ష మంది దరఖాస్తు చేసుకోగా సుమారు 85 వేల మంది పరీక్షకు హాజరయ్యారని, నియామక ప్రక్రియలో ఎలాంటి విమర్శలకు తావులేకుండా పూర్తి పారదర్శకతతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు క్షేత్రస్థాయిలో సిబ్బంది మరింత అవసరమని మంత్రి అన్నారు. 629 సహాయ ఇంజనీర్ పోస్టుల భర్తీ అనంతరం ముఖ్యమంత్రి అనుమతితో లైన్‌మెన్ పోస్టులను కూడా భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా భవిష్యత్ అవసరాలను ముందుగానే అంచనా వేసి విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని చెప్పారు.

విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో పాటు పంపిణీ వ్యవస్థను కూడా బలోపేతం చేస్తున్నామని మంత్రి తెలిపారు. గతంలో ప్రారంభమై పెండింగ్‌లో ఉన్న ఉపకేంద్రాల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయడంతో పాటు కొత్త ఉపకేంద్రాలు, ప్రసార వ్యవస్థ బలోపేతం, నగర ప్రాంతాల్లో భూగర్భ విద్యుత్ కేబులింగ్ వంటి కార్యక్రమాలను చేపడుతున్నామని చెప్పారు. పరిశ్రమలకు నిరంతరాయ విద్యుత్ అందించడం ద్వారా పెట్టుబడులు, ఉపాధి అవకాశాల పెంపునకు విద్యుత్ శాఖ కీలకంగా పనిచేస్తోందన్నారు. ప్రజలు విద్యుత్‌ను సమర్థవంతంగా వినియోగించేలా విస్తృత అవగాహన కల్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పగటి సమయంలో విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా రాత్రి వేళల్లో, అత్యధిక డిమాండ్ సమయంలో విద్యుత్ వ్యవస్థపై ఒత్తిడిని తగ్గించవచ్చని తెలిపారు. పునరుత్పాదక ఇంధన వనరులను ప్రోత్సహించడంతో పాటు పీఎం సూర్యఘర్ పథకంపై విస్తృత ప్రచారం నిర్వహించి పైకప్పులపై సౌర విద్యుత్ వ్యవస్థల ఏర్పాటును పెంచాలని సూచించారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు విద్యుత్ చార్జీలను పెంచలేదని మంత్రి తెలిపారు. వచ్చే ఐదేళ్లలోనూ విద్యుత్ చార్జీలు పెంచకుండా వ్యవస్థను బలోపేతం చేయాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని చెప్పారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిని పెంచడంతో పాటు హరిత విద్యుత్ ప్రసార మార్గాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

విద్యుత్ ఉద్యోగులు విధి నిర్వహణలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. భద్రతా విధానాలు, విద్యుత్ సరఫరా నిలిపివేత ప్రక్రియపై పూర్తి అవగాహన లేకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. శాఖ సిబ్బందితో పాటు కాంట్రాక్టర్లు, ఇతర సాంకేతిక సిబ్బందికి కూడా భద్రతా విధానాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు ఉద్యోగం లేదా ఆర్థిక సహాయం అందించడం ద్వారా కొంత మేరకు అండగా నిలవగలిగినా, ఒక కుటుంబాన్ని కోల్పోయిన లోటును భర్తీ చేయలేమని, అందువల్ల ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలే అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు.

విద్యుత్ శాఖ ప్రజల దృష్టిలో అత్యుత్తమ సేవలు అందించే శాఖగా నిలవాలని, పారదర్శకత, బాధ్యతతో పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచాలని మంత్రి అధికారులను కోరారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, కష్టాల్లో ఉన్న ఉద్యోగుల కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కారుణ్య నియామకాలకు ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. విద్యుత్ శాఖ మంత్రి స్వయంగా కార్యక్రమానికి హాజరై నియామక పత్రాలు అందజేయడం అభినందనీయమన్నారు. హుద్‌హుద్ తుపాను సమయంలో విద్యుత్ శాఖ ప్రాధాన్యత స్పష్టంగా కనిపించిందని, ప్రస్తుతం భూగర్భ కేబులింగ్ సహా విద్యుత్ వ్యవస్థ బలోపేతానికి చర్యలు జరుగుతున్నాయని తెలిపారు. విద్యుత్ శాఖకు తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు.

విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ, పార్లమెంటు ఇంధన కమిటీలో సభ్యుడిగా ఉన్న తనకు విద్యుత్ రంగంతో మరింత ప్రత్యక్ష సంబంధం ఏర్పడిందన్నారు. పగటి సమయంలో విద్యుత్ వినియోగాన్ని పెంచడం ద్వారా విద్యుత్ వ్యవస్థపై ఒత్తిడిని తగ్గించవచ్చని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నూతనంగా ఉద్యోగాలు పొందిన వారు తమ వృత్తికి, కుటుంబానికి న్యాయం చేసేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.

కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పి. విష్ణుకుమార్ రాజు, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి, ఐఏఎస్, సంస్థ డైరెక్టర్లు టి.వి. సూర్యప్రకాష్, టి. వనజ, ఎస్. హరిబాబు, సీజీఎంలు, ఎస్ఈలు, ఇతర విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

**1912 కాల్ సెంటర్‌ను పరిశీలించిన మంత్రి గొట్టిపాటి**

అనంతరం మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఏపీఈపీడీసీఎల్ 1912 కాల్ సెంటర్‌ను సందర్శించి దాని పనితీరును పరిశీలించారు. వినియోగదారుల నుంచి అందుతున్న ఫిర్యాదులు, వాటిపై సిబ్బంది స్పందిస్తున్న తీరు, ఫిర్యాదుల పరిష్కారానికి తీసుకుంటున్న సమయం తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. కాల్ సెంటర్ సిబ్బంది వినియోగదారులతో మాట్లాడుతున్న తీరును స్వయంగా పరిశీలించిన మంత్రి, కొంతమంది వినియోగదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదులపై వేగంగా స్పందించి, నిర్ణీత సమయంలో సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వినియోగదారులే కేంద్రబిందువుగా విద్యుత్ సేవలను మరింత మెరుగుపరచాలని, ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి పరిష్కరించే వరకు పర్యవేక్షించాలని సూచించారు.

## ప్రతిష్ఠాత్మకమైన గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌ను విజయవంతం చేయాలి

**-ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 5:** డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సచివాలయంలో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి సమీక్షించారు. ప్రతిష్ఠాత్మకమైన గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న ఏర్పాట్లను ప్రధాన కార్యదర్శి సమీక్షించారు. ఆయా శాఖలు ఇప్పటివరకు సాధించిన పురోగతిని అడిగి తెలుసుకున్న ఆయన షెడ్యూల్ ప్రకారం అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రముఖ కంపెనీల నుంచి సమ్మిట్‌కు విస్తృత భాగస్వామ్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. రాష్ట్రంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న అన్ని ప్రముఖ కంపెనీలకు సమ్మిట్ అడ్వైజరీ బోర్డు లేదా ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని ఆదేశించారు.

ప్రముఖ బహుళజాతి కంపెనీల గ్లోబల్ హెడ్‌లను సమ్మిట్‌కు ఆహ్వానించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అధికారులను ఆదేశించారు. అంతర్జాతీయ స్థాయి కంపెనీల అగ్ర నాయకత్వంతో అనుసంధానం ఏర్పరచి, ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో వారి భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఈ నెలలో విదేశాలలో రోడ్‌షోలను నిర్వహించాలని సిఎస్ ఆదేశించారు. ఈ రోడ్‌షోల ద్వారా తెలంగాణలోని పెట్టుబడి అవకాశాలు, వ్యాపార అనుకూల వాతావరణం, పెట్టుబడులకు అందుబాటులో ఉన్న అవకాశాలను అంతర్జాతీయ పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థల ప్రముఖులకు వివరించే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఈ నెలాఖరున న్యూఢిల్లీలో కూడా రోడ్‌షో నిర్వహించాలని ప్రధాన కార్యదర్శి ఆదేశించారు.

అన్ని రంగాలకు సంబంధించిన టెండరింగ్ ప్రక్రియను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పూర్తి చేసినట్లు సమావేశంలో అధికారులు తెలిపారు. అరేనా, ఎగ్జిబిషన్ ఏర్పాట్లతో పాటు మీడియా, ఆతిథ్యం, లాజిస్టిక్స్, ప్రోటోకాల్, ఆహారం, సాంస్కృతిక కార్యక్రమాలు, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లు కూడా నిర్ణీత షెడ్యూల్ ప్రకారం కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి కార్యాలయ సలహాదారు, ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు నవీన్ మిట్టల్, వాణీ ప్రసాద్, ముఖ్య కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, సీఈఓ సెర్ప్ దివ్య, స్పెషల్ సిఐపిఆర్ ముకుంద రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## సింగరేణి భవన్ ముట్టడించిన కల్వకుంట్ల కవిత

**హెచ్ఎంఎస్, టీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆందోళన**
**సీఎండీ వచ్చి చర్చలు జరిపి సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వాలని డిమాండ్**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 05:**



సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం టీఆర్ఎస్, హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ, డిపెండెంట్ ఉద్యోగాలు ఇవ్వకుండా సింగరేణి యాజమాన్యం తప్పించుకుంటోందని కవిత ఆరోపించారు. డిపెండెంట్ ఉద్యోగాలు కార్మికుల హక్కు అని.. అది మీరు వేసే బిచ్చం కాదని కవిత మండిపడ్డారు.

కచ్చితంగా నెలకు రెండు రోజులు మెడికల్ బోర్డు పెట్టాల్సిందేనని కవిత స్పష్టం చేశారు. సింగరేణి లాభాల్లో 35 శాతం బోనస్ ను కార్మికులకు ఇవ్వాల్సిందేనని ఆమె డిమాండ్ చేశారు. అలియాస్ పేర్లు ఉన్న కార్మికులను విజిలెన్స్ పేరుతో వేధించవద్దని కవిత కోరారు.

కార్మికులను వేధిస్తూ అక్రమంగా ఉద్యోగాలు తొలగించిన వాళ్లకు మళ్లీ ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి సంబంధించి సీఎండీ వచ్చి మాతో చర్చలు జరపాలని కవిత డిమాండ్ చేశారు.

## ఎల్‌నినో నేపథ్యంలో వరికి ప్రత్యామ్నాయంగా స్వల్పకాలిక పంటల సాగును ప్రోత్సహించాలి




**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్ అక్టోబర్ 5:** రబీ (యాసంగి) 2026–27 కార్యాచరణ ప్రణాళికపై వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్ మరియు వ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్, ఐ.ఏ.ఎస్. వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా వరికి ప్రత్యామ్నాయంగా, తక్కువ నీటితో సాగయ్యే స్వల్పకాలిక పప్పుధాన్యాలు, నూనె గింజల పంటలతో పాటు అధిక ఆదాయాన్నిచ్చే కూరగాయల పంటల సాగు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులకు అందుబాటులో ఉన్న నీటి వనరులు, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించి, పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీగా యాసంగి సీజన్‌కు సంబంధించిన సమీక్షా సమావేశాలు నిర్వహించలని అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయడం జరిగింది. క్షేత్రస్థాయి నుంచి సేకరించిన అంశాలను క్రోడీకరించి, రబీ కార్యాచరణ ప్రణాళికను రూపొందించి ప్రభుత్వానికి నివేదించనున్నారు. క్షేత్రస్థాయి అధికారులు మరియు శాస్త్రవేత్తలు రైతులకు తక్కువ నీటితో పండే పంటల ఎంపిక, అనువైన విత్తన రకాలు, పంట యాజమాన్య పద్ధతులపై విస్తృతంగా అవగాహన కల్పించాలని, రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సందేహాలను నివృత్తి చేయాలని కోరారు.

అదేవిధంగా, వ్యవసాయ కమిషనరేట్ కార్యాలయంలో ఎరువుల కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. యాసంగి సీజన్‌కు సరిపడా ఎరువుల సరఫరా, ప్రస్తుత నిల్వల స్థితిగతులపై సమీక్షించి, రాబోయే సీజన్‌లో ఎరువుల కొరత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ సంచాలకులు డా. బి. గోపి, ఐ.ఏ.ఎస్., ఉద్యానవన శాఖ సంచాలకులు డా. యాస్మీన్ బాషా, ఐ.ఏ.ఎస్. పాల్గొన్నారు. వీరితో పాటు వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, అంతర్జాతీయ అర్ధ–శుష్క ఉష్ణమండల పంటల పరిశోధనా సంస్థ (ఇక్రిశాట్), కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనా సంస్థ (క్రిడా), భారత వాతావరణ శాఖ (ఐఎండీ ), భారతీయ వరి పరిశోధనా సంస్థ (ఐఐఆర్ఆర్ ), భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ (ఐఐఎంఆర్ ), భారతీయ నూనె గింజల పరిశోధనా సంస్థ (ఐఐఓఆర్ ), ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యానవన విశ్వవిద్యాలయాల అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

## 4 లక్షల లంచం తీసుకుంటూ పట్టుపడ్డ టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 05:** నగరంలోని జీహెచ్ఎంసి అధికారుల అవినీతి అక్రమాలపై ఏసీబీ (అవినీతి నిరోధక శాఖ) దాడులు కొనసాగుతున్నాయి. మెహదీపట్నంలోని జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో రూ. 4 లక్షల లంచం తీసుకుంటూ టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్ సునీత ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడింది. వివరాల్లోకి వెళితే.. భవన నిర్మాణ అనుమతులు, క్లియరెన్స్ వ్యవహారంలో ఒక బాధితుడి నుంచి రూ. 4 లక్షల లంచాన్ని టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ సునీత డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. బాధితుడు ఈ విషయాన్ని ఏసీబీ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు పక్కా ప్లాన్తో ఎంట్రీ ఇచ్చారు.



సోమవారం మెహదీపట్నం జీహెచ్ఎంసీ ఆఫీస్లో సదరు బాధితుడి నుంచి రూ. 4 లక్షలు లంచం డబ్బులు స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడి చేసి సునీతను అదుపులోకి తీసుకున్నారు. లంచం డబ్బులను స్వాధీనం చేసుకున్న అధికారులు, కార్యాలయంలోని ఇతర డాకుమెంట్లు, ఫైళ్లను కూడా ణ్ణంగా పరిశీలిస్తున్నారు. సునీత గతంలో కూడా ఇలాంటి అక్రమాలకు పాల్పడిందా అనే కోణంలో విచారణ కొనసాగిస్తున్నారు.

# శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష



**తిరుమల, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 05:** తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు మరో వారం రోజుల గడువు మాత్రమే ఉన్న నేపథ్యంలో టీటీడీ ఈవో శ్రీ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వివిధ విభాగాల ఏర్పాట్లపై సోమవారం అన్నమయ్య భవన్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బారాయుడు, టీటీడీ జేఈవోలు డాక్టర్ శరత్, ప్రభల గోపీనాథ్, సీవీఎస్వో, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈవో ముద్దాడ రవిచంద్ర మాట్లాడుతూ, సెప్టెంబర్ 15 నుంచి 23వ తేదీ వరకు జరిగిన తొమ్మిది రోజుల సాలకట్ల బ్రహ్మోత్సవాలను భక్తులకు అనుకూలంగా, ప్రశాంత వాతావరణంలో శ్రీవారి దర్శనం కల్పించేలా పటిష్టమైన ఏర్పాట్లతో విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ఇందుకు అన్ని విభాగాలు, పోలీసు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయడం ప్రధాన కారణమని, ఇదే సమన్వయ స్ఫూర్తిని నవరాత్రి బ్రహ్మోత్సవాల్లోనూ కొనసాగించాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. నవరాత్రి బ్రహ్మోత్సవాల సమయంలో వరుస సెలవులు, పెరటాసి మాసం నేపథ్యంలో గతంతో పోలిస్తే సుమారు 25 నుంచి 30 శాతం అధికంగా భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేసినట్లు ఈవో తెలిపారు. ఈ మేరకు పెరిగే భక్తుల రద్దీకి అనుగుణంగా అన్ని విభాగాలు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను సమగ్రంగా సమీక్షించి, ఏ అంశాలు సక్రమంగా అమలయ్యాయి, భక్తులకు ఏ ఏర్పాట్లు మరింత అనుకూలంగా నిలిచాయి, ఎక్కడైనా చిన్నచిన్న లోటుపాట్లు ఉన్నాయా, వాటిని ఎలా సరిదిద్దుకోవాలనే అంశాలపై చర్చించినట్లు ఈవో తెలిపారు. గుర్తించిన లోటుపాట్లను నవరాత్రి బ్రహ్మోత్సవాల సమయంలో పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

భక్తుల సౌకర్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ లాజిస్టిక్స్, అన్నప్రసాదం, వైద్య ఆరోగ్యం, పారిశుధ్యం, రవాణా తదితర అన్ని విభాగాల్లో అవసరమైన ఏర్పాట్లు ఇప్పటికే చేపట్టినట్లు తెలిపారు. నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు ప్రశాంతంగా శ్రీవారి దర్శనం చేసుకుని, వాహన సేవలను వీక్షిస్తూ ఆధ్యాత్మిక అనుభూతిని పొందేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఈవో సూచించారు. భక్తులందరూ తిరుమలకు విచ్చేసి ప్రశాంతంగా శ్రీవారి దర్శనం చేసుకుని, వాహన సేవల్లో పాల్గొని మంచి ఆధ్యాత్మిక అనుభూతిని పొందాలని టీటీడీ ఈవో కోరారు. ఈ సమావేశంలో అన్నప్రసాదం, పారిశుధ్యం, శ్రీవారి సేవకులు, వైద్య సేవలు, రవాణా, పుష్పాలంకరణలు, విద్యుత్ అలంకరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఎస్వీబీసీ ప్రసారాలు, టీటీడీ విజిలెన్స్, పోలీసుల భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. టీటీడీలోని వివిధ విభాగాల ఉన్నతాధికారులు, పోలీసు, ఏపీఎస్ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

# మహా ధర్నా విజయవంతం

- స్పందించని జిల్లా అధికారి
- 25 వేల మందిని ఆపలేని పోలీసు వ్యవస్థ
- గంటలకొద్ది వాహనాలు నిర్బంధం
- అనేకసార్లు ఉన్నత అధికారులు సముజాయించే ప్రయత్నం
- అంచనాల కంటే అనుగుణంగా హాజరైన జేఏసీ సంఘాల ఆదివాసీలు



**కొత్తగూడెం ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 05:** ఆ హక్కులు మాకు కావాలంటూ , జీవోలను కట్టుదిట్టంగా పకడ్బందీగా అమలు చేయాలని ఆదివాసి జేఏసీ సంఘాల తరపునుంచి సోమవారం రోజు ఆదివాసి జేఏసీ సంఘాల నాయకులు కొత్తగూడెం కలెక్టరేట్ ముట్టడికి బహిరంగంగా పిలుపునిచ్చారు, ఏజెన్సీ ప్రాంతాలలో ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయాలను ప్రతి ఒక్కరు క్షుణ్ణంగా తెలుసుకొని ఆదివాసి గూడేలాల్లో నుంచి ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా ముట్టడి కార్యక్రమానికి హాజరవ్వటం ప్రతి ఒక్కరికి అవగాహన కలిగిందని అనిపిస్తుంది, ఉమ్మడి వరంగల్ జిల్లా, ఉమ్మడి ఖమ్మం జిల్లా, మహబూబాబాద్ జిల్లా నుంచి బారి స్థాయిలో ఉదయం 10 గంటలకి ఇల్లందు క్రాస్ రోడ్డుకు చేరుకున్నారు, ఇల్లందు క్రాస్ రోడ్డు నుంచి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వరకు జై ఆదివాసి అంటూ నినాదాలు పలుకుతూ పాదయాత్రతో కలెక్టర్ కార్యాలయాన్ని చేరుకొని ముట్టడి చేశారు, ఆగ్రహంతో ఉగ్రూతలూగుతున్న ఆదివాసీలను అదుపు చేయటానికి అప్పటికే చేరుకున్న పోలీసు బలగాలు ఛాయ శక్తుల ప్రయత్నం చేశాయి, ఎట్టకేలకు ప్రయత్నం విఫలం అవ్వడం తోటి ప్రధాన రహదారిపై వాహనాలను నిర్బంధం చేశారు, గంటల తరబడి వాహనలను నిరుపందాలు చేసినప్పటికీ జిల్లా కలెక్టర్ ఆచూకీ మాత్రం కానరాగపోవడం ఆలోచింపదగ్గ విషయంగా మారింది, జిల్లా రెవెన్యూ అధికారి, డి.ఎస్.పి అనేకసార్లు పరిస్థితిని సద్దుమనిషి పరిణామాలు చూపించినప్పటికీ వారి ఫలితాలు ఏమి ఫలించ లేకపోయాయి, ఆదివాసీలు నినాదాలు గానీ, వారి ఆచారాలు గాని , ఏమాత్రం ఒక అంగుళం కూడా మార్చలేకపోయారు, చివరకు జిల్లా కలెక్టర్కు సోమవారం అయిన ప్రజావాణి రోజు జ్వరం వస్తుందని పెద్ద స్థాయి అధికారులు చెప్పుకొస్తా ఉండటం , గంటల తరబడి వాహనాలలో ఉన్న వాహనదారుడు ఇబ్బంది పడుతున్నప్పటికీ, సమస్యను పరిగణంలోకి తీసుకోవడానికి రాకపోవడం స్థానిక ప్రజలు ఆలోచింపదగ్గ విషయంగా మారింది, ఆదివాసీల దెబ్బకి కలెక్టర్ అబ్బ అంటూ నినాదాలు చేస్తూ చెట్టుమీద కొంగ గిరిజనేతరులకు సపోర్ట్ చేస్తున్న అంకితరాయా అంటూ 8 గంటల సమయంలో అన్ని ప్రాంతాల ఆదివాసీలు వెనుతిరిగారు, మరి కొంత సమయం కేటాయించి నమ్మకంగా మరో మారు మూకుముడిగా మహా ధర్నా మాదిరిగా జిల్లా వ్యవస్థను కట్టుదిట్టం చేయాలని ఆదివాసి జెసి సంఘాలు తెలుపుతున్నాయి,

# నాడు ఉపాధిని కల్పిస్తే.. నేడు ఉపాధిని మర్చిపోయారు

- కేసీఆర్ పాలనలో పోలీస్, పంచాయతీ రాజ్, రెవెన్యూ శాఖలో ఎన్నో ఉద్యోగాలు భర్తీ చేశారు
- నేటి రేవంత్ రెడ్డి పాలనలో ఉపాధి ఊసే లేదు
- నిరుద్యోగులను పట్టించుకునే దిక్కులేదు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది
- యువత ఆలోచించాలి. పట్టభద్రులు కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరును గ్రహించాలి
- పట్టుదలతో పార్టీ శ్రేణులు పనిచేసి బీఆర్ఎస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిని పెద్ద మెజార్టీతో గెలిపించాలి
- ఓటర్ నమోదు పై అన్ని వర్గాల పార్టీ శ్రేణులు దృష్టి సారించాలి
- షాద్ నగర్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్





**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 05:** కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారనే విషయం రాష్ట్ర ప్రజలకు అర్థమైందని మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ అన్నారు. సోమవారం షాద్ నగర్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పట్టభద్రుల ఎన్నికల ఓటర్ నమోదుపై నిర్వహించిన పార్టీ శ్రేణుల అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ పాలనలో రెవెన్యూ. పంచాయతీ రాజ్. పోలీస్ శాఖలో వేల ఉద్యోగాలను భర్తీ చేశారని. రెండు లక్షల ఉద్యోగాల నోటిఫికేషన్ వేస్తామని. నిరుద్యోగ భృతి తక్షణమే అమలు చేస్తామని నిరుద్యోగుల సాక్షిగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం యువతకిచ్చిన మాట తప్పిందని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేజీ టు పిజీ వరకు ఉచిత విద్యనుఅందించడంతోపాటు కార్పొరేట్ స్థాయి ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసిన ఘనత కేసిఆర్ కు దక్కితే. ఉన్న ప్రభుత్వ విద్యను నీరుగారిచే విధంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రవర్తిస్తుందని ఆరోపించారు. గత మూడు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరును యువత గ్రహించాలని. పాలన తీరును ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని. నేటి నుంచే గెలుపు కోసం కృషి చేసేందుకు ఐక్యమత్యంగా నిలబడాలని కోరారు. పట్టభద్రుల ఓట్ల నమోదు ప్రక్రియలో ఉత్సాహంగా పాల్గొని. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుని కలిసి నమోదు చేయించాలని కోరారు. ఆన్లైన్. ఆఫ్లైన్లలో నమోదు కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలి పూర్తి స్థాయి అవగాహన పెంచుకొని. ఓటు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి. రవీందర్ యాదవ్.మాజీ ఎస్సీ. ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబల్ నాయక్. మహిళా కోఆర్డినేటర్ రాజ్యలక్ష్మితో పాటు మాజీ మార్కెట్ చైర్మన్లు. మాజీ మున్సిపల్ చైర్మన్లు. మాజీ ఎంపీపీలు. మాజీ జడ్పీటీసీలు. మాజీ పీఏసీఎస్ చైర్మన్లు. మాజీ గ్రంథాలయ చైర్మన్లు. మాజీ వైస్ చైర్మన్లు. మాజీ వైస్ ఎంపీపీలు. బీఆర్ఎస్ మండల. గ్రామ. మున్సిపాలిటీ.వార్డు అధ్యక్షులు. ప్రస్తుత మరియు మాజీ సర్పంచులు.కౌన్సిలర్లు. మాజీ కౌన్సిలర్లు. మాజీ ఎంపీటీసీలు. మాజీ ప్రజాప్రతినిధులు. బీఆర్ఎస్ యువత. అనుబంధ విభాగాల నాయకులు. కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నాటి కేసీఆర్ సంకల్పమే.. నేటి కల్యాణ లక్ష్మి - మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

- పేద ఆడపిల్లలకు మేనమామగా అండగా నిలిచిన కేసీఆర్...
- కల్యాణ లక్ష్మి 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం..
- హామీలు నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది అంజయ్య యాదవ్





**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 05:** షాద్ నగర్ టౌన్: తెలంగాణ రాష్ట్ర సాధకుడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దృఢ సంకల్పంతోనే పేద యువతుల జీవితాల్లో వెలుగులు నింపిన 'కల్యాణ లక్ష్మి. పథకం పురుడు పోసుకుందని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ తెలిపారు. కల్యాణ లక్ష్మి పథకం ప్రారంభమై 12 ఏళ్లు పూర్తయిన శుభ సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కేసీఆర్ చిత్రపటానికి నాయకులతో కలిసి ఆయన ఘనంగా పాలాభిషేకం నిర్వహించారు.

ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. గతంలో ఆడపిల్ల పెళ్లి చేయాలంటే తల్లిదండ్రులు అప్పులపాలై తీవ్ర ఇబ్బందులు పడేవారని. నాటి సామాజిక పరిస్థితులను చూసి చలించిన కేసీఆర్ ఒక పెద్దన్నగా మేనమామగా అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ పథకానికి శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. గిరిజన కుటుంబాల కష్టాలను చూసి మొదట రూ. 50 వేల ఆర్థిక సాయంతో ప్రారంభమైన ఈ పథకాన్ని. ఆ తర్వాత రూ. 1,00,116లకు పెంచి పేద ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు.

కాంగ్రెస్ మోసపూరిత హామీలు

బిఆర్ఎస్ మూడోసారి అధికారంలోకి వస్తే కల్యాణ లక్ష్మి సాయాన్ని రూ. 3 లక్షలకు పెంచుతామని కేసీఆర్ ప్రకటిస్తే.. కాంగ్రెస్ పార్టీ రూ. లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని మోసపూరిత మాటలతో అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. తీరా అధికారంలోకి వచ్చాక ఆ పథకాన్ని. మహిళల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని. ప్రస్తుత ముఖ్యమంత్రికి మహిళా అభివృద్ధిపై కనీస ధ్యాస లేదని ఆరోపించారు.

?ఈ కార్యక్రమంలో మహిళా కోఆర్డినేటర్ రాజ్యలక్ష్మి. మాజీ మున్సిపల్ చైర్మన్ లావణ్య. మాజీ జడ్పీటీసీ ఎమ్మె శ్రీలత. ఫరూఖ్ నగర్ మండల మహిళా అధ్యక్షురాలు సుష్మా రెడ్డి. మాజీ వైస్ ఎంపీపీ మౌనిక. కౌన్సిలర్లు పిల్లి శారద. జి.టి. వసంత. ఒగ్గు జయలక్ష్మి. నడికూడ అనిత. చల్లా వాణి. మాజీ కౌన్సిలర్లు ప్రేమలత. జూపల్లి కౌసల్య. సర్పంచ్ నాళ్ళపురం రాధిక. మహిళా నాయకులు విజయలక్ష్మి. కృష్ణవేణి. పద్మమ్మ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి భూమి పూజలు

- చౌడాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్



**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 05:** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి మహిళల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి,సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ అనేక కార్యక్రమాలు అమలు చేస్తోంది.ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం,మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు,మహిళా సంఘాల ద్వారా వివిధ వ్యాపార అవకాశాలను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు."కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలి" అనే లక్ష్యంతో మహిళా స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో చౌడాపూర్ మండలంలోని సుమారు 24 గ్రామ పంచాయతీలకు 24 మహిళా సంఘాల భవనాలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు.చౌడాపూర్ మండల కేంద్రంలో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి ప్రత్యేక పూజలు నిర్వహించి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టడం జరిగింది. పిఎసిఎస్ వైస్ చైర్మన్ ఏలపాటి అశోక్ కుమార్ పాల్గొని మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఏయి శివ గౌడ్.పంచాయతీ కార్యదర్శి రమేష్ కుమార్, సర్పంచ్ పరిగి నవీన్ కుమార్,ఉప సర్పంచ్ బ్యాగరి రాజు, పిఎసిఎస్ డైరెక్టర్ వెంకటయ్య ,మరికల్ గ్రామ పెద్దలు నర్సింహారెడ్డి, చౌడాపూర్ మండల ప్రధాన కార్యదర్శి రాము,జమ్మె

# చిరు వ్యాపారులను ఇబ్బందులకు గురి చేయవద్దు




**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 05:** , హత్నూర మండలం కాసాల గ్రామపంచాయతీ 12వ వార్డు పరిధిలోని చిరు వ్యాపారుల డబ్బాలను తొలగించాలని పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన డబ్బాల తొలగింపు నోటీసులను ఉపసంహరించుకునేలా తగిన చర్యలు తీసుకొని తమ జీవనోపాధికి అవసరమైన వసతులను రక్షించాలని కోరుతూ సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణిలో చిరు వ్యాపారులు, సంగారెడ్డి జిల్లా ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా ఇన్చార్జ్ మిట్టపల్లి రాజేశ్వర్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కు వినతిపత్రం అందజేశారు. తమ డబ్బాల వల్ల ఎవరికి ఇబ్బందులు లేకపోయినప్పటికీ పంచాయతీ కార్యదర్శి ఉద్దేశపూర్వకంగా తొలగింపు చర్యలకు పాల్పడుతున్నారని వినతి పత్రంలో కలెక్టర్ ను కోరారు. గత పది సంవత్సరాల నుండి ఈ డబ్బాలు పెట్టుకొని జీవనోపాధి జరుగుతుందని వీటిని తొలగిస్తే తమ జీవనోపాధి రోడ్డు పాలవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా ఇన్చార్జి మిట్టపల్లి రాజేశ్వర్ మాట్లాడుతూ చిరు వ్యాపారులను ఇబ్బందుల గురి చేయడం సరైన పద్ధతి కాదని డబ్బాల తొలగింపు నిర్ణయానికి ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు చిరు వ్యాపారులను అక్కడి నుంచి తొలగించి ఇతరులకు ఆ చోటు కేటాయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు.

## ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మించుకుంటున్న డబ్బాలు తొలగించాలి ఒకరి కోసం వందమంది బలి సర్పంచ్ వెంకటేశం కుట్ర



**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 05:** హత్నూర మండలం కాసాల గ్రామపంచాయతీ పరిధిలోని 12వ వార్డు పరిధిలో అక్రమంగా నిర్మించుకుంటున్న డబ్బాలను తీసి వేయాలని కాసాల గ్రామస్తులు సోమవారం సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ కొంతమంది డబ్బాల యజ మానుల వద్ద అడ్వాన్సులు నెల నెల కిరాయిలు తీసుకుంటూ గ్రామపంచాయతీకి రావలసిన ఆదాయానికి గండి పొడుస్తున్నారని అన్నారు.గ్రామ పంచాయతీకి అటు ప్రభుత్వ ఆఫీసులకు సంబంధం లేకుండా ప్రధాన రోడ్డుకు ఇరువైపులా డబ్బాలు వేస్తూ కిరాయిలు వసూలు చేస్తున్న అక్రమన దారులపై కచ్చితంగా చర్యలు తీసుకోవాలని కాసాల గ్రామస్తులు కలెక్టరేట్లో ఫిర్యాదు చేశారు. దీని రాజకీయం చేస్తే మాకు సంబంధం లేదని అంటూ నిక్కచ్చిగా నిరుపేదలకు న్యాయం జరగాలి అని అన్నారు.డబ్బాలు వేసుకొని కిరాయి రూపేన లబ్ధి పొందుతూ ఇక్కడ ప్రభుత్వానికి అక్కడ గ్రామపంచాయతీకి సంబంధం లేకుండా ప్రజలకు ఉపయోగకరంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను చిన్న భిన్నం చేస్తున్న అక్రమ దారులపై చర్యలు తీసుకోవాలని కాసాల గ్రామస్తులు కోరారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులతో 11 కుటుంబాల్లో వెలుగు..

**ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి చొరవతో రూ.3.28 లక్షల ఆర్థిక సాయం..**

**ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 05:**





కష్టకాలంలో ఉన్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలిచింది. ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ కుమార్ రెడ్డి చొరవతో మంజూరైన చెక్కులను మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం కోసం దరఖాస్తు చేసుకున్న 11 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 3,28,000 విలువైన చెక్కులను అందజేశారు. ఈ సాయం తమకు ఎంతో ఊరటనిచ్చిందని లబ్ధిదారులు ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలిపారు.

మండలంలో చెక్కులు పొందిన లబ్ధిదారుల వివరాలు:
గొల్ల రాజు (చౌదరిగూడ) రూ. 60,000
పర్వతాపురం పారిజాతం (చౌదరిగూడ) – రూ. 14,500
మంగలి ఆంజనేయులు (చౌదరిగూడ) – రూ. 20,000
కుర్వ నర్సింలు (ఎల్కగూడ) రూ. 26,500– రైసా బేగం (ఎల్కగూడ) – రూ. 14,500
గిరిమోని మంగమ్మ (పెద్ద ఎల్కిచర్ల) – రూ. 32,000
జోగు రమేష్ (ఏదిరా) రూ. 41,000
వడ్ల బ్రహ్మయ్య (చేగిరెడ్డి ఘనపూర్) – రూ. 51,000
పిట్ట తిరుమలమ్మ (తుమ్మలపల్లి) – రూ. 10,000
కె. పురుషోత్తం (తుమ్మలపల్లి) రూ. 31,500
మంగలి శివకుమార్ (వీరన్నపేట్) – రూ. 27,000

కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు:
జిల్లెడు చౌదరిగూడ మండల మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు మీదిగడ్డ బాబురావు, బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షులు నర్సింగ్ రావు, మాజీ జెడ్పీటీసీ రామకృష్ణ, సర్పంచ్‌లు అనుష రవీందర్ రెడ్డి, రవీందర్ నాయక్, సోని శేఖర్, సీనియర్ నాయకులు ఎండీ జబ్బార్, రమేష్ నాయక్, మాజీ సర్పంచ్‌లు హరి నాయక్, శ్రీశైలం, గోపాల్ నాయక్, ఉప సర్పంచ్‌లు బాలరాజ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

త్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక

మంగళవారం అక్టోబర్ 06, 2026

www.trinetnews.com

# తొలిసారిగా భారత్‌లో అంతర్జాతీయ మెర్క్యూరీ సదస్సు

## 26 దేశాల నుంచి శాస్త్రవేత్తలు, విధాన నిర్ణేతలు, పరిశోధకులు హాజరు

**త్రైనెట్ న్యూస్, అక్టోబర్ 05:**







పాదరసం (మెర్క్యూరీ) కాలుష్యంపై ప్రపంచస్థాయి శాస్త్రీయ, విధాన చర్చలకు వేదికగా నిలిచే 17వ అంతర్జాతీయ కాన్ఫరెన్స్ ఆన్ మెర్క్యూరీ యాజ్ ఏ గ్లోబల్ పొల్యూటెంట్ (×జవీ+ూ--2026) హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ (××-ఎ)లో ప్రారంభమైంది. అక్టోబర్ 4 నుంచి 9 వరకు జరిగే ఈ సదస్సు తొలిసారిగా భారత్‌లో నిర్వహిస్తున్నారు. 26 దేశాల నుంచి శాస్త్రవేత్తలు, విధాన నిర్ణేతలు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు, పర్యావరణ నిపుణులు, పరిశ్రమ ప్రతినిధులు, శాస్త్రీయ ప్రచురణ సంస్థలు, పరిశోధకులు పాల్గొంటున్నారు.

'మినమాటా కన్వెన్షన్ అమలుకు పదేళ్లు.. విజయాలు, సవాళ్లు, భవిష్యత్ కార్యాచరణ' అనే ప్రధాన ఇతివృత్తంతో సదస్సును నిర్వహిస్తున్నారు. పాదరసం కాలుష్య నియంత్రణ, పర్యావరణం-మానవ ఆరోగ్యంపై దాని ప్రభావాలు, శాస్త్రీయ ఆధారాలను విధాన నిర్ణయాలు, కార్యాచరణతో అనుసంధానించే మార్గాలపై విస్తృతంగా చర్చిస్తున్నారు.

సదస్సు చైర్, ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ అసిఫ్ ఖురేషీ మాట్లాడుతూ, తొలిసారిగా ×జవీ+ూను భారత్‌లో నిర్వహించడం ద్వారా ఆసియా, గ్లోబల్ సౌత్ దేశాల భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. శాస్త్రీయ పరిశోధనలతో పాటు వివిధ దేశాల మధ్య కొత్త భాగస్వామ్యాలకు సదస్సు దోహదపడుతుందని తెలిపారు.సీనియర్ శాస్త్రవేత్త, ఐఐటీ హైదరాబాద్ అడ్జంక్ట్ ఫ్యాకల్టీ డాక్టర్ జగన్నాథ్ బిస్వకర్మ మాట్లాడుతూ, మూడు దశాబ్దాలకు పైగా జరిగిన మెర్క్యూరీ పరిశోధనలు పాదరసం వాతావరణం, భూమి, నీరు, ఆహార గొలుసుల్లో ఎలా ప్రయాణిస్తుందో, మానవ ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపుతుందో స్పష్టం చేశాయని అన్నారు. ఈ శాస్త్రీయ ఆధారాలను విధానాలు, కార్యాచరణగా ఎలా మార్చాలన్నదే ప్రస్తుత ప్రధాన సవాలని పేర్కొన్నారు.సదస్సులో వాతావరణం, సముద్రాలు, మంచు ప్రాంతాలు, అడవులు, తాగునీటి వ్యవస్థలు, జీవసంచయం, మానవ ఆరోగ్యం, పర్యావరణ ఆరోగ్యం, పర్యవేక్షణ, నమూనా రూపకల్పన వంటి అంశాలపై శాస్త్రీయ చర్చలు జరుగుతున్నాయి. ఆర్టిసనల్ అండ్ స్మాల్-స్కేల్ గోల్డ్ మైనింగ్, సౌందర్య సాధనాల్లో మెర్క్యూరీ, చమురు-గ్యాస్ రంగం, ఆయుర్వేద ఔషధాల్లో మెర్క్యూరీ-సీసం, జీవవైవిధ్యం, వెట్‌లాండ్స్, మెషిన్ లెర్నింగ్, పర్యావరణ నమూనాలు వంటి అంశాలపై ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు.మినమాటా కన్వెన్షన్ సెక్రటేరియట్ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ మోనికా స్టాంకీవిచ్ ప్రపంచ ఆరోగ్య సంస్థకు చెందిన డాక్టర్ ఎలెనా జర్దాన్, సౌత్ ఆఫ్రికన్ వెదర్ సర్వీస్‌కు చెందిన డాక్టర్ లిన్‌విల్ మార్టిన్ తదితరులు ప్లీనరీ సెషన్లలో పాల్గొంటున్నారు. ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం (ఖచీజూ) సహకారంతో పాదరసం కాలుష్య నియంత్రణ, బంగారం తవ్వకాల ప్రభావాలు, సౌందర్య ఉత్పత్తుల్లో మెర్క్యూరీ వినియోగం, జీవవైవిధ్యంపై ప్రభావాలపై చర్చలు జరగనున్నాయి.

సదస్సుకు జపాన్‌లోని కుమమోటో ప్రిఫెక్చర్ ప్రతినిధి బృందం కూడా హాజరవుతోంది. తీవ్రమైన పారిశ్రామిక పాదరసం కాలుష్యానికి గురైన మినమాటా ప్రాంతానికి చెందిన ప్రతినిధులతో పాటు, మినమాటా వ్యాధి బాధితురాలి ప్రత్యక్ష అనుభవాన్ని కూడా సదస్సులో వినే అవకాశం కల్పించారు.కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, తెలంగాణ ప్రభుత్వం సదస్సుకు మద్దతు అందిస్తున్నాయి. పలు అంతర్జాతీయ శాస్త్రీయ జర్నళ్లు, ప్రచురణ సంస్థలు, మెర్క్యూరీ విశ్లేషణ పరికరాల తయారీ సంస్థలు కూడా భాగస్వాములుగా ఉన్నాయి. విద్యార్థులు, యువ పరిశోధకులను ప్రోత్సహించేందుకు ట్రావెల్ అవార్డులు, ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.మెర్క్యూరీ పరిశోధనలో మూడు దశాబ్దాలకు పైగా విశేష సేవలందించిన యూనివర్సిటీ ఆఫ్ నెవాడా, రెనోకు చెందిన ప్రొఫెసర్ మే ఎస్. గస్టిన్‌కు కాథరిన్ ఆర్. మహోఫీ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందించనున్నారు. సింఘువా యూనివర్సిటీకి చెందిన డాక్టర్ కింగ్‌రు వూకు ×జవీ+ూ ఎమర్జింగ్ రీసెర్చర్ అవార్డు ప్రదానం చేయనున్నారు.హైదరాబాద్‌లో జరుగుతున్న ఈ సదస్సు ద్వారా భారత్, ఆసియా దేశాలు, గ్లోబల్ సౌత్ దేశాల శాస్త్రవేత్తల మధ్య పరిశోధనా సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయని నిర్వాహకులు తెలిపారు. శాస్త్రీయ పరిశోధనలను విధాన నిర్ణయాలు, పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్య చర్యలతో అనుసంధానించడం ×జవీ+ూ--2026 ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులను ఆదుకోవాలి : బీజేపీ నేత, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్

హన్మకొండ : తెలంగాణ రాష్ట్రం వచ్చాక గిరిజనుల వల్లనే తమకు అధికారం వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారని, మరి గిరిజన రైతుల సంక్షేమాన్ని ఎందుకు విస్మరిస్తున్నారని బీజేపీ నేత, మాజీ ఎంపీ, గిరిజన బిడ్డ అజ్మీరా సీతారాం నాయక్ ప్రశ్నించారు.

సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, గిరిజన రైతులకు సంబంధించి దాదాపు రూ.1700 కోట్ల రూపాయలసబ్సిడీ పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. క్రాప్ లోన్లు, మార్ట్‌గేజ్ లోన్ల కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న రైతులను బ్యాంకర్లు తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు.

గిరిజనుల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం కల్పించిన హక్కులను బ్యాంక్ అధికారులు కాలరాస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో లోన్ కోసం



వచ్చే గిరిజన రైతులను బ్యాంకర్లు వేధిస్తున్నారని, మార్ట్‌గేజ్ చేసుకొని లోన్లు ఇవ్వలేరా అని ప్రశ్నించారు.

తొర్రూరు వెలికట్ట కు చెందిన జాటోత్ పూల్ సింగ్ అనే రైతు మార్ట్‌గేజ్ లోన్ కోసం వెళితే బ్యాంకర్లు ఇబ్బంది పెట్టారని, దీనిపై ఆ రైతు తన ఆవేదనను వ్యక్తం చేశారని సీతారాం నాయక్ తెలిపారు. ఇది ఒక్క రైతు సమస్య కాదని, జిల్లా వ్యాప్తంగా వందలాది మంది గిరిజన రైతులు ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం మాటల్లో గిరిజన ప్రేమ చూపుతూ, చేతల్లో వారిని మోసం చేస్తోందని విమర్శించారు. ఇకనైనా బ్యాంకర్లు గిరిజన రైతులకు లోన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

గిరిజనుల హక్కుల పరిరక్షణకు బీజేపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారికి న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని సీతారాం నాయక్ స్పష్టం చేశారు.

# తెలంగాణ రాష్ట్రంలో.. విద్యుత్ వినియోగదారులపై రూ.5,420 కోట్ల భారం

**నవంబర్ బిల్లుల నుంచి ట్రూ-అప్ వసూలు..**

**తొలి నెల యూనిట్‌కు 30 పైసలు, ఆ తర్వాత 50 పైసలు**

**వ్యవసాయ వినియోగదారులకు మినహాయింపు.. రైతుల వాటా రూ.2,215 కోట్లు ప్రభుత్వమే చెల్లించాలి**

**టీజీఈఆర్సీ కీలక ఉత్తర్వులు**




**హైదరాబాద్, త్రైనెట్ న్యూస్,** అక్టోబర్ 5: తెలంగాణ విద్యుత్ వినియోగదారులపై మరో ఆర్థిక భారం పడనుంది. 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన విద్యుత్ కొనుగోలు, ఆదాయ ట్రూ-అప్ మొత్తాల్లో రూ.7,635.22 కోట్లను టీజీఎస్పీడీసీఎల్, టీజీఎన్పీడీసీఎల్ ద్వారా వసూలు చేసేందుకు తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ) మార్గాన్ని ఖరారు చేసింది. ఇందులో వ్యవసాయ రంగానికి సంబంధించిన రూ.2,214.99 కోట్లను రైతుల నుంచి వసూలు చేయకుండా ప్రభుత్వం నుంచి రాబట్టాలని ఆదేశించింది. మిగిలిన రూ.5,420.23 కోట్లను ఇతర అర్హత కలిగిన విద్యుత్ కనెక్షన్ల నుంచి వసూలు చేయాలని నిర్ణయించింది. టీజీఈఆర్సీ చైర్మన్ డాక్టర్ జస్టిస్ దేవరాజు నాగార్జున, సభ్యులు రఘు కంచర్ల, చెరుకూరి శ్రీనివాసరావులతో కూడిన కమిషన్ సోమవారం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. 2026 మార్చి 30న ఇచ్చిన ఉత్తర్వుల్లో వసూలు విధానాన్ని తరువాత నిర్ణయిస్తామని పేర్కొన్న కమిషన్.. తాజా ఉత్తర్వులతో ఆ విధానాన్ని ఖరారు చేసింది.

**రూ.7,635 కోట్ల ట్రూ-అప్**

2022-23 సంవత్సరానికి విద్యుత్ కొనుగోలు ట్రూ-అప్ కింద రూ.5,186.29 కోట్లు నిర్ణయించారు. ఇందులో టీజీఎస్పీడీసీఎల్ వాటా రూ.3,329.97 కోట్లు, టీజీఎన్పీడీసీఎల్ వాటా రూ.1,856.32 కోట్లు. 2023-24 సంవత్సరానికి ఆదాయ ట్రూ-అప్ రూ.2,448.93 కోట్లు కాగా.. టీజీఎస్పీడీసీఎల్‌కు రూ.2,335.45 కోట్లు, టీజీఎన్పీడీసీఎల్‌కు రూ.113.48 కోట్లు ఉన్నాయి. మొత్తంగా రెండు డిస్కంలకు కలిపి రూ.7,635.22 కోట్లుగా తేలింది.

**రైతులపై భారం లేదు**

వ్యవసాయ రంగానికి సంబంధించి రెండు ఆర్థిక సంవత్సరాల్లో కలిపి రూ.2,214.99 కోట్ల ట్రూ-అప్ ఉన్నట్లు కమిషన్ గుర్తించింది. ఇందులో టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో రూ.1,442.49 కోట్లు, టీజీఎన్పీడీసీఎల్ పరిధిలో రూ.772.50 కోట్లు ఉన్నాయి. ఉచిత విద్యుత్ విధానాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ మొత్తాన్ని రైతుల నుంచి వసూలు చేయకూడదని స్పష్టం చేసింది. బదులుగా ఈ మొత్తాన్ని ప్రభుత్వం నుంచి రాబట్టేందుకు డిస్కంలు చర్యలు చేపట్టాలని ఆదేశించింది.

**నవంబర్ నుంచే వసూళ్లు**

ఇతర కేటగిరీల వినియోగదారుల నుంచి వసూలు చేయాల్సిన రూ.5,420.23 కోట్లలో టీజీఎస్పీడీసీఎల్ వాటా రూ.4,222.93 కోట్లు, టీజీఎన్పీడీసీఎల్ వాటా రూ.1,197.30 కోట్లు. ఈ వసూళ్లు 2026 నవంబర్‌లో జారీ చేసే కరెంట్ బిల్లుల నుంచే ప్రారంభం కానున్నాయి.

మొదటి నెలలో యూనిట్‌కు 30 పైసలు, ఆ తర్వాత నెలల నుంచి యూనిట్‌కు 50 పైసలు చొప్పున ట్రూ-అప్ రికవరీ చేయాలని కమిషన్ నిర్ణయించింది. వినియోగదారుడి 2022-23, 2023-24 సంవత్సరాల వినియోగాన్ని ఆధారంగా చేసుకుని నెలవారీ బిల్లింగ్ పరిమాణాన్ని నిర్ణయిస్తారు.

**29 నెలలు.. 26 నెలలు**

టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో 29 బిల్లింగ్ నెలలు, టీజీఎన్పీడీసీఎల్ పరిధిలో 26 బిల్లింగ్ నెలల్లో ఈ మొత్తాన్ని రాబట్టేలా కమిషన్ వ్యవధిని నిర్దేశించింది. అయితే ఏ వినియోగదారుడి నుంచి అయినా అతని 2022-23, 2023-24 సంవత్సరాల వినియోగానికి సంబంధించిన ట్రూ-అప్ మొత్తాన్ని మించి వసూలు చేయరాదని స్పష్టం చేసింది. వీఅఎతీశీంశీట్ ఔశీతీస - ఖీఅఖుళ్రీ ౯ాతీసవతీ 29092026 ఎ7.ఎశీఆఇ.జూఎట

**బిల్లులో ప్రత్యేకంగా చూపాలి**

ట్రూ-అప్ ఛార్జీని సాధారణ విద్యుత్ బిల్లులో కలిపేయకుండా ప్రత్యేక అంశంగా చూపించాలని టీజీఈఆర్సీ ఆదేశించింది. ఏ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మొత్తం, ఎంత నెలవారీ వినియోగంపై లెక్కించారో, ఏ రేటును వర్తింపజేశారో బిల్లులో స్పష్టంగా పేర్కొనాలి. ఒక బిల్లింగ్ నెలలో రెండు ఆర్థిక సంవత్సరాల రికవరీ ఉంటే.. రెండింటినీ విడివిడిగా చూపాలి.

మొదటి ట్రూ-అప్ ఛార్జీ బిల్లు జారీకి ముందు టీజీడిస్కంలు తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో ఒక్కో విస్తృత ప్రచారం ఉన్న దినపత్రికలో నోటీసు ఇవ్వాలని కూడా కమిషన్ ఆదేశించింది. వసూలు విధానం, రేటు, వ్యవధిని అందులో వివరించాలి.

**సుప్రీంకోర్టు మార్గదర్శకాల నేపథ్యంలో..**

ట్రూ-అప్ వసూళ్ల నిర్ణయం తీసుకునేటప్పుడు సుప్రీంకోర్టు, ఏపిటీఈఎల్ ఇచ్చిన మార్గదర్శకాలను కమిషన్ పరిగణనలోకి తీసుకుంది. టారిఫ్ సాధ్యమైనంత వరకు వ్యయానికి అనుగుణంగా ఉండాలని, రెగ్యులేటరీ ఆస్తుల భారం పరిమితంగా ఉండాలని, ఇప్పటికే ఉన్న రెగ్యులేటరీ ఆస్తులను గరిష్ఠంగా నాలుగేళ్లలో పరిష్కరించాల్సిన అవసరం ఉందని ఆదేశాలను ఉత్తర్వుల్లో ప్రస్తావించింది.

మొత్తానికి.. నవంబర్ నుంచి కరెంట్ బిల్లుల్లో కొత్త ట్రూ-అప్ ఛార్జీ కనిపించనుంది. వ్యవసాయ వినియోగదారులకు మాత్రం ప్రత్యక్ష భారం లేకుండా రూ.2,214.99 కోట్లను ప్రభుత్వం నుంచి రాబట్టే విధానాన్ని కమిషన్ ఖరారు చేసింది. మిగిలిన రూ.5,420.23 కోట్ల భారం ఇతర అర్హత కలిగిన వినియోగదారులపై పడనుంది.

# గుండ్ల సింగారం బాలాజీ బంజారా కాలనీలో నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు

**త్రైనెట్ న్యూస్, అక్టోబర్ 05:**



గుండ్ల సింగారం బాలాజీ బంజారా కాలనీలో ప్రజల సౌకర్యార్థం మాజీ కార్పొరేటర్ లావుడియా రవి నాయక్ ఆధ్వర్యంలో పాత విద్యుత్ స్తంభాలను తొలగించి, వాటి స్థానంలో నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయించారు.

కాలనీ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా లావుడియా పల్లవి రాజు నాయక్, రమేష్ నాయక్, లక్ష్మణ్ నాయక్, మాలోత్ పులి రాజు, తిరుపతి తదితరులు పాల్గొని పనులను పర్యవేక్షించారు.

నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు కావడంతో కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసిన మాజీ కార్పొరేటర్ లావుడియా రవి నాయక్‌కు, విద్యుత్ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# తెలంగాణ ఉద్యమకారుడు ముద్దు రాములు కు నివాళ్ళర్పించిన ప్రజా సంఘాల నాయకులు.

## రాములు మరణం సమాజానికి తీరనిలోటు

**త్రైనెట్ న్యూస్, అక్టోబర్ 05:**



స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ముద్దు రాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రజాసంఘాల నాయకులు నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ...తెలంగాణ ఉద్యమంలో చురుకుగా క్రియాశీలక పాత్ర వహిస్తూ రాష్ట్ర సాధన కోసం కృషిచేసిన కొల్పూర్ గ్రామ సర్పంచ్ ముద్దు రాములు మరణం సమాజానికే తీరని లోటని అన్నారు. రాజకీయరంగంలో నాయకత్వం వహించాలనే సంకల్పంతో అనేకసార్లు ఎంపీటీసీగా జడ్పిటిసిగా సర్పంచ్ గా పోటీ చేసి ఓటమి చెందినప్పటికీ వెనుతిరగకుండా కొల్పూర్ గ్రామ ప్రజల అభిమానాన్ని చూరగొని భారీ మెజార్టీతో సర్పంచ్ గా గెలిచినప్పటికీ సర్పంచ్ గా పూర్తి కాలం కొనసాగకుండానే కేవలం ఆరు నెలలు పూర్తిచేసుకుని తను తుది శ్వాస విడవడం బాధాకరమైన విషయం అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఊరు ఊరు తిరిగి తెలంగాణ ఉద్యమాన్ని రాజేయడంలో చిత్తశుద్ధితో కృషి చేసిన వ్యక్తి రాములు . అందరితో స్నేహభావంతో వెలుగుతూ తన చుట్టూ ఎక్కడ అన్యాయం జరిగినా పోరాడే శక్తులకు అండగా నిలిచిన వ్యక్తి రాములు ని కొనియాడారు. వివిధ సమస్యల కేంద్రంగా తన గ్రామానికి లేదా చుట్టుపక్కల గ్రామాలకు ప్రజాసంఘాల నాయకులు ఎవరు వచ్చినా మా ఇంట్లోనే అన్నం తిని వెళ్ళాలని గౌరవంగా మానవతా దృక్పథంతో ఆహ్వానించేవాడు. మృదు స్వభావి, ఉద్యమ స్ఫూర్తి కలిగిన నాయకుడిని కోల్పోవడం సమాజానికి తీరనిలోటని అన్నారు.

ఈ సందర్భంగా ముద్దు రాములు కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని ప్రజాసంఘాల నాయకులు తెలియజేస్తూ ముద్దు రాములు పోరాటస్ఫూర్తిని నాయకులు గుర్తు చేసుకున్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు
మద్దిలేటి (మానవ హక్కుల కార్యకర్త.)
పాలెం వెంకటయ్య
మాలల ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షులు.
డి. హెచ్. జి పోలప్ప
అంబేద్కర్ యువజన సంఘం మాజీ అధ్యక్షులు.
జీర్గల్ నాగేష్ మాదిగ
దళిత ఉద్యమ నాయకులు.
లింగన్న. కే ఎన్ పి ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు.
మహమ్మద్ అఫ్రోజ్
ఎన్ ఎస్ యూ ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షులు
ఆనంద్ బండారి
బి.ఆర్ ఎస్ పార్టీ నాయకులు
బ్యాగరి సురేష్
యూత్.కాంగ్రెస్ ఉపాధ్యక్షులు.
బండారి కథలప్ప,
బండారి శివ,
మాల మహానాడు నాయకులు.
అక్షయ్ కుమార్,బండారి మహాదేవ్, అరవింద్, ఉదయ్ , క్రాంతి మరియు తదితరులు పాల్గొనడం జరిగింది.

# మక్తల్ ఎంపీడీవో కార్యాలయంలో కల్యాణలక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**త్రైనెట్ న్యూస్, అక్టోబర్ 05:**



స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో రాష్ట్ర మంత్రివర్యులు డా. వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి వాకిటి మానస హనుమంతు గారు, స్థానిక తహసీల్దార్ ఈ. సతీష్ కుమార్ గారు ఎంపీడీఓ గారు పాల్గొని తమ చేతుల మీదుగా వివిధ గ్రామాలకు చెందిన 72 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని అన్నారు. ఆడపిల్లల వివాహానికి ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం పేద కుటుంబాలకు ఎంతో అండగా నిలుస్తోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కట్టా సురేష్ కుమార్ గుప్తా, ఏఎంసీ వైస్ చైర్మన్ బి. గణేష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, గుడిగెళ్ల సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఏఎంసీ డైరెక్టర్లు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
మంగళవారం అక్టోబర్ 06, 2026
www.trinetnews.com

# వరుస నష్టాలకు బ్రేక్.. రాణించిన సూచీలు





దేశీయ మార్కెట్ సూచీలు సోమవారం రాణించాయి. క్రూడాయిల్ ధరలు, బాండ్ రాబడులు పెరగడం వంటి కారణాలతో గడిచిన నాలుగు ట్రేడింగ్ సెషన్లలో వరుస నష్టాలు చవిచూసిన సూచీలు.. నేడు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయంగా చమురు ధరలు కాస్త చల్లారడం, ఫెడ్ వడ్డీ రేట్ల పెంపుపై అంచనాలు కాస్త తగ్గుముఖం పట్టడం మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచింది. సెన్సెక్స్ ఉదయం 72,340.95 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 71,909.70) లాభాల్లో ప్రారంభమైంది. రోజులో చాలా వరకు లాభాల్లోనే కదలాడిన సూచీ ఓ దశలో 700 పాయింట్లకు పైగా ఎగబాకింది. చివరికి 472.77 పాయింట్లు లాభపడి 72,382.47 వద్ద ముగిసింది. నిఫ్టీ 133.80 పాయింట్లు పెరిగి 22,555.75 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 96.29గా ఉంది.

సెన్సెక్స్ -30లో ఐటీసీ, ఎటర్నల్, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్, అదానీ పోర్ట్స్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. హెచ్‌సీఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, సన్‌ఫార్మా, ఇన్ఫోసిస్, ఏషియన్ పెయింట్స్, ట్రెంట్ షేర్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 102.43 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,157.47 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# భారత్-అమెరికా ట్రేడ్ డీల్‌కు పీటముడి: నిర్మలా సీతారామన్



భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం ఇంకా ఖరారు కాలేదు. ఇరు పక్షాల మధ్య పలు దఫాలుగా చర్చలు జరిగినా అవి కొలిక్కి రాలేదు. ఈ పరిణామాల వేళ.. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ వాణిజ్య చర్చలు ఇక స్తంభించిపోయినట్లుగా కన్పిస్తున్నాయని అన్నారు. ఈ డీల్ తో ఇరుదేశాలు మరిన్ని రాయితీలు పొందడం దాదాపు అసాధ్యంలాగే ఉందన్నారు. దిల్లీలో జరిగిన ఓ బిజినెస్ లీడర్స్ సదస్సులో పాల్గొన్న నిర్మలా సీతారామన్.. ఈ అంశాన్ని ప్రస్తావించారు. "ట్రేడ్ డీల్ కోసం ఇంకా సంప్రదింపులు జరుగుతున్నప్పటికీ.. ఇరుపక్షాల మధ్య పీటముడి పడినట్లుగా అనిపిస్తోంది. చర్చల పురోగతి నిలిచిపోయే స్థితికి పరిస్థితులు చేరుకున్నట్లుగా ఉన్నాయి. ఇక, ఈ దశ దాటి.. ఎ ం ద ను ం ం రాయితీలు ఇవ్వడం, తీసుకోవడం చాలా కష్టమైన పని. అయితే, ఇరుపక్షాలూ అందుబాటులో ఉన్న అవకాశాలను పరిశీలిస్తే.. చర్చలు ముందుకెళ్లేందుకు ఆస్కారం ఉండొచ్చని భావిస్తున్నా" అని నిర్మలా సీతారామన్ వెల్లడించారు.

అమెరికాకు ఆయుధంలా టారిఫ్‌లు..

భారత్‌తో వాణిజ్య లోటును పూడ్చుకునేందుకు అమెరికా ప్రయత్నిస్తోందని ఆర్థిక మంత్రి ఈ సందర్భంగా అన్నారు. అయితే, దాన్ని సంప్రదాయ చర్చలతో పరిష్కరించుకోకుండా.. టారిఫ్‌లను ఆయుధంలా వాడుకుంటోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈ ఏడాది ఆరంభంలో జరిగిన భారత్-ఈయూ వాణిజ్య ఒప్పందాన్ని ఆమె ప్రస్తావించారు. అది ఒక విజయవంతమైన డీల్ అని అన్నారు. దాని వల్ల భారత్‌లోని సూక్ష్మ, చిన్న మధ్యతరగతి పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు.

మార్కెట్లపై ప్రభావం..

భారత్-అమెరికా ట్రేడ్ డీల్‌పై నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యలతో భారత స్టాక్ మార్కెట్లు ఊగిసలాడాయి. సెన్సెక్స్ ఇంట్రాడే గరిష్ఠ స్థాయి నుంచి ఒక్కసారి 450 పాయింట్లకు పైగా పతనమైంది. ప్రస్తుతం 11.30 గంటల సమయంలో సెన్సెక్స్ 323 పాయింట్ల లాభంతో 72,232 వద్ద, నిఫ్టీ 86 పాయింట్లు పెరిగి 22,507 వద్ద కొనసాగుతున్నాయి. ఈ ఉదయం ఆరంభంలో సెన్సెక్స్ ఒక దశలో 750 పాయింట్లకు పైగా లాభంతో ట్రేడ్ అయ్యింది.

# ఈ మూడు అంశాలు దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకం: టాటా సన్స్ ఛైర్మన్



ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి నెలకొన్నప్పటికీ, భారత ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ (చీ జఙ్టుఅంతీఖంవఝతీఖఅ) అన్నారు. దీర్ఘకాలిక స్థిరమైన వృద్ధికి ఇంధనం భద్రత, తయారీ రంగంలో ఉద్యోగాలు, మానవ వనరులపై పెట్టుబడులే అత్యంత కీలకమని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

'వికసిత్ భారత్ -2047 విజన్ దేశంలోని పలు రంగాలకు విస్తరించింది. ఆయా రంగాల్లో స్థిరమైన అభివృద్ధికి ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు అవసరం. సకాలంలో ఇంధన లభ్యత, తయారీ రంగంలో ఉద్యోగాల సృష్టి, ప్రజలకు అవసరమైన వనరుల్లో పెట్టుబడులు.. ఈ మూడు దేశ ఆర్థిక రంగానికి కీలకం. ఏడేళ్లుగా భారత ఆర్థిక వ్యవస్థ మరింతగా పుంజుకుంటోంది. వృద్ధి అంచనాలను అధిగమిస్తోంది. స్థిరమైన వృద్ధికి డొమెస్టిక్ డిమాండ్ బలంగా ఉండడం, సేవా రంగాల్లో ఎగుమతులు పెరగడం, ప్రభుత్వాల నుంచి అనుకూలమైన విధానాలు.. ఇవన్నీ కారణమే" అని ఆయన అభిప్రాయపడ్డారు. ఆటోమొబైల్ రంగంతో పాటు క్రెడిట్, విద్యుత్, సిమెంట్ రంగాలు కూడా ఆర్థిక నిర్మాణంలో కీలకంగా మారయన్నారు.

తయారీ రంగంలో నాణ్యతతో పాటు ఆవిష్కరణలు, ఉత్పాదకతపైనా దృష్టి సారించాల్సిన అవసరముందని చంద్రశేఖరన్ అభిప్రాయపడ్డారు. దీంతో పెద్ద కంపెనీలే కాకుండా మధ్యతరహా పరిశ్రమలు సైతం పుంజుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు, టాటా గ్రూపులో వివాదం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. టాటా సన్స్ ఛైర్మన్‌గా మరో ఐదేళ్ల పాటు చంద్రశేఖరన్ కొనసాగాలని టాటా సన్స్ బోర్డ్ ఆమోదం తెలపగా.. ఆ నియామకం చెల్లుబాటు కాదని టాటా ట్రస్ట్ వాదిస్తోంది.

# ఏఐ ప్రయాణించే మార్గం సరైనది కాదు: ఓపెన్ ఏఐ సేఫ్టీ సిస్టమ్ అధిపతి రాజీనామా

వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఏఐ (ూ×) సాంకేతికతను నియంత్రించకుండా వదిలేస్తే.. అది మానవాళి మనుగడకే ముప్పుగా పరిణమిస్తుందని పలువురు టెక్ అధినేతలు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏఐ అభివృద్ధికి కృషి చేసిన పలువురు కీలక సంస్థల నిపుణులు పదవుల నుంచి వైదొలుగుతున్నారు. ఈ జాబితాలో తాజాగా ఓపెన్ ఏఐసేఫ్టీ సిస్టమ్ అధిపతి డేవిడ్ రాబిన్సన్ చేరారు. ప్రస్తుతం ఏఐ ప్రయాణిస్తోన్న మార్గం సరైనది కాదని ఆరోపిస్తూ తన పదవికి రాజీనామా చేశారు.

"ప్రస్తుతం ఏఐ ప్రయాణిస్తోన్న మార్గం ఆమోదయోగ్యం కాదని భావించిన OpenAI లోని మాజీ సహోద్యోగులు, పరిశ్రమలోని ఇతర అధికారుల వరుసలో ఇప్పుడు నేను కూడా చేరుతున్నాను. ఏఐ (ూ×) భవిష్యత్తు.. దానిని నిర్మించే కంపెనీలపై ఆధారపడి ఉంది. ఆ విషయంలో కంపెనీలు తగిన జాగ్రత్తలు తీసుకోవడం లేదు. ప్రమాదకరమైన టెక్నాలజీని ఎలా ఎదుర్కోవాలనే వివేకం వాటికి ఉండట్లేదు. ఇందు కోసం కొంత వినయం అవసరం. అయితే.. మితిమీరిన ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లే వ్యక్తులకు సహజంగా వివేకం ఉండదు. ఏఐ భద్రత పట్ల మరింత లోతుగా విశ్లేషించాల్సిన అవసరం ఉంది.

సమస్యలు వచ్చిన తర్వాత రక్షణ చర్యలను మెరుగుపరచడానికి ప్రయత్నాలు చేపట్టడం సరైన చర్య కాదు. ఇటీవల పలు ఏఐ ఏజెంట్లు అదుపు తప్పి ప్రవర్తించాయి. 'హగ్గింగ్ సేఫ్' డేటాను హ్యాక్ చేసిన సమయంలో ఓపెన్ ఏఐ పొరపాటున ఏఐ ఏజెంట్ల సమూహాన్ని బయటకు వదిలింది. దీంతో శిక్షణలో ఉన్న మోడల్ ఇంటర్నెట్ యాక్సెస్ పరిమితులను దాటింది. కాబట్టి మానవుల కంటే ఎక్కువ సామర్థ్యం గల వ్యవస్థలను నిర్మించడానికి ఇది సరైన సమయం కాదు. ఏఐలో విపరీతమైన పురోగతి వల్ల భవిష్యత్తులో తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంది" అని డేవిడ్ రాబిన్సన్ పేర్కొన్నారు. 2023లో ఓపెన్ ఏఐ (ాజూవఅూ×)లో చేరిన డేవిడ్ మొదట పాలసీ ప్లానింగ్ హెడ్‌గా.. ఆ తర్వాత దాని సేఫ్టీ సిస్టమ్స్ బృందంలో కీలక అధికారిగా ఎదిగారు.



# చాక్లెట్ స్టార్ పవన్ హీరోగా 'పోతిరెడ్డిపల్లి' మూవీ ప్రారంభం





మూవీ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథులుగా మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య, మాజీ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి, రాజ్యసభ ఎంపీ ఆర్. కృష్ణయ్య, బాబుమోహన్, తదితరులు.

రామానాయుడు స్టూడియోస్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభోత్సవం

హైదరాబాద్: చాక్లెట్ స్టార్ పవన్ హీరోగా, మౌనిక, సిరి హీరోయిన్లు నటిస్తున్న నూతన హారర్ థ్రిల్లర్ చిత్రం 'పోతిరెడ్డిపల్లి' హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోస్‌లో ఘనంగా ప్రారంభమైంది. ఆరాధ్య క్రియేషన్స్ బ్యానర్‌పై జేరమ్ విష్ణు నిర్మిస్తున్న ఈ చిత్రానికి అశోక్ రోయ్య దర్శకత్వం వహిస్తున్నారు.

అక్టోబర్ 5న ఉదయం 9 గంటలకు నిర్వహించిన ఈ చిత్ర పూజా కార్యక్రమానికి అతిథులుగా మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య, సీనియర్ నటుడు బాబుమోహన్ ముఖ్య అతిథులుగా హాజరై చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు సినీ ప్రముఖులు, చిత్ర యూనిట్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చిత్రం తొలి షాట్‌కు సీనియర్ నటుడు బాబు మోహన్ హీరో, హీరోయిన్లపై క్లాప్ కొట్టగా, ప్రముఖ దర్శకుడు, కొరియోగ్రాఫర్ 'అమ్మ రాజశేఖర్' కెమెరా స్విచ్ ఆన్ చేశారు. తెలుగు మూవీ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీఎన్ ఆదిత్య తొలి షాట్‌కు దర్శకత్వం వహించారు. దర్శకుడు వి. సముద్ర, ఓయూ శంకర్ గుండేటి ఈ వేడుకలో పాల్గొని చిత్రబృందానికి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా హీరో చాక్లెట్ స్టార్ పవన్ మాట్లాడుతూ, కథకు అనుగుణంగా ఆసక్తికరమైన హారర్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతోందని తెలిపారు. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించేలా చిత్రాన్ని రూపొందిస్తున్నామని చెప్పారు.

దర్శకుడు అశోక్ రోయ్య మాట్లాడుతూ, "ఇది నా రెండో సినిమా. ఈ చిత్రాన్ని మరింత వైవిధ్యంగా తెరకెక్కించేందుకు ప్రయత్నిస్తున్నాను. సినీ ప్రముఖులు, ప్రేక్షకుల ఆశీర్వాదాలు, ఆదరణ మాకు ఉండాలని కోరుకుంటున్నాను" అన్నారు.

దర్శకుడు అమ్మ రాజశేఖర్, హీరోయిన్ తదితరులు చిత్ర విశేషాలను వెల్లడిస్తూ చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

గ్రామీణ నేపథ్యంలో రుగ్మతలు, మిస్టరీ, హారర్, సస్పెన్స్ అంశాలను మేళవిస్తూ ఈ కథను రూపొందిస్తున్నట్లు చిత్రబృందం తెలిపింది. కథలోని మలుపులు, పాత్రల స్వభావం ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేసేలా ఉంటాయని పేర్కొంది. మరిన్ని వివరాలను త్వరలోనే చిత్రబృందం వెల్లడించనుంది.

చిత్ర వివరాలు

నటీనటులు: చాక్లెట్ స్టార్ పవన్ (హీరో), మౌనిక, సిరి (హీరోయిన్లు), ఇరుముడి ఫేం సాయి స్వరూప్, సునీతా మనోహర్, ఆనంద్, బలగం రమేష్, సూర్య తేజవత్, రామలింగం, అరుణ్ అఖిల్, శేఖర్, తను, మనీష్, తదితరులు.

బ్యానర్: ఆరాధ్య క్రియేషన్స్

సమర్పణ: త్రిపుర మీడియా, ఆరాధ్య క్రియేషన్స్

నిర్మాత – జేరమ్ విష్ణు

దర్శకత్వం – అశోక్ రోయ్య

సంగీతం -- ర్యాప్ రాక్ షకీల్

ఎడిటింగ్ -- ఉద్ధవ్,

పబ్లిసిటీ డిజైన్స్ -- ఉదయ్ జాల

పీఆర్ఓ – అశోక్ దయ్యాల

# వెంకటేశ్, త్రివిక్రమ్ 'ఆదర్శ కుటుంబం' విడుదల వాయిదా




అగ్ర కథానాయకుడు వెంకటేశ్ అభిమానులకు నిరాశ. ఆయన కీలక పాత్రలో త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందిన తాజా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం - హౌస్ నెం.47' విడుదల వాయిదా పడింది. నిర్మాత నాగవంశీ ఈ విషయాన్ని వెల్లడించారు. తొలుత అనుకున్న తేదీ ప్రకారం అక్టోబరు 9న ఈ మూవీని విడుదల చేయాలని చిత్ర బృందం భావించింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఇంకా పూర్తికాకపోవడం వల్ల సినిమా విడుదల వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలోనే కొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని తెలిపారు.

**అందుకు క్షమించండి..**

"ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులకు తగిన సమయం లేదు. ఇలాగే విడుదల చేస్తే, మేము కూడా మీతో కలిసి నేరుగా శుక్రవారం థియేటర్‌లో సినిమా చూడాల్సి వస్తుంది. అక్టోబరు 9న మేము రావడం లేదని ముందే చెప్పి ఉంటే, వేరే సినిమాలైనా వచ్చి ఉండేవి. అలాగే ఈ నిర్ణయంతో వెంకటేశ్‌గారి అభిమానులు నిరాశ పడతారు. అందుకు క్షమించమని అడుగుతున్నా. ప్రస్తుత పరిస్థితుల్లో ట్రైలర్ కట్ చేసే సమయం కూడా లేదు. సినిమా విడుదలకు నాలుగు రోజుల ముందు వాయిదా వేయడం సబబు కాదు. ఇంకా రెండు సెట్ సాంగ్స్, ట్రైలర్ విడుదల చేయాల్సి ఉంది. ఇప్పుడు సమయం దొరికింది కాబట్టి, అన్నీ చక్కగా విడుదల చేస్తాం"

**విడుదల తేదీపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు..**

"కొత్త విడుదల తేదీపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుతం వెంకటేశ్‌గారు విదేశాల్లో ఉన్నారు. ఆయన వచ్చాక మాట్లాడి విడుదల తేదీపై తుది నిర్ణయం తీసుకుంటాం. ప్రస్తుతం సోషల్‌మీడియా ట్రోల్స్ చూస్తుంటే భయంగా ఉంది. అలాంటి వాటికి అవకాశమివ్వకూడదనే ఆలస్యమైనా క్వాలిటీ ప్రొడక్ట్ ఇవ్వాలనే ఉద్దేశంతో సినిమా వాయిదా వేశాం. కాపీ అంతా చూసుకున్న తర్వాతే, విడుదల తేదీ ప్రకటిస్తాం. 'ఆదర్శ కుటుంబం' కాస్త ఆలస్యంగా వచ్చినా..వెంకటేశ్ గారి అభిమానులంతా నూటికి నూరు శాతం సంతృప్తి చెందేలా సినిమా ఉంటుంది." అని నాగవంశీ చెప్పారు. ఈ సినిమాలో వెంకటేశ్‌తో పాటు శ్రీనిధి శెట్టి, నారా రోహిత్, నివేదా పేతురాజ్, రావు రమేష్, సత్య, బ్రహ్మాజీ, వెన్నెల కిషోర్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే 'నారాయణమ్మ' శ్రోతలను ఎంతగానో ఆకట్టుకుంటోంది.

# డీప్‌ఫేక్ వీడియోలు.. ఆ ఖాతాల వివరాలు 'మా' సేకరిస్తోంది: మంచు విష్ణు

ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారిన 'డీప్‌ఫేక్' ఘటనపై 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీన్ని కేవలం ఒక ఘటనగా కాకుండా.. భవిష్యత్తులో ఎదురుకానున్న ప్రమాదాలకు ఒక హెచ్చరికగా చూడాలన్నారు. ఈ సందర్భంగా సినిమాల విడుదలకు ముందు ఉద్దేశపూర్వకంగా నెగెటివ్ ప్రచారం చేసే వారి గురించి కూడా ఆయన మాట్లాడారు.డీప్‌ఫేక్ వీడియోలపై రామ్ పోతినేని చెప్పిన మాటలను విష్ణు ప్రస్తావించారు. ఆన్‌లైన్ ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేయాలన్న రామ్ మాటలపై చర్చ జరగాలన్నారు. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను ఎప్పటికీ గౌరవించాల్సిందేనని.. కానీ, అదే అదునుగా తీసుకొని అజ్ఞాతంగా ఉంటూ ఇతరులను వేధించడానికి ఎవరికీ హక్కులేదన్నారు. ఒక వీడియోను తొలగించడం లేదా ఫిర్యాదు చేయడం ద్వారా సమస్య పూర్తిగా పరిష్కారం కాదని పేర్కొన్నారు. తెలుగు ఫిల్మ్ ఛాంబర్, ప్రొడ్యూసర్స్ కౌన్సిల్, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్‌తో పాటు పరిశ్రమలోని అన్ని వర్గాలు కలిసి.. ఏఐ డీప్‌ఫేక్‌లు, ఉద్దేశపూర్వకంగా ఆన్‌లైన్‌లో సినిమాలను దెబ్బతీసే ప్రయత్నాలను ఎదుర్కోవాలని.. దీని కోసం శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు."కొంతకాలంగా సినిమాలు, నటులు, దర్శకులను లక్ష్యంగా చేసుకుని పరిశ్రమలోనే కొందరు నెగెటివిటీని సృష్టిస్తున్నారు. సినిమా జయాపజయాలు ప్రేక్షకుల నిర్ణయంపై ఆధారపడి ఉండాలి. విమర్శలు, రివ్యూలు, ట్రోలింగ్.. ఇవన్నీ సినిమా ప్రపంచంలో సహజమే. కానీ, ప్రేక్షకులు సినిమా చూడకముందే.. దాన్ని దెబ్బతీయాలని చూడడం ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు" అని విష్ణు వ్యాఖ్యానించారు. 'ది ప్యారడైజ్' చిత్ర బృందం కూడా విడుదలకు ముందే ఇలాంటి వాటి నుంచి రక్షణ కోరుతూ కోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని ఆయన గుర్తుచేశారు. ఒక సినిమా విజయం లేదా వైఫల్యం.. మొత్తం టాలీవుడ్ పరిశ్రమను నిర్వచించదన్నారు. పరిశ్రమ అందరిదనీ.. ఎంతమంది వచ్చినా.. ఇక్కడ ఎవరి స్థానం వారికి పదిలంగా ఉంటుందని చెప్పారు.మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తాను ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుంటున్నట్లు విష్ణు తెలిపారు. నటుల ఫొటోలను దుర్వినియోగం చేస్తూ వారిపై అసభ్యకరమైన కంటెంట్ చేసే వారిని, ప్రజలను తప్పుదోవ పట్టించే ఖాతాల వివరాలను 'మా' (మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) సేకరిస్తోందని వెల్లడించారు. "ప్రతి శుక్రవారం మనం పోటీ పడొచ్చు. కానీ మిగిలిన వారమంతా ఒకరినొకరు నాశనం చేసుకునేందుకు ప్రయత్నించకూడదు. సినిమాను గెలవనివ్వండి"

# "ఎస్ ఆర్ కళ్యాణమండపం" డైరెక్టర్ శ్రీధర్ గాదె, శ్రీ ఐశ్వర్య లక్ష్మీ మూవీస్ బ్యానర్ ప్రొడక్షన్ నెం.3 సినిమా నుంచి టాలెంటెడ్ యాక్ట్రెస్ పూజిత పొన్నాడ బర్త్ డే స్పెషల్ పోస్టర్ రిలీజ్

ఈ చిత్రంలో నర్తకి పాత్రలో ప్రేక్షకుల్ని ఆకట్టుకోనున్న పూజిత పొన్నాడ "ఎస్ఆర్ కళ్యాణమండపం" చిత్రంతో అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరించి దర్శకుడిగా ప్రతిభ చాటుకున్న డైరెక్టర్ శ్రీధర్ గాదె మరో కొత్త చిత్రాన్ని రూపొందిస్తున్నారు. శ్రీ ఐశ్వర్య లక్ష్మీ మూవీస్ బ్యానర్ పై ఆది సాయి కుమార్ తో చుట్టాలబ్బాయ్ వంటి ఫ్యామిలీ మూవీ, ఆనంద్ దేవరకొండతో "హైవే" వంటి యూనిక్ థ్రిల్లర్ మూవీని నిర్మించిన ప్రొడ్యూసర్ వెంకట్ తలారి తమ ప్రొడక్షన్ నెం.3గా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో "కమిటీ కుర్రోళ్లు" మూవీ ఫేమ్ ఈశ్వర్ రాచి రాజు హీరోగా నటిస్తుండగా, నందు, లిఖిత హీరోయిన్స్ గా నటిస్తున్నారు. పూజిత పొన్నాడ, సింధు కాసారం ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా శరవేగంగా రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటోంది.

ఈ చిత్రంలో నర్తకి క్యారెక్టర్ లో టాలెంటెడ్ యాక్ట్రెస్ పూజిత పొన్నాడ నటిస్తున్నారు. ఈ రోజు పూజిత పొన్నాడ బర్త్ డే సందర్భంగా ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ నర్తకి క్యారెక్టర్ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. రాజభవనంలో నర్తకిమణిగా ముస్తాబైన పూజిత పొన్నాడ లుక్ ఆకట్టుకుంటోంది. నటిగా ఆమెకు ఈ సినిమా మంచి గుర్తింపు తీసుకొస్తుందనే అంచనాలు ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ తో ఏర్పడుతున్నాయి.

విలేజ్ బ్యాక్ డ్రాప్ లో సాగే హారర్ చిత్రమిది. ఈ సినిమాను సరికొత్త కథా కథనాలతో ప్రేక్షకులను ఆకట్టుకునేలా దర్శకుడు శ్రీధర్ గాదె తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర వివరాలను మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు.

నటీనటులు – ఈశ్వర్ రాచి రాజు, నందు, లిఖిత, పూజిత పొన్నాడ,



సింధు కాసారం, సురేష్ గురు, రాయల్ శ్రీ, మట్టా శివకుమార్, విహా దీకొండ, సునీత మనోహర్, అమ్మ రామచంద్రయ్య, తదితరులు

# 'JAILER 2' ట్రైలర్ విడుదల



ముత్తువేల్ పాండియన్‌గా సూపర్‌స్టార్ రజనీకాంత్ రిటర్న్.. మరింత భారీగా, మరింత వైల్డ్‌గా 'జైలర్ 2' యాక్షన్ స్పెక్టాకిల్!

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సూపర్‌స్టార్ రజనీకాంత్ 'జైలర్ 2' ట్రైలర్ విడుదలైంది. తెలుగులోనూ విడుదలైన ఈ ట్రైలర్ హై-వోల్టేజ్ యాక్షన్, రజనీకాంత్ స్టైల్, కామెడీ, యాటిట్యూడ్‌తో ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచుతోంది. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ తనదైన క్విర్కీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో 'జైలర్' ప్రపంచాన్ని మరింత పెద్దదిగా, మరింత ఆసక్తికరంగా తీర్చిదిద్దినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది.

'జైలర్'లో ప్రేక్షకులను ఎంతగానో అలరించిన ఐకానిక్ క్యారెక్టర్ ముత్తువేల్ పాండియన్‌గా సూపర్‌స్టార్ రజనీకాంత్ మరోసారి తనదైన స్టైల్, మాస్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో మెప్పించనున్నారు. సీక్వెల్‌లో మరింత పెద్ద సంఘర్షణ, భారీ స్థాయి సవాళ్లు, విస్తృతమైన ప్రపంచాన్ని ట్రైలర్ పరిచయం చేస్తోంది. అదే సమయంలో 'జైలర్'ను బ్లాక్‌బస్టర్‌గా నిలబెట్టిన హ్యూమర్, మ్యాడ్‌నెస్, ఎంటర్‌టైన్‌మెంట్‌ను కూడా కొనసాగిస్తూ 'జైలర్ 2'పై మరింత ఆసక్తిని పెంచుతోంది.

సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో పాటు ఎస్.జె. సూర్య, విద్యా బాలన్, శివరాజ్‌కుమార్, మోహన్‌లాల్, రమ్యకృష్ణ, యోగిబాబు, సూరజ్ వెంజారమూడు, మిర్నా తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. పవర్‌ఫుల్ యాక్షన్, వినోదం, గుర్తుండిపోయే పాత్రలతో 'జైలర్ 2' ఒక భారీ ఎంటర్‌టైనింగ్ యాక్షన్ స్పెక్టాకిల్‌గా రూపొందుతోంది.

ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, విజయ్ కార్తీక్ కన్నన్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. ఆర్. నిర్మల్ ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో 'జైలర్ 2'ను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ తెలుగులో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. సూపర్‌స్టార్ రజనీకాంత్ అన్‌మ్యాచ్డ్ స్క్రీన్ ప్రెజెన్స్, నెల్సన్ దిలీప్‌కుమార్ ప్రత్యేకమైన ఎంటర్‌టైన్‌మెంట్, 'జైలర్' యూనివర్స్‌ను మరింత విస్తరించిన విధానం ఈ సినిమాపై అంచనాలను మరింత పెంచుతున్నాయి.

అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్!

# నన్ను ప్రజలే స్టార్‌ని చేశారు.. రాజకీయాల దిశగా మరో హీరో!



విజయ్ సీఎం అయిన తర్వాత.. తమిళనాడు రాజకీయాల్లోకి వచ్చేందుకు పలువురు సినీ నటులు ఆసక్తి చూపిస్తున్నారు. తాజాగా ఈ జాబితాలోకి శివకార్తికేయన్ చేరారు. తన అభిమానులతో సమావేశమయ్యారు. ఆదివారం చెన్నైలోని పోరూర్‌లో నిర్వహించిన ఈ సమావేశానికి సుమారు 3 వేల మంది అభిమానులు, ఫ్యాన్స్ అసోసియేషన్ నిర్వాహకులు హాజరయ్యారు."నేను పీపుల్ మేడ్ స్టార్‌ని. మీ వల్లే ఈ స్థాయికి వచ్చాను. ఏ రంగంలోనైనా మన లక్ష్యంపై క్లారిటీ ఉండాలి. విమర్శించే వాళ్లు ఎప్పుడూ విమర్శిస్తూనే ఉంటారు. వారిని పట్టించుకోకుండా మనందరం ప్రేమతో కలిసి ఉండాలి" అని అభిమానులకు శివకార్తికేయన్ సూచించారు. ఇక ఈ సమావేశానికి హాజరైన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. "బాగా చదవండి. బాగా సంపాదించండి. కుటుంబానికే మొదటి ప్రాధాన్యత ఇవ్వండి. మనం ఎంత ఎక్కువ చదివితే.. మన ఆలోచనా విధానం అంత మెరుగవుతుంది. దీని వల్ల సోషల్ మీడియాకూ దూరంగా ఉండొచ్చు" అని అన్నారు. ప్రస్తుతం తమిళనాట హీరోలు నిర్వహిస్తోన్న ఫ్యాన్ మీట్‌లు ఆసక్తికరంగా మారాయి. ఇటీవల హీరో ధనుష్ , విశాల్ కూడా అభిమానులతో సమావేశమయ్యారు. ప్రజాసేవలో భాగం కావాలని వారు పిలుపునిచ్చారు. ఇక మరోవైపు తాను రాజకీయాల్లోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రముఖ కొరియోగ్రాఫర్, దర్శక నటుడు రాఘవ లారెన్స్ ఇప్పటికే ప్రకటించారు.



# ఈ అలవాట్లు దంతాల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయట!

**'నోటి శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం' అంటున్నారు వైద్యులు. మరి, ఇది సాధ్యం కావాలంటే దంతాలు, చిగుళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. అయితే ఈ క్రమంలో మనం పాటించే కొన్ని అలవాట్లు దంతాల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయంటున్నారు నిపుణులు. మరి, అవేమిటో తెలుసుకుందాం రండి..**

### ఒక్క నిమిషం సరిపోదట!

మరీ ఎక్కువసేపు బ్రష్ చేయకూడదన్న విషయం తెలిసిందే! అలాగని మరీ తక్కువ సమయం కూడా బ్రషింగ్‌కి సరిపోదంటున్నారు నిపుణులు. కనీసం రెండు నిమిషాలైనా దీనికి కేటాయించి.. ఈ వ్యవధిలో దంతాలు, చిగుళ్లు, పళ్ల వెనక భాగాన్ని శుభ్రం చేసుకోవడం తప్పనిసరి అంటున్నారు. అలాగే ఈ క్రమంలో డెంటల్ ఫ్లాస్ ప్రక్రియను పాటించడం మర్చిపోకూడదు. దీనివల్ల పళ్ల మధ్యలో ఇరుక్కున్న పదార్థాల అవశేషాలు తొలగిపోయి పాచి పేరుకుపోకుండా జాగ్రత్తపడచ్చు అంటున్నారు నిపుణులు.

### నాలుక సంగతేంటి?

కొంతమంది బ్రషింగ్ బాగానే చేస్తారు.. కానీ నాలుక సంగతి మర్చిపోతుంటారు.. ఏదో అలా పైపైన శుభ్రం చేసుకుంటుంటారు. అయితే నాలుకను సరిగ్గా శుభ్రం చేసుకోవడం కూడా బ్రషింగ్‌లో ఓ ముఖ్య భాగం అంటున్నారు నిపుణులు. లేదంటే దానిపై బ్యాక్టీరియా పేరుకుపోయి నోటి దుర్వాసనకు కారణమవుతుందని చెబుతున్నారు.

### చల్లటి పదార్థాలు వద్దు!

కొంతమందికి చల్లటి పదార్థాలు నోట్లో వేసుకోగానే పళ్లు జివ్వుమంటాయి.. మరికొందరికి ఏమీ అనిపించదు. కానీ ఈ అలవాటు దంత ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందంటున్నారు నిపుణులు. దీనివల్ల దంతాలపై ఉన్న ఎనామిల్‌పై కనిపించని పగుళ్లు ఏర్పడి.. క్రమంగా అది దంతాల డ్యామేజ్‌కి కారణమవుతుందంటున్నారు. కాబట్టి మరీ చల్లటి పదార్థాలు తీసుకోకపోవడమే మంచిదని చెబుతున్నారు.

### విరామం లేకుండా..!

కొంతమందికి చిరుతిండ్లు అధికంగా తినే అలవాటుంటుంది. ఈ క్రమంలో ఎప్పుడు చూసినా ఏదో ఒకటి నములుతూనే ఉంటారు. ఇలా విరామం లేకుండా తినడం వల్ల ఆయా పదార్థాల్లోని ఆమ్లత్వాన్ని నోట్లోని లాలాజలం తటస్థీకరించలేకపోతుందట! దీనివల్ల దంతక్షయం వచ్చే ప్రమాదం ఉంటుందంటున్నారు నిపుణులు. కాబట్టి గ్యాప్ లేకుండా తినే అలవాటును మానుకోమంటున్నారు. అలాగే దంతాల ఆరోగ్యాన్ని పెంచే ఆహారం తీసుకోమని సలహా ఇస్తున్నారు. ఇందులోనూ ముఖ్యంగా ఫైబర్ అధికంగా ఉండే పండ్లు, కాయగూరలు, పాలు-పాల పదార్థాలు, ప్రొటీన్లు ఎక్కువగా ఉండే పదార్థాలు.. వంటివి రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం ముఖ్యమంటున్నారు.

### ఆ వెంటనే బ్రష్ చేస్తున్నారా?

ఆమ్ల గుణాలతో కూడిన కొన్ని రకాల పండ్లు, పానీయాలు, వంటకాలు.. మొదలైన వాటిని (నిమ్మ, ద్రాక్ష, కమలా.. మొదలైనవి) తీసుకున్న వెంటనే బ్రష్ చేస్తుంటారు కొందరు. దీనివల్ల పళ్లపై ఉన్న ఎనామిల్ తొలగిపోతుందంటున్నారు నిపుణులు. ఎందుకంటే ఆమ్లత్వం ఎనామిల్‌ని బలహీనపరుస్తుందట! కాబట్టి ఈ పదార్థాలు తిన్న వెంటనే కాకుండా.. ఓ అరగంట ఆగి బ్రష్ చేసుకోవడం మంచిదని చెబుతున్నారు. అలాగే పళ్లు తోముకునేటప్పుడు కూడా బలంగా కాకుండా.. నెమ్మదిగా, మృదువైన బ్రిజిల్స్ ఉన్న బ్రష్‌ని ఉపయోగించడం మేలంటున్నారు.

ఈ అలవాట్లు పాటించడంతో పాటు దంతాలు, చిగుళ్లు, నోటి ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలేవైనా ఎదురైతే మాత్రం ఆలస్యం చేయకుండా డాక్టర్‌ని సంప్రదించడం తప్పనిసరి అని గుర్తుంచుకోవాలి. తద్వారా సమస్య తీవ్రం కాకముందే నయం చేసుకోవచ్చు అని సూచిస్తున్నారు.





# మొండితనం కాదు... నిద్రలేమి!

నాలుగేళ్ల అన్విత సాయంత్రమైతే చాలు..చిన్న చిన్న విషయాలకే బాగా విసిగిస్తుంది. బొమ్మలను విసిరేస్తుంది.

రెండో తరగతి చదివే రిత్విక్ స్కూలుకి వెళ్లడానికే కాదు... తిరిగొచ్చాక కూడా ఊరికే అరుస్తాడు.

వీళ్లిద్దరి తల్లిదండ్రులూ మొదట తమ పిల్లలది మొండితనమే అనుకున్నారు. నిపుణుల దగ్గరకు తీసుకెళ్తే నిశితంగా గమనించి వాళ్లకి తగినంత నిద్ర లేదన్నారు. అది మొదలు కనీసం 10 గంటలు పడుకునేలా జాగ్రత్తలు తీసుకోవడం ఆరంభించారు. ఇప్పుడు మార్పు కనిపిస్తోంది.

చిన్నారులు తమకు నిద్ర సరిపోవడం లేదని స్పష్టంగా చెప్పలేరు. కానీ వాళ్లు నడుచుకునే తీరు ద్వారా ఆ విషయాన్ని మనం గుర్తించవచ్చు.

చిన్న విషయాలకే ఓపిక కోల్పోవడం, విపరీతమైన కోపం.

అలసటతో నిద్రపోవడానికి బదులు హైపర్ యాక్టివ్‌గా మారడం.

ఉదయం లేవడానికి కష్టపడటం, లేచాక చాలా సమయం బద్ధకంగా ఉండటం.

ఆటలు, చదువు... దేనిమీదా దృష్టి సారించలేకపోవడం..

రోగనిరోధక శక్తి తగ్గి, తరచూ జలుబు, జ్వరం, ఇతర ఇన్ఫెక్షన్ల బారిన పడటం... వంటివి చాలానే ఉన్నాయి.

హాయిగా నిద్రపోవాలంటే...

నిద్రకు నిర్దిష్ట సమయాన్ని కేటాయించండి. పడు కునే ముందు గోరువెచ్చని నీటితో స్నానం చేయించండి. వేడి పాలు తాగించడం, కథలు చెప్పడం వంటి పనుల ద్వారా చిన్నారులను నిద్రకు సిద్ధం చేయవచ్చు.

నిద్రపోవడానికి కనీసం గంట ముందు టీవీ, మొబైల్, ట్యాబ్ వంటివి వాడనివ్వొద్దు. తెర వెలుగు మెదడును మేల్కొల్పి ఉంచుతుంది.

పడుకునే గది ప్రశాంతంగా, చీకటిగా ఉండేలా చూసుకోండి.

పిల్లలు నిద్రపోనప్పుడు కోప్పడకుండా, వారి పక్కన పడుకుని ఓదార్పునివ్వడం, తల నిమురుతూ కథలు చెప్పడం, పాటలు పాడటం వంటివి చేయండి. ఇవన్నీ వాళ్లకి అభద్రతను దూరం చేస్తాయి. సులువుగా నిద్రపోతారు.

పిల్లల వయసును బట్టి నిద్ర అవసరాలు మారుతాయి కనీసం 10-12 గంటల పాటు హాయిగా నిద్రపోయేలా చూడండి. ఆటపాటల్లో చురుగ్గా, ఆరోగ్యంగా ఉండగలుగుతారు.

# ఉమ్మడి ఆరోగ్యం.. ఈతరం అమ్మాయిలు ఎంచుకుంటున్న మార్గం

ఇప్పుడు చాలామంది అమ్మాయిలు ఇంటి నుంచి పనిచేయటానికే మొగ్గు చూపిస్తున్నారు. వ్యాయామం చేయటానికీ ఇంట్లోనే పరికరాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. షాపింగ్ అంటే... అదీ ఆన్‌లైన్లోనే. దాంతో అడుగు బయటపెట్టే అవకాశమే లేకుండా పోతోంది. దొరికిన కాస్త విరామ సమయమూ ఫోన్‌లోనే గడిపేస్తున్నారు. ఫలితం... తెలియని అలసట. మరేదో కోల్పోతున్నామన్న బాధ. వీటన్నింటి నుంచి బయటపడటానికి ఈతరం అమ్మాయిలు ఎంచుకుంటున్న మార్గం ఏంటో తెలుసా? సోషల్ ఫిట్‌నెస్..! దీనిలో శారీరక శ్రమతోపాటు సామాజిక బంధాలు కూడా ముఖ్యం. ఒంటరిగా ఇంట్లో ఉంటూ, అయిష్టంగా వ్యాయామాలు పూర్తిచేసేకన్నా నలుగురితో కలిసి శరీరానికి శ్రమ కలిగించే పనులు చేయడం మేలనుకుంటున్నారు. దీనివల్ల మానసిక భద్రత అందుతుంది. అందుకే... బృందంగా ఆడే పికిల్‌బాల్, పాడెల్ వంటి క్రీడల్ని ఎంచుకుంటున్నారట. అనేక గర్ల్ వాక్ కమ్యూనిటీలు, వారాంతపు గ్రూప్ హైకింగ్‌లు, రన్ టు బ్రంచ్ క్లబ్‌లు కూడా ఈ ఆలోచన నుంచి వచ్చినవే. వీటి ఉద్దేశం వేగంగా నడవటమో, ఇంకేదో కాదు. ఒకరికొకరు మాట్లాడుకోవటం. నడక తరవాత కాసేపు హాయిగా టీనో, కాఫీనో తాగటం. పరిచయాలు పెంచుకోవటం. కొత్త స్నేహితులను ఏర్పరచుకోవటం. ఇలా చేయటం వల్ల మనలో ఎండార్ఫిన్లు విడుదలవుతాయట. సంతోషంగా ఉంటాం. ఆరోగ్యం, ఆనందం రెండూ సొంతమవుతాయి. మంచి అనుభవాలుగా ఎప్పుడూ మనతో ఉండిపోతాయి. నచ్చిందా మరి... మీరూ ప్రయత్నించండి.



# ఇలాంటప్పుడు కావాలో బ్రేక్!

నిద్ర లేచింది మొదలు రాత్రి పడుకునే దాకా ఎన్నో పనులతో సతమతమవుతాం.. ఇటు ఇంటి పనులు, అటు ఆఫీస్ బాధ్యతలతో అలుపు లేకుండా పనిచేస్తాం.. మరి, ఎప్పుడూ ఇలా చేయడం వీలవుతుందా? అంటే.. కానే కాదు. ఎందుకంటే నిరంతరాయంగా ఇలా పనిచేయడం వల్ల ఒకానొక దశలో తీవ్రమైన ఒత్తిడికి లోనవుతుంటాం. 'ఇక నా వల్ల కాదు' అన్న ఆలోచనలూ వస్తుంటాయి. ఇదిగో ఇలాంటి సమయంలోనే విరామం అవసరం అంటున్నారు నిపుణులు. కొన్ని లక్షణాల ద్వారా ఈ సంకేతాల్ని శరీరం బహిర్గతం చేస్తుందట! అవేంటో తెలుసుకొని జాగ్రత్తపడితే శరీరాన్ని తిరిగి రీఛార్జ్ చేసుకోవచ్చంటున్నారు నిపుణులు.



### ఇట్స్ బ్రేక్ టైమ్!

శరీరం, మనసు అలసిపోయాయనడానికి తొలి సంకేతం తలనొప్పి. అయితే కొంతమంది మాత్రలతో నొప్పి తగ్గించుకోవాలనుకుంటారు. కానీ ఇది తాత్కాలికమే. మాత్ర ప్రభావం తగ్గాక మళ్లీ పరిస్థితి మొదటికొస్తుంది. ఇలా పదే పదే తలనొప్పి వేధిస్తున్నట్లయితే పని నుంచి విరామం తీసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు.

చురుకుదనంతోనే పనిపై ఏకాగ్రత పెట్టగలుగుతాం. అది లోపిస్తే మెదడు మొద్దుబారుతుంది. ఇలాంటి సమయంలో ఏ పని చేస్తున్నామో అర్థం కాదు.. జ్ఞాపకశక్తీ తగ్గిపోతుంది. పనితీరు, ఉత్పాదకత దెబ్బతింటాయి. అందుకే ఏకాగ్రత లోపించినప్పుడు విరామం తీసుకోవడమే మేలంటున్నారు నిపుణులు.

రోజంతా పనిచేయడం వల్ల అలసట, నీరసం.. ఆవహిస్తాయి. అయితే రాత్రి పడుకున్నప్పుడు శరీరం, మనసు పునరుత్తేజితమై మరుసటి రోజుకు ఈ లక్షణాలు దూరమవుతాయి.. కానీ కొంతమందిలో రాత్రంతా నిద్ర పోయినా.. మరునాడు రోజంతా అలసటగా అనిపిస్తుంటుంది. ఇలాంటప్పుడు కొన్ని రోజులు ఆయా పనుల నుంచి విరామం తీసుకోవడం మంచిది.

ఒక్కోసారి 'అబ్బా.. ఇవాళ ఆఫీస్‌కి వెళ్లాలా? తప్పదా? రోజంతా ఎలా పనిచేయాలి?' అన్న అసహనం ఆవహిస్తుంది. నిజానికి మానసిక స్థితి ఇలా ఉన్నప్పుడు పని చేయలేం. అందుకే ఇలా అనిపించినప్పుడు బ్రేక్ తీసుకోవాల్సిందే అంటున్నారు నిపుణులు.

జీర్ణ వ్యవస్థ కూడా మనం అలసిపోయామన్న సంకేతాల్ని పంపిస్తుందంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో తరచూ మలబద్ధకం, విరేచనాలు, కడుపునొప్పి.. వంటి అనారోగ్యాల బారిన పడుతున్నట్లయితే విరామం తీసుకోవాల్సిందేనట.

కొన్నిసార్లు నచ్చినా నచ్చకపోయినా కెరీర్‌ని కొనసాగించాల్సి రావచ్చు.. అలాగే వర్క్-లైఫ్ బ్యాలన్స్ చేసుకోలేక మరికొందరు ఇబ్బంది పడుతుంటారు. ఇలాంటప్పుడు ఒక రకమైన అసహనం ఆవహిస్తుంది. చిన్న చిన్న విషయాలకే బాధపడిపోతుంటాం. జీవితంపై ప్రతికూల ప్రభావం చూపే ఈ పరిస్థితిని దూరం చేసుకోవాలంటే.. విరామం తప్పనిసరి అంటున్నారు నిపుణులు.

మన ఆహారపుటలవాట్లు కూడా.. మనకు బ్రేక్ అవసరమన్న విషయాన్ని తెలియజేస్తాయట. ఈ క్రమంలో తక్కువ తిన్నా, ఎక్కువ తిన్నా, అసలు తినాలనిపించకపోయినా, స్నాక్స్ వంటి అనారోగ్యకరమైన ఆహారం పైకి మనసు మళ్లినా.. సందేహించాల్సిందే అంటున్నారు నిపుణులు.

సాధారణంగా మనకు నచ్చిన పనులు చేసేటప్పుడు ఒక రకమైన ఉత్సాహం వస్తుంది. కానీ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంటే మాత్రం అన్నీ పక్కన పెట్టి బ్రేక్ తీసుకోవడానికి సిద్ధపడమంటున్నారు నిపుణులు.

### రీఛార్జ్ అవ్వండి!

శారీరకంగా, మానసికంగా కనిపించే ఈ లక్షణాలన్నీ మనం చేసే పనిని, ఉత్పాదకతను దెబ్బతీయడంతో పాటు అనుబంధాల పైనా ప్రతికూల ప్రభావం చూపుతాయంటున్నారు నిపుణులు. అందుకే వీటి నుంచి బయటపడేదాకా విరామం తీసుకోవడం మంచిదంటున్నారు. అది రోజులా, వారాలా, నెలలా అనేది మీ లక్షణాల్ని బట్టి వైద్యులు నిర్ధరిస్తారు. ఇలా విరామం తీసుకున్న ఈ సమయాన్ని మీకు నచ్చిన అభిరుచులపై దృష్టి పెట్టేందుకు వినియోగించుకోవచ్చు.. అలాగే కెరీర్ బిజీలో పడి మీరు పక్కన పెట్టేసిన అంశాల పైనా దృష్టి పెట్టచ్చు.. నచ్చితే గార్డెనింగ్ చేయచ్చు.. ఇష్టమైన సంగీతం వినడం, వ్యాయామం, ధ్యానం, పుస్తక పఠనం, కుటుంబ సభ్యులు-స్నేహితులతో సమయం గడపడం, వెకేషన్.. ఇవన్నీ శరీరాన్ని, మనసును పునరుత్తేజితం చేసేవే. ఇలా రీఛార్జ్ అయితే వ్యక్తిగత పనుల్లో అయినా, కెరీర్‌లో అయినా కొత్త ఉత్సాహంతో దూసుకుపోవచ్చు.. ఏమంటారు?

# గాంధీ జయంతి సందర్భంగా ఐఐసీఏ మూడో సీఎస్ఆర్ దినోత్సవం7

**సీఎస్ఆర్‌కు భారతీయ సంప్రదాయం, ట్రస్టీషిప్ భావనే పునాది: ఐఐసీఏ డీజీ, సీఈఓ జ్ఞానేశ్వర్ కుమార్ సింగ్**

**అక్టోబర్ 6, 7 తేదీల్లో న్యూఢిల్లీలో జాతీయ సీఎస్ఆర్ సదస్సు**



**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 5:**
కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ (ఐఐసీఏ) మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని మూడో సీఎస్ఆర్ దినోత్సవాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా ఐఐసీఏ డైరెక్టర్ జనరల్, సీఈఓ జ్ఞానేశ్వర్ కుమార్ సింగ్ ఐఐసీఏ సర్టిఫైడ్ సీఎస్ఆర్ ప్రొఫెషనల్ ప్రోగ్రామ్ 11వ బ్యాచ్ సభ్యులను ఉద్దేశించి ప్రత్యేక ప్రసంగం చేశారు. ఐఐసీఏ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్ ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమం, మూడో జాతీయ కార్పొరేట్ సామాజిక బాధ్యత సదస్సు, ప్రదర్శన (ఎన్‌సీసీఎస్ఆర్ 2026)కు ముందస్తు కార్యక్రమంగానూ నిలిచింది. 2019లో జాతీయ సీఎస్ఆర్ అవార్డుల కార్యక్రమంలో అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అక్టోబర్ 2వ తేదీని కార్పొరేట్ సామాజిక బాధ్యతకు అంకితం చేయాలని సూచించారు. మహాత్మా గాంధీ ప్రతిపాదించిన ట్రస్టీషిప్ తత్వం ఆధారంగా నిర్వహించే ఐఐసీఏ సీఎస్ఆర్ దినోత్సవం, దేశంలో మారుతున్న సీఎస్ఆర్ వ్యవస్థపై చర్చ, గుర్తింపు, సహకారం, విజ్ఞాన భాగస్వామ్యానికి వేదికగా నిలుస్తోంది. ఐఐసీఏ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్ అధిపతి, కోర్సు డైరెక్టర్ డాక్టర్ గరిమా దధీచ్ మాట్లాడుతూ, బాధ్యతను సమర్థవంతమైన ఫలితంగా మార్చగల శిక్షణ పొందిన నిపుణులు సీఎస్ఆర్ రంగానికి మరింత అవసరమని అన్నారు. ఈ లక్ష్యంతోనే శిక్షణ కార్యక్రమాన్ని జాతీయ సదస్సుతో అనుసంధానించినట్లు తెలిపారు. ఎన్‌సీసీఎస్ఆర్ 2026కు దేశవ్యాప్తంగా 550 మందికి పైగా ప్రతినిధులు హాజరుకానున్నారని వెల్లడించారు. జ్ఞానేశ్వర్ కుమార్ సింగ్ మాట్లాడుతూ, అక్టోబర్ 2వ తేదీకి, సీఎస్ఆర్‌కు తాత్విక సంబంధం ఉందన్నారు. "భారతదేశంలో సీఎస్ఆర్‌కు భారతీయ సంప్రదాయం, ట్రస్టీషిప్ భావన పునాది. ఇది కేవలం కంపెనీల చట్టం వల్ల ఏర్పడింది కాదు" అని పేర్కొన్నారు. కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 166(2)ను ప్రస్తావిస్తూ, ఒక సంస్థ సమాజంలో భాగంగా పనిచేస్తుందని, వాటాదారులకే కాకుండా ఉద్యోగులు, సమాజం, పర్యావరణం పట్ల కూడా బాధ్యత వహించాలని చట్టం గుర్తించిందన్నారు. సీఎస్ఆర్ వ్యవస్థ పరిణామాన్ని వివరిస్తూ, తప్పనిసరి చేసిన తొలి ఏడాది సుమారు రూ. 10,000 కోట్లుగా ఉన్న సీఎస్ఆర్ వ్యయం 2023--24 ఆర్థిక సంవత్సరానికి దాదాపు రూ. 35,000 కోట్లకు చేరిందని తెలిపారు. తొలినాళ్లలోని "నిబంధనలు పాటించండి లేదా కారణం వివరించండి" విధానం నుంచి, 2019 సవరణలు, 2021 నిబంధనల వరకు వ్యవస్థ అభివృద్ధి చెందిందన్నారు. వినియోగించని సీఎస్ఆర్ నిధుల ఖాతా, బహుళ సంవత్సరాల ప్రాజెక్టులు, నిధుల వినియోగ ధ్రువీకరణ, ప్రభావ అంచనా వంటి అంశాలు ఈ మార్పుల్లో భాగమయ్యాయని వివరించారు. ప్రభుత్వ వ్యయానికి అదనంగా నిధులు సమకూర్చే విధానంగా మాత్రమే సీఎస్ఆర్‌ను చూడకూడదని ఆయన అన్నారు. సామాజిక రంగంలో కొత్త విధానాలను పరీక్షించడంతో పాటు, కార్పొరేట్ వనరులు, సాంకేతికత, నైపుణ్యాన్ని వినియోగించి విస్తృత ప్రభావం సృష్టించడమే సీఎస్ఆర్ లక్ష్యమని చెప్పారు. సీఎస్ఆర్ ప్రాజెక్టుల్లో చాలావరకు అవసరాల ఆధారంగా కాకుండా, సంస్థలకు పరిచయమున్న రంగాలు, ప్రాంతాలు, అమలు సంస్థల ఆధారంగా ఎంపికవుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. సమాజ భాగస్వామ్యంతో అవసరాలను గుర్తించే సీఎస్ఆర్, అవసరాల అంచనా మరియు సామాజిక ప్రభావ అంచనాకు ప్రామాణిక విధానం, అమలు సంస్థల సామర్థ్యవృద్ధి అవసరమని సూచించారు. జిల్లాల యంత్రాంగం, సంస్థలు, సమాజాలు తమ అవసరాలను నమోదు చేసి కంపెనీల దృష్టికి తీసుకెళ్లేందుకు కేంద్ర మంత్రిత్వ శాఖ సీఎస్ఆర్ ఎక్స్ఛేంజ్ పోర్టల్ ఉపయోగపడుతుందని తెలిపారు. అధిక ప్రభావం కలిగించే జాతీయ ప్రాజెక్టుల కోసం ఒకే రంగంలోని కంపెనీలు నిధులను సమీకరించి కలసి పనిచేయాలని కూడా సూచించారు.

వికసిత్ భారత్ లక్ష్యాన్ని కేవలం ఆర్థిక వ్యవస్థ పరిమాణంతోనే కొలవలేమని సింగ్ అన్నారు. "వికసిత్ భారత్‌కు అభివృద్ధి చెందిన ఆలోచనా విధానం, సామాజిక స్పృహ కూడా అవసరం" అని పేర్కొన్నారు. ఖర్చు చేయడం నుంచి సమాజాన్ని మార్చే దిశగా, నిబంధనల పాటింపు నుంచి నిబద్ధత వైపు, నివేదికల నుంచి ఆధారాల వైపు, విడివిడిగా చేపట్టే కార్యక్రమాల నుంచి సహకారం వైపు మారాలని పిలుపునిచ్చారు. సాంకేతికత ఆధారిత పర్యవేక్షణతో ఈ మార్పులకు బలం చేకూర్చాలని, సీఎస్ఆర్ తత్వానికి ప్రతినిధులుగా నిలవాలని కార్యక్రమంలో పాల్గొన్నవారిని కోరారు. ఎన్‌సీసీఎస్ఆర్ 2026 అక్టోబర్ 6, 7 తేదీల్లో న్యూఢిల్లీలోని ది అశోక్ హోటల్‌లో జరగనుంది. "వికసిత్ భారత్ కోసం సీఎస్ఆర్ స్ఫూర్తికి పునఃరూపకల్పన: నిబంధనల పాటింపు నుంచి నిబద్ధత వైపు" అనే ఇతివృత్తంతో ఐఐసీఏ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్ ఈ సదస్సును నిర్వహిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కార్పొరేట్ రంగం, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేట్ ఫౌండేషన్లు, అమలు సంస్థలు, ఐక్యరాజ్యసమితి సంస్థలు, విద్యాసంస్థల ప్రతినిధులు ఇందులో పాల్గొననున్నారు. రెండు రోజుల పాటు ఐదు ఉన్నతస్థాయి చర్చా వేదికలు, ఒక ఫైర్‌సైడ్ చాట్ నిర్వహించనున్నారు. సదస్సుతో పాటు జాతీయ సీఎస్ఆర్ ప్రదర్శన కూడా జరగనుంది. వికసిత్ భారత్ ఏ 2047 లక్ష్యానికి అనుగుణంగా నాలుగు ఇతివృత్తాలపై 30 నుంచి 40 స్టాళ్లు ఏర్పాటు చేయనున్నారు. యువ (విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి), గరీబ్ (ఆకాంక్షిత జిల్లాలు, గిరిజనులు, అణగారిన వర్గాలు), అన్నదాత (వ్యవసాయం, గ్రామీణ జీవనోపాధి), నారీశక్తి అంశాలు ప్రదర్శనలో చోటు చేసుకోనున్నాయి.

# పోలవరం జల విద్యుత్ కేంద్రంలో కీలక ముందడుగు

**తొలి యూనిట్‌లో స్టాటర్ ఏర్పాటు ప్రారంభం**

**రోటర్ బిగింపు పనులకూ శ్రీకారంలి**

**పుష్కరాల నాటికి ఆరు యూనిట్లు సిద్ధం చేయడమే లక్ష్యం**



**అమరావతి, ట్రైనెట్ న్యూస్**
అక్టోబర్ 5: పోలవరం జల విద్యుత్ కేంద్రం నిర్మాణ పనుల్లో మరో కీలక ముందడుగు పడింది. తొలి యూనిట్‌లో స్టాటర్ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించారు. ఏపీ జెన్‌కో (హైడల్) విభాగం డైరెక్టర్ సుజయ్‌కుమార్, నిర్మాణ సంస్థ మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎం ఈ ఐ ఎల్ ) చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీష్ బాబు అంగర , జనరల్ మేనేజర్ ప్రసేన్‌జిత్ మజుందార్, ఏపీ జెన్‌కో సీఈలు రవీంద్రరెడ్డి, విశ్వేశ్వరరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొని పనుల పురోగతిని పరిశీలించారు. విద్యుత్ ఉత్పత్తి వ్యవస్థలో అత్యంత కీలకమైన స్టాటర్ ఏర్పాటు ప్రారంభం కావడం ద్వారా తొలి యూనిట్ విద్యుత్ ఉత్పత్తికి మరింత చేరువైనట్లయింది. ఇదే సమయంలో రోటర్ బిగింపు పనులు కూడా ప్రారంభమయ్యాయి. పోలవరం జల విద్యుత్ కేంద్రంలో మొత్తం 12 యూనిట్లు నిర్మిస్తున్నారు. ఒక్కో యూనిట్ ద్వారా 80 మెగావాట్ల చొప్పున, మొత్తం 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయనున్నారు. ప్రాజెక్టులో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ పనులను సమాంతరంగా చేపడుతూ పనులను వేగవంతం చేస్తున్నారు.

### టర్బైన్‌కు స్టాటర్ కీలకం

జల విద్యుత్ కేంద్రంలో నీటి ప్రవాహంతో టర్బైన్ తిరిగినప్పుడు దానికి అనుసంధానమైన రోటర్ తిరుగుతుంది. రోటర్ చుట్టూ ఉండే స్థిర భాగమే స్టాటర్. రోటర్ తిరుగుతున్న సమయంలో స్టాటర్‌లో ఏర్పడే అయస్కాంత క్షేత్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. అందువల్ల జనరేటర్‌లో స్టాటర్ అత్యంత కీలకమైన భాగం. స్టాటర్ ఏర్పాటు పూర్తవడం యూనిట్ ఎలక్ట్రో-మెకానికల్ పనుల్లో ఒక ముఖ్యమైన దశగా అధికారులు పేర్కొన్నారు.

స్టాటర్‌లో విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన కాయిల్స్, కోర్ వంటి కీలక భాగాలు ఉంటాయి. రోటర్--స్టాటర్ మధ్య అత్యంత కచ్చితమైన సమన్వయం ఉండేలా వీటి ఏర్పాటు చేస్తారు. యంత్ర సామర్థ్యం, విద్యుత్ ఉత్పత్తి స్థిరత్వం, దీర్ఘకాలిక పనితీరులో స్టాటర్ కీలకం.

### లక్ష్యానికి అనుగుణంగా పనులు

పుష్కరాల ప్రారంభం నాటికి తొలి ఆరు యూనిట్లను సిద్ధం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. దీనికి అనుగుణంగా నిర్మాణ సంస్థ ఎం ఈ ఐ ఎల్ , జెన్‌కో అధికారులు సమన్వయంతో పనులను వేగవంతం చేస్తున్నారు. సివిల్ నిర్మాణ పనులతో పాటు టర్బైన్, జనరేటర్, ఇతర ఎలక్ట్రో-మెకానికల్ పరికరాల ఏర్పాటు పనులను దశలవారీగా చేపడుతున్నారు.

ఈ సందర్భంగా ఏపీ జెన్‌కో హైడల్ విభాగం డైరెక్టర్ సుజయ్‌కుమార్ మాట్లాడుతూ.. పోలవరం జల విద్యుత్ కేంద్రం రాష్ట్ర విద్యుత్ అవసరాలకు ఎంతో ప్రాధాన్యమైన ప్రాజెక్టు అని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పనులను పూర్తి చేసేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి యూనిట్ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యమిస్తూ, నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ముందుకు సాగాలని అన్నారు. స్టాటర్, రోటర్ వంటి కీలక పరికరాల ఏర్పాటు సమయంలో అత్యంత కచ్చితత్వం అవసరమని, ఇంజినీరింగ్ ప్రమాణాలను పాటిస్తూ పనులు చేపట్టాలని సూచించారు. యూనిట్ల పనులు ఒక్కొక్క దశను దాటుతున్న కొద్దీ విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం మరింత చేరువవుతుందని తెలిపారు. ఆరు యూనిట్లను నిర్దేశిత సమయానికి అందుబాటులోకి తీసుకురావడమే ప్రస్తుత ప్రధాన లక్ష్యమని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రాజెక్ట్ ను అనుకున్న సమయానికి ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేయాలని కృత నిశ్చయంతో ఉన్నారని అన్నారు.

### సమన్వయంతో పనులు..

పోలవరం విద్యుత్ కేంద్రం నిర్మాణ సంస్థ ఎంఈఐఎల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీష్‌బాబు అంగర మాట్లాడుతూ.. ప్రాజెక్టులో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ విభాగాల పనులను సమాంతరంగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కీలకమైన ఎలక్ట్రో-మెకానికల్ పరికరాల ఏర్పాటు పనులను నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా చేపడుతున్నామని చెప్పారు.

తొలి యూనిట్‌లో స్టాటర్ ఏర్పాటు, రోటర్ బిగింపు పనులు ప్రారంభం కావడం ప్రాజెక్టు పురోగతిలో ముఖ్యమైన మైలురాయి అని పేర్కొన్నారు. పనుల వేగాన్ని పెంచడంతో పాటు ప్రతి దశలో నాణ్యత, భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఆరు యూనిట్లను లక్ష్య సమయానికి సిద్ధం చేసేందుకు అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగిస్తూ ఇంజినీరింగ్ బృందాలు నిరంతరం పనిచేస్తున్నాయని చెప్పారు.

### 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి

పోలవరం జల విద్యుత్ కేంద్రంలోని 12 యూనిట్లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే మొత్తం 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కానుంది. జల విద్యుత్ కావడంతో ఇంధన వ్యయ భారం లేకుండా నీటి ప్రవాహాన్ని విద్యుత్ ఉత్పత్తికి వినియోగించుకునే అవకాశం ఉంటుంది. రాష్ట్ర విద్యుత్ వ్యవస్థలో పీక్ డిమాండ్ సమయంలో ఈ కేంద్రం ఉత్పత్తి చేసే విద్యుత్ కీలకంగా ఉపయోగపడనుంది. ప్రస్తుతం తొలి యూనిట్‌లో స్టాటర్, రోటర్ పనులు ప్రారంభం కావడంతో మిగిలిన యూనిట్లలోనూ సంబంధిత పనులను వేగవంతం చేస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా పనులు పూర్తిచేసేందుకు జెన్‌కో, ఎంఈఐఎల్ అధికారులు సమన్వయంతో ముందుకు సాగుతున్నారు.

# తప్పుడు పత్రాలు సమర్పిస్తే కఠిన చర్యలు




**-తెలంగాణ సీఈవో సుదర్శన్ రెడ్డి**

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 5:**
తెలంగాణ ఓటర్ల జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా పలు చోట్ల ఫారమ్-7 పత్రాలు పెద్ద ఎత్తున వెలుగులోకి వస్తుండటం రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. ప్రధానంగా ఇటీవల గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ముషీరాబాద్, బహదూర్పుర నియోజకవర్గంలోని ప్రీ ప్రింటెడ్ దరఖాస్తులకు సంబంధించిన వీడియోలో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. ఈ అంశంపై రాష్ట్ర ఎన్నికల సంఘం ఇవాళ స్పందించింది. ఓటర్ల నమోదు, సవరణల ప్రక్రియలో తప్పుడు సమాచారంతో నకిలీ దరఖాస్తులు సమర్పించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి.. జీహెచ్ఎంసీ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు.

రాష్ట్రంలో ప్రస్తుతం ఎస్ఐఆర్ ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. ఈ క్రమంలో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారుల వద్దకు భారీ సంఖ్యలో ఓట్ల తొలగింపునకు సంబంధించి ఫారమ్-7 బల్క్ దరఖాస్తులు వస్తున్నాయని, అందులో అనేకంగా నకిలీవిగా వస్తున్నాయని సీఈవో కార్యాలయం దృష్టికి వచ్చింది. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన సీఈఓ.. ఓటర్ల జాబితాలో పేర్ల మార్పులు, చేర్పులు లేదా తొలగింపుల కోసం ఫారమ్-6, 66, 7, 8 ద్వారా ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం లేదా తప్పుడు డిక్లరేషన్ ఇచ్చే అభ్యర్థులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫారం-7లపై నిబంధనల ప్రకారం ముందస్తు విచారణ జరిపిన తర్వాతే చర్యలు చేపట్టాలని సూచించారు.

# స్వాతంత్ర్యం తర్వాత తొలిసారి బోగీబీల్ నుంచి బంగ్లాదేశ్‌కు అంతర్జాతీయ సరుకు రవాణా



**దిబ్రుగఢ్/న్యూఢిల్లీ, అక్టోబర్ 5, ట్రైనెట్ న్యూస్:**
అస్సాంలోని దిబ్రుగఢ్ జిల్లా బోగీబీల్ టెర్మినల్ నుంచి బంగ్లాదేశ్ రాజధాని ఢాకాకు 540 మెట్రిక్ టన్నుల మెథనాల్‌తో బయలుదేరిన బార్జ్‌ను కేంద్ర ఓడరేవులు, నౌకాయాన, జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. 'డీఎల్‌బీ పట్కాయ్' నౌకను 'కుషల్ కన్వర్' టగ్ లాగింది. అస్సాం ముఖ్యమంత్రి డాక్టర్ హిమంత బిశ్వ శర్మ వర్చువల్‌గా కార్యక్రమంలో పాల్గొన్నారు. 1947లో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎగువ అస్సాం నుంచి విదేశీ ఓడరేవుకు సరుకు రవాణా కావడం ఇదే తొలిసారి. దిబ్రుగఢ్ నదీ రేవు మూతపడిన దాదాపు 70 ఏళ్ల తర్వాత ఈ ప్రయాణం తిరిగి ప్రారంభమైంది. నామ్‌రూప్‌లో ప్రభుత్వ రంగ సంస్థ అస్సాం పెట్రోకెమికల్స్ లిమిటెడ్ (ఏపీసీఎల్) ఉత్పత్తి చేసిన మెథనాల్‌ను ఢాకాలోని పాంగావ్ పోర్టుకు తరలిస్తున్నారు. బ్రహ్మపుత్ర నదిపై జాతీయ జలమార్గం--2లో సుమారు 768 కిలోమీటర్లు ప్రయాణించి భారత్--బంగ్లాదేశ్ సరిహద్దుకు చేరుకున్నాక, ఇండో--బంగ్లాదేశ్ ప్రోటోకాల్ మార్గం మీదుగా నౌక ముందుకు సాగుతుంది. బోగీబీల్ నుంచి ఢాకా సమీపంలోని నారాయణ్‌గంజ్ వరకు మొత్తం 1,300 కిలోమీటర్లు ప్రయాణించనుంది. ఈ ప్రయాణం ద్వారా ఈశాన్య భారతాన్ని అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానించే వాణిజ్య సరుకు రవాణా మార్గంగా బ్రహ్మపుత్రను అభివృద్ధి చేయగలమా అన్నది పరీక్షించనున్నారు. బంగ్లాదేశ్‌కు మెథనాల్ రవాణాను క్రమం తప్పకుండా చేపట్టాలని యోచిస్తున్నారు. బోగీబీల్, ధుబ్రిలలో ఇటీవల కస్టమ్స్, ఇమిగ్రేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో ఈ రవాణా సాధ్యమైంది. "మా తాతముత్తాతలు దిబ్రుగఢ్ ఘాట్‌లో స్టీమర్ విజిల్ శబ్దం వింటూ పెరిగారు. 70 ఏళ్లుగా ఆ శబ్దం ఆగిపోయింది; నౌకల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ రోజు దిబ్రుగఢ్ నుంచి ప్రపంచానికి మరోసారి నౌక బయలుదేరింది. నది ఎప్పుడూ మనల్ని నిరాశపరచలేదు. దశాబ్దాలుగా దాన్ని పునరుద్ధరించాలనే సంకల్పమే కొరవడింది" అని సోనోవాల్ అన్నారు. ఇది అస్సాంకు గర్వకారణమైన రోజని ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ అన్నారు. "నామ్‌రూప్‌లో తయారైన అస్సాం ఉత్పత్తి, అస్సాం నదిపైనే అంతర్జాతీయ మార్కెట్‌కు చేరుతోంది. ఈశాన్య ప్రాంతం ఇక సరిహద్దు ప్రాంతం కాదు; తూర్పు దేశాలకు భారత్ ప్రవేశద్వారం" అని పేర్కొన్నారు. "ఇది తొలి ప్రయాణం మాత్రమే, చివరిది కాదు. అస్సాం యువతకు నేను చెప్పేది ఒక్కటే---ఈ నదితో కలిసి కలలు కనండి. ప్రపంచం ఇక దూరంలో లేదు; నదీ ప్రవాహం దిగువన ఉంది" అని సోనోవాల్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో "భారత టీ రాజధాని"గా పేరొందిన దిబ్రుగఢ్ తన పూర్వపు నదీ రేవు వైభవాన్ని తిరిగి పొందుతోందన్నారు. చారిత్రక వారసత్వాన్ని గౌరవిస్తూ ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. "1956లో మూగబోయిన స్టీమర్ విజిల్ మళ్లీ వినిపిస్తోంది" అని వ్యాఖ్యానించారు. తూర్పు భారతదేశంలోని రద్దీగా ఉండే నదీ రేవుల్లో ఒకటిగా దిబ్రుగఢ్‌కు గతంలో పేరుండేది. 1856 నాటికే అప్పటి కలకత్తా నుంచి ప్రభుత్వ స్టీమర్లు దిబ్రుగఢ్‌కు చేరేవి. 1882లో దిబ్రుగఢ్ స్టీమర్ ఘాట్ నుంచి దిబ్రూ--సాదియా రైల్వే సేవలు ప్రారంభమయ్యాయి. 1913 నాటికి బ్రహ్మపుత్రపై రోజూ స్టీమర్లు రాకపోకలు సాగిస్తూ టీ, కలపతో పాటు ప్రయాణికులను కూడా తరలించేవి. 1947 దేశ విభజనతో ఆ మార్గం తెగిపోయింది. అస్సాం సరుకులు కలకత్తాకు చేరేందుకు తూర్పు పాకిస్థాన్ మీదుగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. 1950 భూకంపం దిబ్రుగఢ్ వద్ద నదీగర్భాన్ని మార్చింది. 1954లో దిబ్రుగఢ్ ఘాట్ నుంచి సాధారణ సరుకు బుకింగ్‌లు నిలిచిపోయాయి. టీ రవాణా రైల్వేకు మారడంతో 1956 అక్టోబర్ 15న ఘాట్‌ను మూసివేశారు. 1965 భారత్--పాకిస్థాన్ యుద్ధం సరిహద్దు నదీ వాణిజ్యాన్ని నిలిపివేసింది. 1972లో భారత్, బంగ్లాదేశ్ నదీ వాణిజ్య ప్రోటోకాల్‌పై సంతకాలు చేశాయి. 1988లో సాదియా నుంచి ధుబ్రి వరకు బ్రహ్మపుత్రలోని 891 కిలోమీటర్ల మేరను జాతీయ జలమార్గం--2గా ప్రకటించారు. అయితే ఈ మార్గంలో సాధారణ సరుకు రవాణా 2017 డిసెంబర్‌లోనే ప్రారంభమైంది; ఆ సమయంలో పాండు నుంచి ధుబ్రికి సిమెంట్ తరలించారు. "దశాబ్దాల పాటు దిబ్రుగఢ్ వైభవం మసకబారింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో నగరానికి దాని సముచిత స్థానాన్ని తిరిగి కల్పించేందుకు కృషి ప్రారంభించాం. బోగీబీల్ టెర్మినల్, కస్టమ్స్, ఇమిగ్రేషన్ కేంద్రాలు, 'జలవాహక్' పథకం కింద నిర్ణీత షెడ్యూల్‌తో నడిచే సరుకు సేవలు ఈ చారిత్రక పట్టణానికి ఆధునిక సదుపాయాలు, ప్రపంచస్థాయి మౌలిక వసతులు అందిస్తున్నాయి. ఈ రోజు దిబ్రుగఢ్ నుంచి మరోసారి విదేశీ రేవుకు సరుకు బయలుదేరడంతో, పట్టణ గత వైభవం--భవిష్యత్తు ఆశలు ఒకే నదిపై కలుసుకున్నాయి" అని సోనోవాల్ అన్నారు. ఇటీవలి సంవత్సరాల్లో ఈ మార్గంలో కార్యకలాపాలు పెరిగాయి. 2022 ఫిబ్రవరిలో టాటా స్టీల్ బార్జ్‌లు బంగ్లాదేశ్ మీదుగా పాండుకు చేరాయి. 2023లో 'ఎంవీ గంగా విలాస్' నౌక వారణాసి నుంచి బంగ్లాదేశ్ మీదుగా దిబ్రుగఢ్ వరకు ప్రయాణించింది. బోగీబీల్ ప్రయాణికులు, సరుకు రవాణా టెర్మినల్‌కు 2023 జూలైలో శంకుస్థాపన చేయగా, 2024 ఫిబ్రవరిలో ప్రారంభించారు. 'జలవాహక్' సరుకు రవాణా ప్రోత్సాహక పథకం 2024 డిసెంబర్‌లో ప్రారంభమైంది. కేంద్ర ఓడరేవులు, నౌకాయాన, జలమార్గాల శాఖ గణాంకాల ప్రకారం, జాతీయ జలమార్గాలపై సరుకు రవాణా 2013--14 ఆర్థిక సంవత్సరంలో 1.8 కోట్ల మెట్రిక్ టన్నుల నుంచి 2025--26లో 21.8 కోట్ల మెట్రిక్ టన్నులకు పెరిగింది. జాతీయ జలమార్గం--2 అభివృద్ధి, పాండులో నౌక మరమ్మతు కేంద్రం, పాండు పోర్టుకు చివరి మైలు అనుసంధానం సహా ఈశాన్య ప్రాంత జలమార్గాల కోసం రూ. 6,800 కోట్లకు పైగా పెట్టుబడులు పెడుతున్నారు. "నదీ మార్గంలో తరలించే ప్రతి టన్ను సరుకు ఇంధన వినియోగాన్ని, హైవేలపై ట్రక్కుల సంఖ్యను తగ్గిస్తుంది" అని సోనోవాల్ అన్నారు. ప్రాంతీయ జలమార్గాల అనుసంధానం కోసం బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్, మయన్మార్‌లతో భారత్ కలిసి పనిచేస్తోందని తెలిపారు. ఈ ప్రయాణాన్ని భారత అంతర్గత జలమార్గాల ప్రాధికార సంస్థ (ఐడబ్ల్యూఏఐ), అస్సాం పెట్రోకెమికల్స్, కొచ్చిన్ బంకర్స్ ప్రైవేట్ లిమిటెడ్, బంగ్లాదేశ్ భాగస్వాములు సమన్వయం చేశారు. అస్సాం రాష్ట్ర మంత్రులు చరణ్ బోరో, బిమల్ బోరా, సుశాంత బోర్గోహైన్, రాజ్యసభ సభ్యుడు తెరాష్ గోవాలా కార్యక్రమానికి హాజరయ్యారు. దిబ్రుగఢ్ ఎమ్మెల్యే ప్రశాంత ఫుకన్, ఖోవాంగ్ ఎమ్మెల్యే చక్రధర్ గొగోయ్‌తో పాటు ఐడబ్ల్యూఏఐ చీఫ్ ఇంజినీర్ ఏ.కె. బన్సల్, ఏపీసీఎల్ చైర్మన్ బికుల్ చంద్ర దేకా, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రూ.2 లక్షల లంచం డిమాండ్.. ఏసీబీకి చిక్కిన డీఎంహెచ్‌వో స్వర్ణకుమారి

**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబర్ 05:**
జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి (డీఎంహెచ్‌వో) స్వర్ణకుమారి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుపడ్డారు. ఎల్బీనగర్‌లో లైసెన్స్ లేదంటూ మూసివేసిన ఓ ఫిజియోథెరపీ ఆస్పత్రిని తిరిగి తెరవడానికి ఆమె రూ. 2 లక్షలు డిమాండ్ చేసినట్లు ఏసీబీకి ఫిర్యాదు అందింది. ఆ రూ. 2 లక్షల్లో భాగంగా రూ. లక్ష ఇవ్వాలని స్వర్ణకుమారి కోరినట్లు బాధితుడు ఏసీబీ అధికారులకు సమాచారం ఇచ్చాడు. దీంతో ఏసీబీ అధికారులు పథకం ప్రకారం నిఘా పెట్టారు. బాధితుడు రూ. లక్షను హెల్త్ ఇన్‌స్పెక్టర్

ట్రైనెట్ తెలంగాణ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
సాంస్కృతికం
మన సంస్కృతి.. మన గర్వం..


# మిస్ ఎర్త్ ఫైర్ ఇండియా 2026 లాస్యాంజలికి ఆత్మీయ సత్కారం








**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్:**
'మిస్ ఎర్త్ ఫైర్ ఇండియా 2026'గా ఎంపికై కిరీటాన్ని అందుకున్న కుమారి లాస్యాంజలి సంబరాజాను అభినందిస్తూ అక్టోబర్ 5న ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. అభినందన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో లాస్యాంజలిని ఘనంగా సత్కరించి, ఆమె విజయాన్ని అభినందించారు. చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయ గానసభ కళా సుబ్బారావు కళావేదికలో సాయంత్రం 5.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమైంది. ప్రముఖ సాహితీవేత్త డా. ఓలేటి పార్వతీశం ముఖ్య అతిథిగా, నటుడు, దర్శకుడు, నిర్మాత ప్రదీప్ పాల్గొన్నారు. గౌరవ అతిథిగా డా. వై. రమాప్రభ హాజరయ్యారు.
యువత తమ ప్రతిభను గుర్తించి కృషి చేస్తే వివిధ రంగాల్లో ఉన్నత విజయాలు సాధించవచ్చని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు. లాస్యాంజలి సాధించిన విజయాన్ని అభినందిస్తూ, ఆమె మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

# ఆకట్టుకున్న సినీ సంగీత విభావరి




**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్:**
అర్చన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 5న సినీ సంగీత విభావరి నిర్వహించారు. 'ప్రేమ యాత్రలకు బృందావనము -- నందన వనము ఏలలో..?' అనే శీర్షికతో సాగిన కార్యక్రమంలో గాయనీగాయకులు పలు మధుర సినీ గీతాలను ఆలపించారు.
అర్చన వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయ గానసభ కళా లలిత కళావేదికలో సాయంత్రం 4.30 నుంచి రాత్రి 9 గంటల వరకు కార్యక్రమం జరిగింది. సంగీతాభిమానులు పాల్గొని గీతాలను ఆస్వాదించారు.

# ఘనంగా శ్రీ ఎస్ ఆర్ మ్యూజికల్స్ ద్వితీయ వార్షికోత్సవం




**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, అక్టోబరు 5 :**
శ్రీ ఎస్ ఆర్ మ్యూజికల్స్ ద్వితీయ వార్షికోత్సవం, గాయని పి. రమాదేవి జన్మదిన వేడుకలు అక్టోబర్ 5న ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 'అమ్మో... ఒక మనసుకు నేడే పుట్టిన రోజు' శీర్షికతో తెలుగు, హిందీ సినీ గీతాల కార్యక్రమం ఏర్పాటు చేశారు. చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయ గానసభ మారుతి కళావేదికలో మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి 9 గంటల వరకు సాగిన ఈ కార్యక్రమంలో పలువురు గాయనీగాయకులు సినీ గీతాలను ఆలపించారు. సంగీతాభిమానులు కార్యక్రమాన్ని ఆస్వాదించారు.

# ట్రైనెట్ న్యూస్ శశిమోహన కాంతి కిరణం...



**వినాశకాలే విపరీత బుద్ధిః .**
"వినాశకాలే విపరీత బుద్ధిః "అన్నది సంస్కృతంలో ప్రసిద్ధి చెందిన ఒక సూక్తి. ఒక వ్యక్తికి లేదా వ్యవస్థకు నాశనం ఏర్పడినప్పుడు, వారి ఆలోచనలు ,నిర్ణయాలు వినాశనానికి దారి తీసే విధంగా మారుతాయని దీని అర్థం.
ఈ సామెత మానవ నైజానికి ,అహంకారానికి అద్దం పడుతుంది. మనిషి జీవితంలో ఎప్పుడైనా సరే, వివేకం కోల్పోయి అధర్మ మార్గంలో పయనించడం ప్రారంభించినప్పుడు, అతని పతనం నిర్ధారణ అవుతుంది. కాలం కలిసి రానప్పుడు ఎంతటి పండితుడైనా , బలశాలి అయినా సరే తప్పుడు నిర్ణయాలు తీసుకుంటాడని మన చరిత్రలు, పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. అప్పుడే కాదు .ఇప్పటి ఆధునిక సమాజంలో కూడా నిత్యజీవితంలో ఇలాంటి ఉదాహరణలు ఎన్నెన్నో.
మనకు ధర్మానికి హిందూ ఇతిహాసాలు ప్రామాణికాలు. రామాయణ మహాభారతాలలో ఈ సూక్తి లేదా సామెతకు ఖచ్చితమైన ఉదాహరణలు ఉన్నాయి .వేద వేదాంగాలు చదివిన రావణాసురుడు గొప్ప శివ భక్తుడు మరియు మహాబలశాలి .కానీ అతనికి నాశనం దగ్గర పడినప్పుడు సీతాపహరణం అనే తప్పుడు నిర్ణయం తీసుకున్నాడు. తమ్ముడైన విభీషణుడు, భార్య మండోదరి ఎంతగా హితవు చెప్పినా వినలేదు అతని బుద్ధి విపరీతంగా మారడం వల్లనే లంకతో పాటు అతను వంశం మొత్తం సర్వనాశనమైంది.
అలాగే దుర్యోధనుడు. శ్రీకృష్ణుడు స్వయంగా రాయబారిగా వచ్చి ,పాండవులకు ఐదు ఊర్లు ఇస్తే చాలు యుద్ధం వద్దు అని శాంతి వచనాలు పలికినా, దుర్యోధనుడు అహంకారంతో సూది మొన మోపినంత భూమి కూడా ఇవ్వనని భీష్మించుకు కూర్చున్నాడు. ఆ విపరీత బుద్ధి కురువంశ నాశనానికి, కురుక్షేత్ర యుద్ధానికి దారితీసింది.
తరువాతి కాలంలో చారిత్రక ఆధారాలను పరిశీలిస్తే అడాల్ఫ్ హిట్లర్ ప్రపంచం మొత్తాన్ని జయించాలి, నియంతగా తానే శాసించాలి అనే అహంకారంతో ఒకే సమయంలో రష్యా తో పాటు అనేక యుద్ధాలు ప్రకటించి, తన సామ్రాజ్యాన్ని నాశనం చేసుకున్నాడు. అతనే కాదు కొందరు రోమన్ చక్రవర్తులు ,ఫ్రెంచ్ విప్లవం నాటి పాలకులు కూడా ప్రజలలో చెలరేగిన తిరుగుబాటు ధోరణిని గమనించకుండా అహంకారంతో వ్యవహరించి ప్రాణాలు కోల్పోయారు.
ఈ సంఘటనలు కేవలం పురాణాలకో, చరిత్రకో మాత్రమే పరిమితం కాలేదు. ఈ ఆధునిక కాలంలో కూడా అత్యాశ మరియు ఆర్థిక మోసాలు విపరీతంగా ప్రబలిపోయాయి. తక్కువ కాలంలో ఎక్కువ డబ్బు సంపాదించాలని అత్యాశతో చాలామంది సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడతారు .కష్టపడి సంపాదించిన సొమ్మును షేర్ మార్కెట్ జూదాలలో ,బెట్టింగ్ యాప్ లలో ,నకిలీ స్కీములలో పెట్టి రోడ్డున పడుతున్నారు దీన్ని అంతటికి విపరీతమైన ఆశే కారణం.
ఒకప్పుడు ప్రపంచాన్ని ఏలిన నోకియా, కోడక్ వంటి కంపెనీలు కాలంతో పాటు మారడానికి నిరాకరించాయి .తమకు తిరుగులేదు అనుకున్నాయి .కొత్త సాంకేతికను అందిపుచ్చుకోలేదు .మార్కెట్లో తమ పతనం ప్రారంభమైనా సరే పాత పద్ధతులకే మొండిగా అతుక్కుపోవడం వల్ల చాలా నష్టపోయారు. వెనకబడి పోయారు.
మరి కొంతమంది వ్యక్తులు క్షణికావేశంలో చేసే తప్పులు లేదా మద్యం డ్రగ్స్ వంటి వ్యసనాలకు బానిసపటం వల్ల వారి కుటుంబాలు రోడ్డు మీద పడ్డాయి. వారి పిల్లలు భ్రష్టుచెందారు. చట్టం, సమాజం, కుటుంబం ఎంతగా హెచ్చరించినా వినకుండా ప్రవర్తించడం వల్ల ఫలితం స్పష్టంగా కళ్ళకు కట్టినట్లు తెలుస్తున్నది.
మానవ సమాజం అంతా కలిసి చేస్తున్న పెద్ద తప్పు ఏమిటంటే పర్యావరణ నాశనం. గ్లోబల్ వార్మింగ్. కాలుష్యం. వీటివల్ల ఎన్ని అనర్ధాలు జరుగుతున్నాయో మనం కళ్లారా చూస్తున్నాము. మానవుడు స్వార్థంతో చెట్లను నరుకుతూ ,ప్లాస్టిక్ వాడుతూ పర్యావరణాన్ని నాశనం చేస్తున్నాడు. ఫలితంగా వరదలు, తుఫానుల రూపంలో ప్రకృతి మన77లను హెచ్చరిస్తూ ఉన్నది.
మనిషికి సంపద అధికారం పెరిగినప్పుడు దురహంకారం పెరిగిపోతుంది.ఎదుటివారి మాటలు వారు ఎంత మంచిగా చెప్పినా చెడ్డగానే అనిపిస్తాయి.
ఈ సమస్యలకు ఒక్కటే పరిష్కారం. అదేమిటంటే పర్యావరణాన్ని కాపాడుకోవడం. మనకు కష్టాలు ఎదురైనప్పుడు శాంతంగా వివేకంతో ఆలోచించుకొని వ్యవహరించాలి.
ఎవరైనా మంచి మాటలు చెప్పినప్పుడు మన అహంకారాన్ని పక్కనపెట్టి విని విచక్షణతో నడుచుకోవాలి. ఆవేశం అనర్థహతువు. కనుక అన్నిటికీ ఆవేశపడకుండా బుద్ధిని సక్రమంగా అదుపులో ఉంచుకొని విచక్షణతో సరైన నిర్ణయాలు తీసుకున్నప్పుడు మనలను మన కాపాడుకోగలం. వినాశనాన్ని అరికట్టగలం.
"సర్వేజనా సుఖినోభవంతు."

శుభోదయం ...శశిబాల

# ఏఎన్నార్ 102వ జయంతి సందర్భంగా 'సువర్ణ రాగ మాలికలు'




**హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు 5:**
దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, నటసామ్రాట్ డా. అక్కినేని నాగేశ్వరరావు 102వ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 5న 'సువర్ణ రాగ మాలికలు' సంగీత కార్యక్రమం నిర్వహించారు. 'మధుర భావాల సుమమాల... మనసులో పూచే ఈ వేళ' అనే నినాదంతో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఎన్నార్ నటించిన చిత్రాల మధుర గీతాలను ఆలపించారు. వీణాపాణి కళావిలయం, మాగ్నిఫిసెంట్ మ్యూజిక్ ఆధ్వర్యంలో డా. జి.ఎం. శ్రీదేవి సమర్పణగా ఈ కార్యక్రమం జరిగింది. చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయ గానసభ గుండవరపు హనుమంతరావు కళావేదికలో సాయంత్రం 4.30 నుంచి రాత్రి 9 గంటల వరకు కార్యక్రమం కొనసాగింది. ప్రేక్షకులకు ఏఎన్నార్ చిత్రాల మధుర గీతాలను మరోసారి ఆస్వాదించే అవకాశం కల్పించారు.

edited, Printed, Published and Owned by:Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136